www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 14-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 179 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి ఉ.11.10 తదుపరి నవమి; నక్షత్రం: పునర్వసు ఉ.11.54 తదుపరి పుష్యమి, వర్జ్యం: రా.7.56-9.32, దుర్ముహూర్తం: ఉ.8.31-9.17, రా.9.53-10.41; అమృతఘడియలు: ఉ.9.33-11.07, తె.5.34 మొదలు శేషం ఉ.7.10; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.50 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

100% వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు

పీఎఫ్ పాక్షిక ఉపసంహరణ నిబంధనలు

సరళీకరించిన ఈపీఎఫ్‌వో.. విత్‌డ్రా పరిమితుల్లోనూ మార్పు

అన్ని పాక్షిక ఉపసంహరణలకు

కనీస సర్వీసు 12 నెలలకు తగ్గింపు 2

'ప్రత్యేక పరిస్థితుల'కు కారణం చెప్పాల్సిన అవసరం లేదు

ఈపీఎఫ్‌వో ట్రస్టీల సెంట్రల్ బోర్డు నిర్ణయాలు

బాలుడిపై ఉపాధ్యాయుడి

లైంగిక దాడి

ఖమ్మం జిల్లాలో ఓ గురుకులంలో 3 ఏళ్లుగా..

దసరా సెలవుల తర్వాత

బడికి వెళ్లనని మొండికేసిన బాలుడు 3

ఆరా తీయగా వెలుగులోకి దారుణం.. పోక్సో కేసు

పురుగు మందు తాగి నిందితుడి ఆత్మహత్య



నిందితుడు ప్రభాకర్‌రావు (ఫైల్)

జువెనైల్ హోంలో దారుణం

బాలుడిపై స్టాఫ్‌గార్డ్

అఘాయిత్యం.. సైదాబాద్‌లో ఘటన

పోలీసులకు బాధితుడి తల్లి ఫిర్యాదు

లైంగిక దాడి వాస్తవమే..

స్పష్టం చేసిన విచారణ అధికారి

మరికొందరు బాలురపైనా దారుణం?

దర్యాప్తు చేస్తున్న పోలీసులు

సైదాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లోని జువెనైల్ హోంలో ఓ బాలుడిపై స్టాఫ్‌గార్డ్ (సూపర్‌వైజర్) పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలుడి ద్వారా విషయం తెలియడంతో అతడి తల్లి చేసిన ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. జువెనైల్ హోంలో బాధిత బాలుడు 2024 సెప్టెంబరు నుంచి ఉంటూ చదువుకుంటున్నాడు. దసరా సెలవులు రావడంతో అధికారుల అనుమతితో తల్లి ఆ బాలుడిని ఇంటికి తీసుకెళ్లింది. పండుగ తర్వాత కుమారుడిని జువెనైల్ హోంకు

మిగతా 3వ పేజీలో...

హంతకులు, ఫ్యాక్షనిస్టులు, సంచులు తీసుకునేటోళ్లను

ఎలా చేర్చుకుంటారు?



మీడియాతో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

అలాంటి వారిని పార్టీలోకి తీసుకోబోమని

పీసీసీ చీఫ్, సీఎం రేవంత్ క్లారిటీతో ఉన్నారు

మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ చేరికపై వస్తున్న

ఊహాగానాలపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి 13

సర్పంచ్ పదవి కోసం తమ్ముడిని చంపిన

వారు రేపు తననూ చంపొచ్చంటూ వ్యాఖ్య

కాళేశ్వరం మాజీ ఈఎన్‌సీ హరిరామ్

ఆస్తుల జప్తు

- నోటిఫికేషన్ జారీ చేసిన నీటిపారుదల శాఖ
- నిషేధిత జాబితాలోకి హరిరామ్ ఆస్తులు
- ఏఈఈ నికేశ్‌కుమార్ ఆస్తులు కూడా సీజ్
- విజిలెన్స్ కమిషన్‌కు ఈఈ నూనె శ్రీధర్ ఫైలు
- కాళేశ్వరం ప్రాజెక్టులో హరిరామ్ ఆధ్వర్యంలో రూ. 40 వేల కోట్లకుపైగా పనులు



హరిరామ్

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గజ్వేల్ ఈఎన్‌సీ, కాళేశ్వరం ప్రాజెక్టు కార్పొరేషన్ ఎండీగా పనిచేసిన బి.హరిరామ్ ఆస్తులను జప్తు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా నోటిఫికేషన్ జారీ చేశారు. తాజా నోటిఫికేషన్‌తో సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలో 28 ఎకరాల వ్యవసాయ భూమితోపాటు తెలంగాణ, ఏపీలోని పలుచోట్ల హరిరామ్‌కు ఉన్న ఆస్తులను క్రయవిక్రయాలకు ఆస్కారం లేని నిషేధిత జాబితాలో పెట్టనున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హరిరామ్‌ను అరెస్ట్ చేయడంతో ఆస్తుల జప్తు కోసం కోర్టులో ఏసీబీ కేసు వేసింది. దీనికి అనుమతినిస్తూ కోర్టు తీర్పు వెలువడటంతో నీటిపారుదలశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్

మిగతా 14వ పేజీలో...

జప్తు కానున్న ఆస్తులు

- సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలో 28 ఎకరాలు
- షేక్‌పేట, కొండాపూర్‌లో విల్లాలు
- మాదాపూర్, శ్రీనగర్ కాలనీ, నార్సింగ్‌లో ఫ్లాట్లు
- ఏపీ రాజధాని అమరావతిలో వాణిజ్య స్థలం
- శ్రీనగర్ కాలనీలో రెండు ఇళ్లు
- పటాన్‌చెరులో 20 గుంటలు
- బొమ్మలరామారంలో 6 ఎకరాల్లో మామిడి తోట
- కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న భవనం
- కుత్బుల్లాపూర్, మిర్యాలగూడలో ఓపెన్ ప్లాట్లు

పునరుద్ధరణ డిజైన్లు మేం ఇస్తాం

- కాళేశ్వరం బ్యారేజీలపై ముందుకొచ్చిన 3 ఐఐటీలు
- నిస్సాన్, ఆర్వీ అసోసియేట్స్, స్పెయిన్ సంస్థ కూడా
- నిబంధనలు సడలించాలని కోరిన సంస్థలు 14
- వారంపాటు గడువు పెంపునకూ ప్రభుత్వం ఓకే!



సుప్రీంలో బీసీ పిటిషన్

సోమవారం అర్ధరాత్రి దాఖలు

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును

సవాల్ చేస్తూ వేసిన రాష్ట్ర సర్కారు

ఈ వారంలోనే విచారణకు వచ్చే చాన్స్

42% రిజర్వేషన్లపై పట్టు వీడని రేవంత్

ఒకటికి రెండు సార్లు అంశాల పరిశీలన

ఢిల్లీలో ఉండి పర్యవేక్షించిన మహేశ్‌గౌడ్

న్యూఢిల్లీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల పెంపుపై హైకోర్టు ఇచ్చిన స్టేను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నందున.. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బీసీ రిజర్వేషన్లను పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవో 9ను నిలిపివేస్తూ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై నాలుగైదు రోజులుగా ప్రత్యేకంగా దృష్టి సారించారు. సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీతోపాటు రవి వర్మలతో వరసగా

మిగతా 13వ పేజీలో...

గాజాలో ఎట్టకేలకు

శాంతి గీతం

పరస్పరం బందీలను విడుదల చేసిన హమాస్, ఇజ్రాయెల్



హమాస్ చెర నుంచి విడుదలైన ఓ ఇజ్రాయెలీ ఆనందం; ఇజ్రాయెల్ జైలు నుంచి విడుదలైన పాలస్తీనా వాసులు

20 మంది ఇజ్రాయెలీలను రెడ్‌క్రాస్‌కు అప్పగించిన హమాస్

1,968 మంది పాలస్తీనీయులను విడుదల చేసిన ఇజ్రాయెల్

ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ట్రంప్‌కు అపూర్వ స్వాగతం

గాజాలో యుద్ధం ముగిసింది: ట్రంప్ ప్రకటన

శాంతికి కట్టుబడతా: నెతన్యాహు.. ట్రంప్‌కు హమాస్ కృతజ్ఞతలు

ట్రంప్‌కు ఇజ్రాయెల్, ఈజిప్ట్ అత్యున్నత పురస్కారాలు

200% టారిఫ్‌లు వేస్తానని బెదిరించి భారత్-పాక్ యుద్ధం ఆపా

పాక్-అఫ్ఘానిస్థాన్ యుద్ధాన్ని కూడా ఆపుతా: ట్రంప్

గాజా రెండోదశ శాంతి ఒప్పందంపై ఈజిప్టులో సంతకాలు

దేర్ అల్‌బలా(గాజా)/టెల్ అవీవ్/జేరుసలేం, అక్టోబరు 13: పశ్చిమాసియాలో శాంతి కపోతం ఎగిరింది. ఇజ్రాయెల్ దాడులతో రెండేళ్లుగా అతలాకుతలమైన గాజాలో ప్రశాంతత నెలకొనేందుకు మార్గం సుగమమైంది. ట్రంప్ శాంతి ప్రణాళిక అమల్లో భాగంగా తొలిదశ కింద సోమవారం ఇరుపక్షాలు బందీలను విడుదల చేశాయి. హమాస్ తమ వద్ద బందీలుగా

మిగతా 2వ పేజీలో...

రష్యా యుద్ధం ముగించకుంటే ఉక్రెయిన్‌కు

తొమాహక్ క్షిపణులిస్తాం: ట్రంప్ 2

అణ్వాయుధాలు ఇస్తున్నట్లే భావిస్తాం: రష్యా

అవును.. ఆ ఇంట్లో

43 ఓట్లున్నాయ్

అది బహుళ అంతస్తుల భవనం 14

ప్రస్తుతం నలుగురే అక్కడ ఉన్నారు

39 మంది ఇళ్లు ఖాళీ చేసి వెళ్లారు

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 43 ఓట్లు ఉన్న ఇంటిపై ఎన్నికల అధికారి స్పష్టత

లాలు కుటుంబానికి

షాక్

2

ఐఆర్‌సీటీసీ అవినీతి కేసులో

ఢిల్లీ కోర్టులో అభియోగాల నమోదు

లాలు ప్రసాద్, రబ్రీదేవి, తేజస్వీ

యాదవ్‌లపై మోసం, కుట్ర ఆరోపణలు

ఈ నెలాఖరు నుంచి విచారణ ప్రారంభం

బిహార్ ఎన్నికల వేళ ఆర్జేడీకి సంకటం

రాజకీయ కక్షతోనే మా కుటుంబంపై అభియోగాలు: తేజస్వీ విమర్శ

'సృజనాత్మక విధ్వంసానికి' సైద్ధాంతిక పునాది

జోయల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు ఆర్థికశాస్త్రం నోబెల్

కొత్త విధానాలు, టెక్నాలజీలతోనే పాత వ్యాపార నమూనాలు కనుమరుగు

ఈ ప్రక్రియ కొనసాగితేనే 2

స్తబ్ధత లేకుండా ఆర్థికరంగం పరుగులు

పీఎం కిసాన్ పక్కదారి!

లక్షలాది కుటుంబాలకు అనుచిత లబ్ధి

నిబంధనల ప్రకారం కుటుంబంలో ఒక్కరికే

కానీ.. పలు రాష్ట్రాల్లో భార్యా భర్తలిద్దరికీ

అందుతున్న పీఎం కిసాన్ నిధులు

31 లక్షల కేసులు గుర్తించిన కేంద్రం

తనిఖీలు చేయాలని రాష్ట్రాలకు సూచన

ఇప్పటికి 19.02 లక్షల కేసుల పరిశీలన

17.87 లక్షల మంది భార్యాభర్తలు

ప్రయోజనం పొందుతున్నారని వెల్లడి

భూముల పూర్వపు యజమానులు కూడా..

తనిఖీల పూర్తికి రేపటి వరకు గడువు



న్యూఢిల్లీ, అక్టోబరు 13: మోదీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం పక్కదారి పడుతోంది. ఈ స్కీంలో కొందరు అనుచిత లబ్ధి పొందుతున్నట్లు తేలింది. ఒకే ఇంట్లో భార్య, భర్త ఇద్దరికీ నిధులు జమవుతున్నాయని.. ఇలాంటి అనుమానాస్పద కేసులు 31.01 లక్షల వరకు ఉన్నట్లు కేంద్రప్రభుత్వం గుర్తించింది. కేంద్ర వ్యవసాయ-రైతు సంక్షేమ శాఖ తనిఖీల్లో ఇది బయటపడింది. ఈ వివరాలను సంబంధిత రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలకు పంపింది. క్షుణ్ణంగా సోదాలు చేసి తనకు నివేదించాలని కోరింది. ఈ 31.01 లక్షల మందిలో ఇప్పటివరకు 19.02 లక్షల మంది లబ్ధిదారులను తనిఖీచేయగా.. 93.98 శాతం.. అంటే 17.87 లక్షల

మిగతా 10వ పేజీలో...



బాబోయ్.. కిడ్నీ, క్యాన్సర్!

రాష్ట్రంలో అత్యధికంగా నమోదవుతున్న కేసులివే

ఆ తర్వాత ఎముకలు, గుండె సంబంధిత జబ్బులు

రాష్ట్రవ్యాప్తంగా వైద్యశాఖ అధ్యయనం

2020-25లో ప్రైవేటు ఆస్పత్రుల్లో కేసుల విశ్లేషణ

ఎక్కువ కేసులున్న విభాగాల బలోపేతానికి చర్యలు!

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కిడ్నీ, క్యాన్సర్ కేసుల తీవ్రత పెరుగుతోంది. గత ఐదేళ్లలో రాష్ట్రంలో నమోదవుతున్న టాప్ 10 కేసుల్లో ఇవి 1, 2 స్థానాల్లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆరోగ్యశ్రీలో నమోదవుతున్న కేసుల ఆధారంగా చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. రాష్ట్రంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో 2020-25 మధ్య నమోదైన కేసుల సమాచారాన్ని

మిగతా 14వ పేజీలో...

సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

- విద్యార్థులకు అందే సేవలకు యాప్‌లు
- వసతి గృహాల నిర్వహణకు రూ. 60 కోట్లు
- విద్యార్థులు, ఉద్యోగులకు బయోమెట్రిక్
- ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం రేవంత్

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ శాఖల వసతి గృహాల్లో అత్యవసర పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.60 కోట్లు కేటాయించింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వసతి గృహాల్లో డైట్ చార్జీలు, తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వినియోగించుకునేందుకు గాను ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి ఈ నిధులు

మిగతా 13వ పేజీలో...

వైద్య రంగం బలోపేతానికి ప్రపంచ బ్యాంకు రుణం రూ.4,150 కోట్లు.. సర్కారు నిర్ణయం 13

సీఎం కావాలంటే హైకమాండ్ ఆశీర్వాదం, ఎమ్మెల్యేల మద్దతూ ఉండాలి



బెంగళూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కావాలంటే పార్టీ హైకమాండ్ ఆశీర్వాదంతోపాటు ఎమ్మెల్యేల మద్దతు కూడా ఉండాలని కర్ణాటక సీఎం సిద్దరామయ్య అన్నారు. 'నవంబరులో నాయకత్వ మార్పు, మంత్రివర్గ ప్రక్షాళన' అంటూ వారం రోజులుగా చర్చలు సాగుతున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. బాగల్కోట జిల్లా బండిగణిలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ...ఎమ్మెల్యేల మద్దతు లేకుండా సీఎం కావడం సులభం కాదని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించరాదని మంత్రి ప్రియాంకఖర్గే తనకు లేఖ రాశారని, తమిళనాడులో ఎలా వ్యవహరించారో.. ఇక్కడా అలాగే వ్యవహరించాలని చీఫ్ సెక్రటరీకి సూచించానని తెలిపారు. బెంగళూరులో మంత్రులతో సోమవారం విందు ఏర్పాటు చేయడంపై..'మరోసారి విందు ప్రత్యేకత ఏమిటి?' అని ప్రశ్నించగా, కలిసి భోజనం చేయడం కూడా నేరమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేను సీఎం అయితే గ్యారెంటీలనిచ్చేవాడిని కాదు

» కర్ణాటక కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్‌వీ దేశ్‌పాండే

బెంగళూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాను ముఖ్యమంత్రిని అయ్యుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలను అమలు చేసేవాడిని కాదని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే ఆర్‌వీ దేశ్‌పాండే అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులు మహిళలకు మాత్రమే అనేలా మారాయని, పురుషులకు సీట్లు దొరకడం లేదని పేర్కొన్నారు. 'ఓ దేవుడా.. ధారవాడ, బెళగావి, కలబురగితోపాటు రేణుకా యల్లమ్మ ఆలయాలకు మహిళలకు తరలిపోతున్నారు. ఆ ప్రాంతంలో బస్సుల్లో పురుషులు ప్రయాణించాలంటే తిప్పలు పడాల్సి వస్తోంది' అని వ్యాఖ్యానించారు. గృహలక్ష్మి ద్వారా నెలకు రూ.2వేలు ఇస్తున్నారని, ఇది మహిళలకు లాటరీ కొట్టినట్లుగా ఉందని, పురుషుల పరిస్థితి మరింత అధ్వానమైందని, ఇంకా ఎక్కువగా మాట్లాడాలంటే పురుషులను పరోక్షంగా శిక్షించినట్లు ఉందని పేర్కొన్నారు. కాగా, ఆర్‌వీ దేశ్‌పాండే చేసిన వ్యాఖ్యలపై సీఎం సిద్దరామయ్య వివరణ కోరారు.

కేంద్ర మంత్రిగా దిగిపోతా..సినిమాలు చేసుకుంటా



తిరువనంతపురం, అక్టోబరు 13: కేంద్ర మంత్రి, నటుడు సురేశ్ గోపి మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రి అయినప్పటి నుంచి తన ఆదాయం గణనీయంగా తగ్గిందని, మళ్లీ సినిమాల్లో నటించాలని అనుకొంటున్నట్లు పేర్కొన్నారు. పార్టీ తనను తొలగించి.. బీజేపీ రాజ్యసభ ఎంపీ సదానందన్ మాస్టార్‌ను కేంద్ర మంత్రిగా చేస్తే, అది కేరళ రాజకీయాల్లో కొత్త చరిత్ర అవుతుందన్నారు. సురేశ్ గోపి కేరళలో బీజేపీ నుంచి గెలిచిన ఏకైక లోక్‌సభ ఎంపీగా ఉన్నారు. ఆయన కన్నూరులో ఆదివారం సదానందన్ మాస్టార్ ఎంపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేశ్ గోపి మాట్లాడుతూ.. 'నేను డబ్బు సంపాదించాలని అనుకుంటున్నాను. నా పిల్లలు ఇంకా జీవితంలో సెటిల్ కాలేదు. నా ఆదాయంపై ఆధారపడ్డ వారు కొంత మంది ఉన్నారు' అని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాల తారుమారుపై సిట్‌కు సుప్రీం నో

న్యూఢిల్లీ, అక్టోబరు 13: గత ఎన్నికల్లో బెంగళూరు సెంట్రల్ సహా కర్ణాటకలోని లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలను తారుమారుచేశారని.. దీనిపై మాజీ న్యాయమూర్తి సారథ్యంలో సిట్ ఏర్పాటుచేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ)ని ఆశ్రయించాలని సూచించింది. ప్రజాప్రయోజనం పేరుతో పిటిషన్ వేశారని.. దీనిపై విచారణకు తాము సానుకూలంగా లేమని స్పష్టంచేసింది. ప్రత్యామ్నాయ చట్టబద్ధమైన మార్గాలను అన్వేషించాలని హితవు పలికింది. ఈసీ, బీజేపీ కుమ్మక్కయ్యాయని.. బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలో భారీగా దొంగ ఓట్లను చేర్చారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలను పిటిషనర్ తన వ్యాజ్యంలో ప్రస్తావించారు.

బంగారు పలకలకు మాదే బాధ్యత: టీడీబీ చైర్మన్

తిరువనంతపురం, అక్టోబరు 13: కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో బంగారం అవకతవకల కేసు విచారణలో పూర్తి సహకారం అందిస్తామని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) చైర్మన్ పీఎస్ ప్రశాంత్ అన్నారు. బోర్డు పూర్తి నిజాయితీ, పారదర్శకతతో వ్యవహరించిందని చెప్పారు. ప్రస్తుతం విగ్రహాల బంగారు పూత కోసం తీసుకున్న బంగారు పలకలకు బోర్డు పూర్తి బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. బంగారు పలకలను తీసుకునేముందు అవసరమైన అన్ని ప్రమాణాలు పాటించినట్టు వెల్లడించారు. 1998 నుంచి ఏం జరిగిందనే దానిపై విచారణ చేయాలన్నారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, రిటైర్డ్ అయినా వదిలిపెట్టరాదని కోరారు. ప్రస్తుత బోర్డును అనుమానించడానికి ఎలాంటి కారణం లేదని, తగ్గిన బంగారాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. శబరిమల ఆలయంలో బంగారు తొడుగుల బరువులో 4.5 కిలోలు తగ్గడాన్ని తీవ్రంగా పరిగణించిన కేరళ హైకోర్టు సిట్‌తో విచారణ చేయించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే.

పశ్చిమబెంగాల్ గ్యాంగ్‌రేప్ కేసులో మరో ఇద్దరు అదుపులోకి

కోల్‌కతా, అక్టోబరు 13: పశ్చిమబెంగాల్‌లో వైద్య విద్యార్థిని గ్యాంగ్‌రేప్ కేసులో సోమవారం మరో ఇద్దరిని ఆ రాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో మొత్తం అరెస్టయిన వారి సంఖ్య ఐదుకు చేరింది. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ వైద్య విద్యార్థిని అర్ధరాత్రి 12.30 గంటలకు బయటకు ఎందుకు వెళ్లిందని ప్రశ్నించారు. అయితే ఆ వ్యాఖ్యలకు భిన్నంగా ఆ రాష్ట్ర పోలీసులు ఈ ఘటన శుక్రవారం రాత్రి 8-8.45 గంటల మధ్యే జరిగిందని నిర్ధారించారు. కాగా బాధితురాలి వెంట బయటకు వెళ్లిన ఆమె స్నేహితుణ్ని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఈ ఘటన పశ్చిమబెంగాల్‌లో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. ప్రతిపక్ష బీజేపీ నేత సువేందు అధికారి ఈ కేసులో సాక్ష్యాధారాలను నాశనం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

బీజేపీ బలమైన రాజకీయ ప్రత్యర్థి: ఒవైసీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 13: బీజేపీని 'బలమైన రాజకీయ ప్రత్యర్థి' అని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఆ పార్టీ, నేతలు కార్యకర్తలు రాత్రింబవళ్లు పని చేస్తారని ప్రశంసించారు. "బీజేపీని ఓడించడం అంత సులువు కాదు. తాను అనుకున్న పనిని రెప్పపాటు కాలంలో చేయగలదు. ప్రతిపక్షాలు బీజేపీని ఎదుర్కోవాలంటే దాని ప్రతి కదలికపై అప్రమత్తంగా ఉండాలి" అని ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. అలాగే, బిహార్‌లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశంపై తమ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ 'ఓట్ చోరీ' ఆరోపణలపై.. ఆయన తరపున మాట్లాడలేనని, కానీ బీజేపీలా పోరాట పటిమను చూపకపోతే ఆ పార్టీని ఓడించలేమని ఓవైసీ అన్నారు.

ఈ వారం అమెరికాకు భారత వాణిజ్య బృందం

న్యూఢిల్లీ, అక్టోబరు 13: అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దిశగా తదుపరి దశ చర్చల నిమిత్తం భారతదేశ ఉన్నతస్థాయి వాణిజ్య ప్రతినిధి బృందం ఈ వారం అమెరికాకు వెళ్లనుంది. ఢిల్లీలోని ప్రభుత్వ వర్గాలు సోమవారం ఈ విషయాన్ని వెల్లడించాయి. వాణిజ్య ఒప్పందం దిశగా పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించుకునేందుకు తదుపరి దశ చర్చలు జరపనున్నట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఇంధన, సాంకేతిక రంగాల్లో వాణిజ్యాన్ని విస్తరించడం తదితర అంశాలపై చర్చలు జరపనున్నట్టు తెలిపాయి. అమెరికా నుంచి మరింత సహజ వాయువును కొనుగోలు చేయాలని, పునరుత్పాదక ఇంధన సాంకేతికతలను దిగుమతి చేసుకోవాలని భారత్ భావిస్తోందని ఒక అధికారి చెప్పారు. ఇరుదేశాల మధ్య చర్చలు మంచి పురోగతి సాధించాయన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న కారణంతో భారత్‌పై ట్రంప్ భారీ సుంకాలను విధించిన సంగతి తెలిసిందే.

గాజాలో ఎట్టకేలకు శాంతి గీతం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న 20 మందిని గాజాలోని మూడు ప్రాంతాల్లో రెడ్‌క్రాస్ సంస్థకు అప్పగించగా.. ఆ సంస్థ వారిని ఇజ్రాయెల్‌కు తరలించింది. మరో 28 మంది బందీలు చనిపోవడంతో వారి మృతదేహాలను అప్పగించేందుకు హమాస్ ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు ఇజ్రాయెల్ తమ వద్ద బందీలుగా ఉన్న 19 వందలకుపైగా పాలస్తీనా ఖైదీల విడుదల ప్రక్రియ ప్రారంభించింది. ఇజ్రాయెల్ ఆక్రమణలో ఉన్న వెస్ట్‌బ్యాంక్‌లోని పలు జైళ్ల నుంచి సోమవారం రాత్రివరకు 1968 మందిని విడుదల చేసింది. గాజా ప్రాంతంలో ఆకలితో అల్లాడుతున్న ప్రజలకు సోమవారం నుంచే పూర్తిస్థాయిలో మానవతాసాయం అందించేందుకు అనుమతించింది. ఒప్పందం మేరకు గాజాలోని పలు ప్రాంతాల నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకునే ప్రక్రియను ప్రారంభించింది. తమవారు విడుదలవుతుండటంతో ఇజ్రాయెల్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.పాలస్తీనీయులు మానవతాసాయం కింద ఆహారం, మందులు అందబోతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడ చూసినా మృతదేహాలే..

ఇజ్రాయెల్ సైన్యం వైదొలుగుతున్న కొద్దీ ఆయా ప్రాంతాల్లోకి పాలస్తీనీయులు తిరిగి ప్రవేశిస్తున్నారు. ఎక్కడ చూసినా కూలిపోయిన భవనాలు, శిథిలాలతో ఆ ప్రాంతాలు దారుణంగా కనిపిస్తున్నాయి. కాల్పుల విరమణ మొదలైన నాలుగు రోజుల్లోనే గాజాలోని సంక్షుభిత ప్రాంతాల్లో 200 మృతదేహాలను వెలికితీశామని.. ఇంకా పెద్ద సంఖ్యలో మృతదేహాలు శిథిలాల కిందే ఉన్నాయని గాజా ఆరోగ్య విభాగం ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడుల్లో మృతుల సంఖ్య 67,800కు చేరిందని, అందులో సగం మందికిపైగా మహిళలు, చిన్నారులేనని పేర్కొంది. కాగా, శాంతి ఒప్పందంతో గాజాలోని పాలస్తీనియులకు తిరిగి స్వేచ్ఛ వచ్చిందని, చెల్లాచెదురైన వారంతా తమ కుటుంబాలను కలుసుకుంటారని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ పేర్కొన్నారు. ఇక గాజాలో శాంతి నెలకొల్పేందుకు ట్రంప్ చేసిన కృషి అమోఘమని ప్రధాని మోదీ కితాబిచ్చారు. ఇజ్రాయెల్, హమాస్‌ల నుంచి బందీల విడుదలపై హర్షం వ్యక్తం చేశారు.



ఈజిప్టులోని షర్మ్ ఎల్ షేక్ నగరంలో సోమవారం జరిగిన శాంతి సదస్సులో ట్రంప్, పలు దేశాల అధినేతలు

గాజాలో యుద్ధం ముగిసింది: ట్రంప్

శాంతి ఒప్పందం, ఇతర అంశాలపై ఇజ్రాయెల్ పర్యటనకు వచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఆ దేశ చట్టసభ కెనెసెట్‌లో ప్రసంగించారు. ఆయన సభలోకి రాగానే ఇజ్రాయెల్ ఎంపీలంతా లేచి నిలబడి రెండున్నర నిమిషాల పాటు కరతాళధ్వనులు చేశారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. "యుద్ధాలతో ప్రజలు విసిగిపోయి ఉన్నారు. ఇప్పుడు శాంతి నెలకొల్పే సమయం. గాజాలో యుద్ధం ముగిసింది. ఉగ్రవాదంపై మీరు (ఇజ్రాయెల్) విజయం సాధించారు. ఆ విజయాన్ని శాంతిగా మలుచుకునే సమయం ఇది. భవిష్యత్తు తరాలు ఈ రోజును గుర్తు చేసుకుంటాయి.." అని పేర్కొన్నారు. గాజా పునర్నిర్మాణానికి సాయం చేస్తామని.. పాలస్తీనీయులు ఉగ్రవాదం, హింసను వీడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మాట్లాడుతూ.. శాంతిని నెలకొల్పడానికి తాను కట్టుబడి ఉంటానని, రెండేళ్ల యుద్ధం ముగిసిందని చెప్పారు. అమెరికా అధ్యక్షుల్లో అందరికన్నా ట్రంప్ ఇజ్రాయెల్‌కు గొప్ప స్నేహితుడని అభివర్ణించారు. గాజాలో యుద్ధం ముగిసిపోయిందన్న ట్రంప్ వ్యాఖ్యలపై హమాస్ హర్షం వ్యక్తం చేసింది.



ట్రంప్‌కు బంగారు పావురాన్ని బహూకరిస్తున్న నెతన్యాహు

ట్రంప్‌కు ఇజ్రాయెల్, ఈజిప్ట్ అత్యున్నత పురస్కారాలు

పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పేందుకు ట్రంప్ చేసిన కృషికి గుర్తింపుగా ట్రంప్‌కు 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ హానర్' పురస్కారం అందజేయనున్నట్టు ఇజ్రాయెల్.. 'ది ఆర్డర్ ఆఫ్ ది నైల్' పురస్కారాన్ని అందజేయనున్నట్టు ఈజిప్ట్ ప్రకటించాయి.

200% టారిఫ్‌లు వేస్తానని బెదిరించి భారత్-పాక్ యుద్ధం ఆపా: ట్రంప్

గాజా శాంతి ఒప్పందంతో కలిపి ఇప్పటివరకు 8 యుద్ధాలను ఆపానని ట్రంప్ చెప్పారు. వాటిలో చాలా వరకు తాను కల్పించుకున్న ఒక్కరోజులోనే నిలిపివేశానన్నారు. ఇజ్రాయెల్ నుంచి ఈజిప్ట్‌కు వెళ్తుండగా ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని చెప్పారు. "మీవద్ద అణ్వాయుధాలు ఉన్నాయి. మీరు యుద్ధం కొనసాగించాలనుకుంటున్నారా? అని అడిగా.. అలా అయితే మీపై వంద శాతం, 150 శాతం, 200శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించా. 24 గంటల్లో సమస్యను పరిష్కరించా" అని పేర్కొన్నారు. ప్రస్తుతం పాక్-అఫ్ఘానిస్థాన్ మధ్య యుద్ధం జరుగుతోందని తన దృష్టికి వచ్చిందని, దాన్ని కూడా తాను ఆపేయిస్తానని ట్రంప్ చెప్పారు. తాను నోబెల్ శాంతి బహుమతి కోసం ఇదంతా చేయడం లేదని, ప్రజల ప్రాణాలు కాపాడేందుకే చేస్తున్నానని చెప్పారు. అయినా ఇటీవల ఇచ్చిన నోబెల్ 2024 ఏడాదికి సంబంధించి చేసిన ఎంపిక అని, తాను యుద్ధాలను ఆపినది 2025లోనని పేర్కొన్నారు.

లోకం తీరు



రెండో దశ శాంతి ఒప్పందంపై సంతకాలు



గాజాలో శాంతి నెలకొల్పేందుకు ఉద్దేశించిన ట్రంప్ శాంతి ప్రణాళిక రెండో దశ అమలుపై చర్చించి, ఒప్పందం చేసుకునేందుకు ఈజిప్ట్‌లోని షర్మ్ ఎల్ షేక్ నగరంలో సోమవారం సాయంత్రం శాంతి సదస్సు నిర్వహించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తోపాటు ఫ్రాన్స్, ఈజిప్ట్, ఖతార్, టర్కీ, అజర్‌బైజాన్ అధ్యక్షులు, జర్మనీ చాన్సలర్, స్పెయిన్, నార్వే, గ్రీస్, ఇరాక్, కెనడా, పాకిస్థాన్, బ్రిటన్ ప్రధాన మంత్రులు, బహ్రెయిన్ రాజు హమద్ బిన్ అల్ ఖలీఫా, జోర్డాన్ రాజు అబ్దుల్లా, పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్, పలు అరబ్, ముస్లిం దేశాల ప్రతినిధులు ఇందులో పాల్గొని చర్చించారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, హమాస్ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొనలేదు. సదస్సులో మొదట ట్రంప్ మాట్లాడారు. రెండో దశ ఒప్పందంపై తొలుత ట్రంప్ సంతకం చేయగా, తర్వాత మిగతా దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. గాజా ప్రజలకు మంచి జీవితాన్ని తిరిగి అందించేందుకు భారీ స్థాయిలో పునర్నిర్మాణం చేపడతామని ట్రంప్ ఈ సందర్భంగా తెలిపారు. అయితే గాజాను నిస్సైనికీకరణ చేయడం తప్పనిసరని స్పష్టం చేశారు. గాజాలో కొత్తగా పాలస్తీనా భద్రతా దళాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాగా, గాజా పునర్నిర్మాణం కోసం సుమారు రూ.4.7 లక్షల కోట్లు (53 బిలియన్ డాలర్లు) అవసరమని అంచనా వేశారు. ఈ మేరకు నిధుల సమీకరణ, పునర్నిర్మాణంపై నవంబర్‌లో గాజాలో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తామని ఈజిప్ట్ తెలిపింది.

యుద్ధాన్ని త్వరగా ముగించకుంటే ఉక్రెయిన్‌కు తొమాహక్ క్షిపణులు!

» రష్యాకు ట్రంప్ గట్టి హెచ్చరిక

వాషింగ్టన్, అక్టోబరు 13: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యాకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని వీలైనంత పరిష్కరించుకోకుంటే కీవ్‌కు దీర్ఘశ్రేణి తొమాహక్ క్షిపణులను అందజేస్తామన్నారు. ఈ క్షిపణులు యుద్ధంలో దూకుడుకు మారు పేరని అభివర్ణించారు. తమ కీలక ఆయుధ వ్యవస్థ ద్వారా పుతిన్ సర్కారుపై ఒత్తిడి తెచ్చేందుకు ఏ మాత్రం వెనకాబోమని ట్రంప్ సూచనప్రాయంగా తెలిపారు. 'ఇప్పటికైనా ఈ యుద్ధం పరిష్కారం కాకపోతే నేను వారికి తొమాహక్‌లను పంపిస్తాను. తొమాహక్ ఒక అద్భుత ఆయుధం. చాలా ప్రమాదకరమైంది కూడా.. కానీ రష్యా అంతదూరం తెచ్చుకోదని భావిస్తున్నాను. మిస్టర్ పుతిన్ ఇప్పటికైనా దీన్ని పరిష్కరించుకుంటే ఆయనకే మంచిది' అని అన్నారు. ఆదివారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడిన తర్వాత ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. దీనిపై రష్యా తీవ్రంగా స్పందించింది. ఉక్రెయిన్‌కు తొమాహక్‌లను ఇస్తే.. అణ్వాయుధాలను ఇచ్చినట్లే భావిస్తామని తెలిపింది. ఆ దేశ మాజీ అధ్యక్షుడు డిమిత్రి మెద్వెదేవ్ మాట్లాడుతూ.. 'ఈ క్షిపణుల సరఫరా అనేది ట్రంప్‌తో సహా అందరికీ పీడకలలా మారవచ్చు. అణ్వాయుధాలను మోసుకెళ్లే తొమాహక్ క్షిపణులను ప్రయోగించిన తర్వాత.. వాటికీ సంప్రదాయ క్షిపణులకు తేడా గుర్తించడం అసాధ్యం. సూటిగా చెప్పాలంటే తొమాహక్‌లను మాస్కో అణ్వాయుధాలుగానే భావిస్తోంది. అందుకు తగినట్లుగానే ప్రతిస్పందిస్తుంది' అని వ్యాఖ్యానించారు. అంతకుముందు క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు.

లాలూ కుటుంబానికి షాక్

ఐఆర్‌సీటీసీ అవినీతి కేసులో ఢిల్లీ కోర్టు అభియోగాలు

» లాలూ, రబ్రీ, తేజస్విపై మోసం, కుట్ర ఆరోపణలు.. బిహార్ ఎన్నికల వేళ ఆర్జేడీకి ఇబ్బందికర పరిస్థితులు



సోమవారం రౌజ్ అవెన్యూ కోర్టులో లాలూ, రబ్రీ దేవి, తేజస్వి యాదవ్

న్యూఢిల్లీ, అక్టోబరు 13: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ రాష్ట్ర మాజీ సీఎం, ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ కుటుంబానికి షాక్ తగిలింది. ఐఆర్‌సీటీసీ అవినీతి కేసులో లాలూతో పాటు ఆయన భార్య రబ్రీదేవీ, కుమారుడు తేజస్వీ యాదవ్‌పై సోమవారం ఢిల్లీ కోర్టు అభియోగాలు మోపింది. బిహార్ అసెంబ్లీకి వచ్చే నెల 6, 11 తేదీల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో రాష్ట్రంలో ప్రధాన పార్టీ అయిన ఆర్జేడీకి ఇది ఇబ్బందికర పరిస్థితే. రబ్రీదేవి, తేజస్విపై మోసం, కుట్ర అభియోగాలు; లాలూపై అవినీతి నిరోధక చట్టం కింద అభియోగాలు మోపినట్లు రౌజ్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి విశాల్ గాగ్నే ప్రకటించారు. రైల్వే మంత్రిగా లాలూ తన పదవిని దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. భూముల బదిలీ విషయంలో నిందితులపై తీవ్ర అనుమానాలు ఉన్నాయని తెలిపారు. అతి తక్కువ ధరకు కేటాయించడంతో ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. కాగా, తాము ఏ తప్పూ చేయలేదని బిహార్ మాజీ సీఎంలు లాలూ, రబ్రీ, మాజీ డిప్యూటీ సీఎం, బిహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత తేజస్వి కోర్టుకు వెల్లడించారు. ఈ కేసులో ఈ నెల చివరి వారంలో వీరిపై విచారణ ప్రారంభం కానుంది. కోర్టు ఆదేశాలను హైకోర్టులో సవాలు చేస్తామని పిటిషనర్ల తరఫు న్యాయవాది తెలిపారు. లాలూ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో(2004-09) ఐఆర్‌సీటీసీ హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టుల కేటాయింపులో అవినీతి జరిగిందంటూ సీబీఐ 2017లో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కాంట్రాక్టులను పట్నాకు చెందిన సుజాత హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు. దానికి బదులుగా లాలూ ఓ బినామీ కంపెనీ ద్వారా ఖరీదైన ప్రాంతంలో 3 ఎకరాల భూమిని పొందారని సీబీఐ ఆరోపించింది. ఢిల్లీ కోర్టు అభియోగాలు మోపడంపై తేజస్వీ యాదవ్ స్పందిస్తూ.. ఇదంతా రాజకీయ కక్షతోనే చేశారన్నారు. బిహార్‌లో ఎన్నికలు ఉన్నందునే ఇలా చేశారని ఆరోపించారు. కోర్టు ఆదేశాలను తాము గౌరవిస్తామని, ఈ కేసును ఎదుర్కొంటామని చెప్పారు.

ఆర్జేడీ పాలన అంటేనే కుంభకోణాలు: బీజేపీ

ఆర్జేడీ పాలన అంటేనే కుంభకోణాలని బీజేపీ ఆరోపించింది. ఐఆర్‌సీటీసీ అవినీతి కేసులో ఢిల్లీ కోర్టు లాలూ కుటుంబంపై అభియోగాలు మోపిన నేపథ్యంలో బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ స్పందించారు. కుంభకోణాలు, ప్రభుత్వ కాంట్రాక్టుల కేటాయింపులో అవకతవకలు, ఉద్యోగాలు కల్పిస్తామంటూ ప్రజల భూములు లాక్కోవడం.. లాలూ ప్రసాద్ మోడల్ పరిపాలన అంటే ఇదేనని విమర్శించారు.

'సృజనాత్మక విధ్వంసానికి' సైద్ధాంతిక పునాది

» జోయల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు ఆర్థికశాస్త్రం నోబెల్



జోయల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్,పీటర్ హోవిట్


స్టాక్‌హోం, అక్టోబరు 13: ఆర్థికశాస్త్రంలో కీలక అంశమైన 'సృజనాత్మక విధ్వంసం' ను వివరించి, తాజా పరిస్థితులకు అనుగుణంగా అన్వయించినందుకుగాను అమెరికాకు చెందిన జోయల్ మోకిర్, పీటర్ హోవిట్, బ్రిటన్‌కు చెందిన ఫిలిప్ అఘియోన్ ఈ ఏడాది ఆర్థికశాస్త్రం నోబెల్ బహుమతికి సంయుక్తంగా ఎంపికయ్యారు. ఈ మేరకు నోబెల్ కమిటీ సోమవారం ఒక ప్రకటన చేసింది. ప్రయోజనకరమైన వినూత్న టెక్నాలజీలు పాత టెక్నాలజీలను, వ్యాపార నమూనాలను ధ్వంసం చేసి కొత్త వాటికి దారి వేస్తాయి అని చెప్పేదే సృజనాత్మక విధ్వంసం సిద్ధాంతం. 1942లో జోసెఫ్ స్కంపీటర్ అనే ఆర్థికవేత్త 'పెట్టుబడిదారీ విధానం, సమసమాజం, ప్రజాస్వామ్యం' అనే పుస్తకం ద్వారా ఈ సిద్ధాంతాన్ని తొలిసారిగా ప్రతిపాదించారు. తర్వాత కాలంలో దీనిని అభివృద్ధిపరిచిన ఘనత జోయల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లదేనని ఆర్థికశాస్త్ర నోబెల్ కమిటీ పేర్కొంది. 'ఆర్థికాభివృద్ధి దానంతటదే కొనసాగదు. సృజనాత్మక విధ్వంసానికి అనుకూలమైన విధానాలను, పద్ధతులను మనం ఎప్పటికప్పుడు తీసుకొస్తూ ఉంటేనే స్తబ్ధత బారిన పడకుండా ఆర్థికరంగాన్ని కాపాడగలుగుతాం' అని ఒక ప్రకటనలో తెలిపింది. సృజనాత్మక విధ్వంసం ద్వారా పాత టెక్నాలజీలు, వ్యాపార నమూనాలు కనుమరుగై కొత్తవి ముందుకు రావటం వెనుక ఉన్న కారణాల్ని శాస్త్రీయంగా జోయల్ మోకిర్ వివరించారని, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లు ఈ సిద్ధాంతానికి గణితపరమైన మోడల్‌ను తయారుచేశారని వెల్లడించింది. కాగా నోబెల్ బహుమతి కింద ఇచ్చే 12 లక్షల డాలర్ల నగదు మొత్తంలో సగాన్ని మోకిర్ తీసుకోనున్నారు. మిగిలిన సగాన్ని ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్ పంచుకుంటారు. ఆర్థికశాస్త్రం నోబెల్‌తో ఈ ఏడాది నోబెల్ పురస్కారాల ప్రకటన ముగిసింది.

పోప్ అవుతానేమోగానీ నోబెల్ రాదనుకున్నా!

79 ఏళ్ల వయసున్న మోకిర్‌కు.. నోబెల్ బహుమతికి ఎంపికైన విషయాన్ని ఒక విలేకరి తెలియజేశారు. ఆయన ఆశ్చర్యపోయారు. తనకు నోబెల్ వచ్చే అవకాశం ఉందని తన సహచరులు, విద్యార్థులు పలుమార్లు చెప్పినా తాను నమ్మలేదన్నారు. 'పోప్ పదవికి ఎంపిక అవుతానేమోగానీ ఆర్థికశాస్త్రంలో నోబెల్‌కు మాత్రం ఎంపిక కాను' అని సరదాగా జోక్ చేసేవాడినని చెప్పారు. ఫిలిప్ అఘియోన్ (69) స్పందిస్తూ.. తనకు లభించే బహుమతి మొత్తాన్ని తన రీసెర్చ్ ల్యాబొరేటరీకి ఖర్చు చేస్తానని వెల్లడించారు. కాగా, 2017లో ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికల్లో మక్రాన్‌కు ఆర్థిక రంగంలో అఘియోన్ కీలక సహకారం అందించారు. ఏఐ రంగంలో ఫ్రాన్స్‌ను అగ్రగామిగా నిలబెట్టటానికి తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తూ.. గత ఏడాది మక్రాన్‌కు అఘియోన్ సహ సారథ్యం వహించిన ఓ కమిటీ నివేదిక సమర్పించింది.

100% వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు

పీఎఫ్ పాక్షిక ఉపసంహరణ నిబంధనలు సరళీకరించిన ఈపీఎఫ్‌వో



న్యూఢిల్లీ, అక్టోబరు 13: ఈపీఎఫ్‌వో చందాదారులకు శుభవార్త. 7కోట్లకు పైగా పీఎఫ్ చందాదారుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని పాక్షిక ఉపసంహరణలకు సంబంధించిన నిబంధనలు సరళీకరిస్తూ సోమవారం ఈపీఎఫ్‌వో బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు చందాదారులు తమ ఈపీఎఫ్ ఖాతా నిల్వలో వంద శాతం వరకు విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మాండవీయ నేతృత్వంలో జరిగిన ఈపీఎఫ్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) సమావేశంలో పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నట్టు కార్మిక మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. ఈపీఎఫ్ సభ్యుల సౌకర్యార్థం ఈపీఎఫ్ స్కీమ్‌లోని పాక్షిక ఉపసంహరణ నిబంధనలను సులభతరం చేయాలని సీబీటీ నిర్ణయించింది. తాజా నిర్ణయంమేరకు చందాదారులు ఉద్యోగి, యజమాని వాటాతో సహా ప్రావిడెంట్ ఫండ్‌లోని అర్హమైన బ్యాలెన్స్‌లో వంద శాతం వరకు ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. ఈమేరకు 13 క్లిష్టమైన నిబంధనలను ఒక నిబంధనగా క్రమబద్ధీకరించింది. దీనిని మూడు రకాలుగా వర్గీకరించింది. అవి.. ముఖ్యమైన అవసరాలు (అనారోగ్యం, విద్య, వివాహం), గృహ అవసరాలు, ప్రత్యేక పరిస్థితులు. మరోవైపు ఉపసంహరణ పరిమితులను కూడా సరళీకరించారు. విద్య కోసం ఉపసంహరణలను పదిసార్ల వరకు, వివాహం కోసం ఐదుసార్ల వరకు (ప్రస్తుతం వివాహం, విద్య కోసం ఉన్న మొత్తం మూడు పాక్షిక ఉపసంహరణలకే అనుమతి ఉంది) అనుమతించారు. ఇక అన్ని పాక్షిక ఉపసంహరణలకు సంబంధించిన కనీస సర్వీసును 12 నెలలకు తగ్గించారు. ఇంతకు ముందు ప్రత్యేక పరిస్థితుల కింద చందాదారు పాక్షిక ఉపసంహరణకు సంబంధించి ప్రకృతి విపత్తు, సంస్థల లాకౌట్లు/మూసివేతలు, నిరుద్యోగం, మహమ్మారుల విజృంభణ వంటి కారణాలను స్పష్టం చేయాల్సిన అవసరం ఉండేది. ఇప్పుడు చందాదారు ఏ కారణాన్ని పేర్కొనకుండానే దరఖాస్తు చేసుకోవచ్చు. పీఎఫ్ ఖాతాలో జమ చేసే మొత్తంలో 25 శాతాన్ని కనీస నిల్వగా ఉంచాలన్న నిబంధన తీసుకువచ్చారు. దీంతో ఈపీఎఫ్‌వో అందించే అధిక వడ్డీ రేటు (ప్రస్తుతం 8.25 శాతం వడ్డీ) ప్రయోజనాన్ని సభ్యులు పొందడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇది పదవీ విరమణ సమయానికి నిధిని కూడబెట్టుకోవడానికి దోహదపడనుంది. ఈపీఎఫ్ ముందస్తు ఫైనల్ సెటిల్‌మెంట్‌ను పొందే వ్యవధిని ప్రస్తుత 2 నెలల నుంచి 12 నెలలకు మార్చారు. అలాగే తుది పెన్షన్ ఉపసంహరణ వ్యవధిని 2 నెలల నుంచి 36 నెలలకు మార్చారు. కాగా ఈపీఎఫ్ 95 పెన్షనర్ల ఇంటి వద్దనే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (డీఎల్‌సీ) సర్వీసులు అందించడానికి గాను ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ)తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకోవడానికి బోర్డు ఆమోదం తెలిపింది. కాగా. వచ్చే నెల 1నుంచి పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు (డీఎల్‌సీ) ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఈ కార్యక్రమం 30 వరకు అమలు కానుంది.

కనీస పెన్షన్ 7,500కు పెంచండి

తన సభ్యులకు నెలవారీ రూ.7,500 కనీస పెన్షన్ ఇవ్వాలన్న డిమాండ్‌తో పెన్షనర్ల సంఘం ఈపీఎస్-95 జాతీయ ఆందోళన కమిటీ సోమవారం ఢిల్లీలో నిరసన చేపట్టింది. తూర్పు కిద్వాయ్ నగర్‌లోని ఈపీఎఫ్‌వో కేంద్ర కార్యాలయం వెలుపల వేలాది మంది పెన్షనర్లు నిరసన ప్రదర్శనలో పాల్గొన్నట్టు కమిటీ పేర్కొంది. రూ.7,500 కనీస పెన్షన్, పూర్తి డీఏ పునరుద్ధరణ, వైద్య ప్రయోజనాలు కల్పించాలని కోరారు.



రహదారి భద్రతకు 'సేఫ్ రైడ్ చాలెంజ్'

- సోషల్ మీడియాలో ప్రారంభించిన సీపీ సజ్జనార్
- సీట్‌బెల్ట్ ధరించి ముగ్గురికి చాలెంజ్ ఇవ్వాలన్న సీపీ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై అవగాహన పెంచడానికి, ట్రాఫిక్ నిబంధనలు పాటించడాన్ని ఒక ట్రెండ్‌గా మార్చడానికి హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ 'సేఫ్ రైడ్ చాలెంజ్' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సేఫ్‌రైడ్ చాలెంజ్‌ను సోషల్ మీడియాలో సోమవారం ప్రారంభించారు. యువతలో ట్రాఫిక్ రూల్స్, సురక్షితమైన డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని సజ్జనార్ వెల్లడించారు. ప్రతి ఒక్కరి ప్రయాణం భద్రతతో కూడిన నిర్ణయంతోనే మొదలవుతుందని పేర్కొన్నారు. నగర పౌరులంతా ఈ చాలెంజ్‌లో ఉత్సాహంగా పాల్గొని, ఒకరి నుంచి మరొకరు స్ఫూర్తి పొంది, రహదారి భద్రతను 2025లో ఒక ట్రెండ్‌గా మారుద్దామని ఆయన ఆకాంక్షించారు. సీటు బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవడం, హెల్మెట్ కచ్చితంగా ధరించడం, ఇతరులకు స్ఫూర్తినివ్వడం వంటి మూడు ముఖ్యమైన సూత్రాలను ఈ కార్యక్రమం గుర్తు చేస్తుందని చెప్పారు. ఈ డిజిటల్ చాలెంజ్ ద్వారా హైదరాబాద్ నగరంలో భద్రత, బాధ్యతతో కూడిన ప్రయాణ సంస్కృతిని నిర్మించాలని సీపీ సజ్జనార్ లక్ష్యంగా పెట్టుకున్నారు.

చాలెంజ్ స్వీకరించడం ఎలా?

వాహనదారులు తమ ప్రయాణం ప్రారంభించే ముందు హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం వంటి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్నట్లుగా ఒక చిన్న ఫొటో లేదా వీడియో తీసుకోవాలి. ఆ ఫొటోను సోషల్ మీడియాలో 'సేఫ్‌రైడ్ చాలెంజ్' అనే హ్యాష్ ట్యాగ్‌తో పోస్టు చేయాలి. ముగ్గురు స్నేహితులకు లేదా బంధువులకు ఈ చాలెంజ్‌ను స్వీకరించాలని ట్యాగ్ చేయాలి. అలా ప్రతి ఒక్కరూ తమ స్నేహితులు ఇచ్చిన చాలెంజ్‌ను స్వీకరించి వైరల్ చేయాలి.

కంటైనర్‌లో 4.99 కిలోల గంజాయి పట్టివేత

- 96 ప్యాకెట్లలో ఏపీ నుంచి జైపూర్‌కు రవాణా యత్నం
- రూ.2.50 కోట్లు ఉంటుందని అంచనా.. ఇద్దరు నిందితుల అరెస్టు

సుజాతనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ మీదుగా రాజస్థాన్‌లోని జైపూర్‌కు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారని ఎస్పీ రోహిత్ రాజు మీడియాకు చెప్పారు. ఈ క్రమంలో సుమారు 4.99 క్వింటాళ్ల గంజాయిని, ఒక కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ గంజాయి విలువ రూ.2.50 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం మీదుగా జైపూర్‌కు గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో సుజాతనగర్ ఎస్‌ఐ రమాదేవి నేతృత్వంలో సీసీఎస్, పోలీసులు అదే మండలంలోని వేపలగడ్డ వద్ద చేపట్టిన తనిఖీల్లో ఓ కంటైనర్‌లో 96 ప్యాకెట్లలో 4.99 కిలోల గంజాయి దొరికింది. ఆ గంజాయిని, కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. కర్ణాటక వాసి జగదీష్ దయారాం పాటిల్, మహారాష్ట్ర నివాసి సంజూ కుమార్‌లను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి కీప్యాడ్ మొబైల్ ఫోన్లనూ స్వాధీనం చేసుకున్నారు. జగదీశ్, సంజూల తోపాటు మహారాష్ట్ర వాసి అమిత్ రోహిదాస్ పాటిల్, గంజాయి విక్రయించిన ఒడిశా వాసి హరి (జైపూర్) పరారీలో ఉన్నారని ఎస్పీ రోహిత్ రాజు వివరించారు. వీరితోపాటు గంజాయి విక్రేతలపై కేసు నమోదు చేశామని తెలిపారు. గతంలోనూ గంజాయి అక్రమ రవాణా చేసిన కేసుల్లో జగదీష్, సంజూ నిందితులని రోహిత్ రాజు చెప్పారు.

ఆ తప్పు మళ్లీ చేయొద్దు!

- కూటమి ప్రభుత్వం

2047 వరకు ఉండాలి: చంద్రబాబు

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 'ఒకసారి జరిగిన తప్పునకు రాజధాని రైతులతో పాటు రాష్ట్రం ఎంత నష్టపోయిందో అందరికీ తెలుసు. మళ్లీ అలాంటి తప్పులు జరగకూడదు' అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. 2047 వరకూ కూటమి ప్రభుత్వం ఉండాలన్నారు. అప్పుడే ప్రపంచంలో నంబర్ వన్ ఎకానమీగా భారతదేశం ఆవిర్భవిస్తుందని.. దానికి ఆంధ్రప్రదేశ్ ఇంజన్‌గా ఉంటుందని చెప్పారు. అందుకే పవన్ కల్యాణ్, బీజేపీలతో కలిసి ముందుకెళ్తున్నామన్నారు. రాయపూడిలో నిర్మించిన ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయాన్ని సోమవారం ఉదయం 9.55 గంటలకు.. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ.. రాజధాని రైతులతో కలిసి ఆయన ప్రారంభించారు. సీఆర్‌డీఏ, అమరావతి అభివృద్ధి కార్పొరేషన్, పురపాలక శాఖకు సంబంధించిన అన్ని విభాగాలూ ఒకే చోట నుంచి కార్యకలాపాలు నిర్వహించేలా నిర్మించిన ఈ భవనంలో వాటన్నిటినీ ఆయన పరిశీలించారు. అనంతరం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులతో మాట్లాడారు. ఐదేళ్లపాటు వారు, మహిళలు పడ్డ కష్టాలు, ఎదుర్కొన్న అవమానాలను చూశానని.. వారి ఇబ్బందులు పోగొట్టి రెట్టింపు గౌరవం కల్పించేలా తోడ్పాటునందిస్తానని భరోసా ఇచ్చారు. తన ఆలోచన ఎప్పుడూ ప్రజల కోసం, వారి భవిష్యత్ కోసమేనని స్పష్టం చేశారు.

భూములు అమ్ముకోవద్దు..

'రాజధాని ప్రాంత ప్రజలు భూములు అమ్ముకోవద్దు. గతంలో నేను సైబరాబాద్‌లో వాళ్లకూ అదే చెప్పా. హైదరాబాద్‌లో 9 మునిసిపాలిటీలు కలిపి ఒక వడ్డాణంలా ఔటర్ రింగ్ రోడ్ వచ్చింది. అప్పుడు రాయదుర్గంలో ఎకరా లక్ష ఉండే భూమి ఇప్పుడు ఎకరా 170 కోట్లు పలుకుతోంది. అదీ అభివృద్ధి ఫలమంటే.. అందుకే ఇక్కడ కూడా భూములు అమ్ముకోవద్దు. హైదరాబాద్‌లో రోడ్ కింద పైప్ లైన్ వేస్తారు. అది పగిలితే రోడ్‌పై నీరు ఉంటుంది. అందుకే ఇక్కడ అన్నిటికి ప్రత్యేక డక్టులు ఏర్పాటు చేశాం. ఫ్యూచర్ సిటీ అమరావతి. సీట్ ఆఫ్ పవర్ ఇక్కడ ఉంటుంది. రాజధాని నుంచి 7 రోడ్లు నేరుగా ఇతర రాష్ట్రాలకు వెళ్తాయి' అని పేర్కొన్నారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రులకు సుస్తీ!

వైద్యసేవలు సరిగా అందక రోగుల అవస్థలు.. కిట్లు లేక వైద్య పరీక్షలు బంద్

- అత్యవసర ఔషధాలకూ దిక్కులేని స్థితి
- కీలక విభాగాలన్నీ ఒకరిద్దరి చేతుల్లోనే..
- పదోన్నతుల్లో వైద్యులు, సిబ్బందికి అన్యాయం
- మంత్రికి ఫిర్యాదు.. విచారణకు ఆదేశం



హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఈఎస్‌ఐ (కార్మిక రాజ్య బీమా) ఆస్పత్రులకు సుస్తీ చేసింది. రోగులకు సరిగా వైద్యం అందని దుస్థితి ఏర్పడింది. కిట్లు లేక వైద్య పరీక్షలు సరిగా చేయడం లేదు. అవసరమైన మందులూ అందుబాటులో లేవు. దీనితో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని ఈఎస్‌ఐ చందాదారులు వాపోతున్నారు. ఈఎస్ ఆస్పత్రుల దుస్థితికి ప్రధాన కారణం ఈఎస్‌ఐ డైరెక్టరేట్ అస్తవ్యస్తంగా మారడమేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డైరెక్టరేట్‌లో కీలక విభాగాలన్నీ ఒకరిద్దరి చేతుల్లో ఉన్నాయని.. ఉన్నతాధికారులు అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ సమస్యలకుతోడు తమకు పదోన్నతుల్లో జరుగుతున్న అన్యాయంపై ఈఎస్‌ఐ వైద్యులు, సిబ్బంది ఇటీవల కార్మిక మంత్రి గడ్డం వివేక్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మొత్తం వ్యవహారంపై మంత్రి విచారణకు ఆదేశించారు. రాష్ట్రంలో ఈఎస్‌ఐ కింద సుమారు 18 లక్షల మంది చందాదారులున్నారు. ప్రతినెలా కోట్ల రూపాయలు కాంట్రిబ్యూషన్ కింద చెల్లిస్తున్నారు. కానీ ఈఎస్‌ఐ ఆస్పత్రుల్లో సరిగా వైద్యసేవలు అందడం లేదు. ఈఎస్‌ఐ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం.. ఏటా ఔషధాలు, ఇతర వైద్య సామగ్రి కొనుగోలు, కొత్త ఈఎస్‌ఐ డిస్పెన్సరీలు, ఆస్పత్రుల ఏర్పాటు, వైద్య సిబ్బంది నియామకం వంటి అంశాలతో వార్షిక ప్రణాళికను సిద్ధం చేయాలి. కానీ డైరెక్టరేట్ అధికారులు ఈసారి ఇంకా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయలేదు. మార్చి నాటికి టెస్టింగ్‌కిట్ల సరఫరా టెండర్ ముగిసింది. కానీ ఔషధాలు, వైద్య సామగ్రి కొనుగోలు విషయంలో కొందరు అధికారులు సరఫరాదారులతో కుమ్మక్కు అయ్యారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈక్రమంలో సకాలంలో టెండర్లు పూర్తిగాక.. మందులు, వైద్య పరికరాల కొరత ఏర్పడింది. పెయిన్‌కిల్లర్స్, విటమిన్లు, ఇన్సులిన్, టీటీ ఇంజెక్షన్లు అందుబాటులో లేవు. ల్యాబ్ కిట్లు, ఎక్స్‌రే ఫిల్ములు లేక రోగులు ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. మరోవైపు ఈఎస్‌ఐ ఆస్పత్రుల్లో వైద్యులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులు 50శాతం వరకు ఖాళీగా ఉన్నాయి. వైద్యసేవలు సరిగా అందకపోవడంతో ఈఎస్‌ఐ ఆస్పత్రులకొచ్చే రోగుల సంఖ్య తగ్గిపోతోంది.

కీలక విభాగాలన్నీ ఒకరిద్దరి చేతుల్లోనే!

ఈఎస్‌ఐ డైరెక్టరేట్‌లో కీలక విభాగాలన్నీ ఇద్దరి చేతుల్లోనే ఉండటం సమస్యగా మారిందని వైద్యవర్గాలు ఆరోపిస్తున్నాయి. సుమారు 12 విభాగాలు ఉండగా.. అందులో ఐదు విభాగాలను పాలన విభాగంలో పనిజేసే ఓ ఉద్యోగికి అప్పగించారని చెబుతున్నాయి. గతంలో తీవ్ర ఆరోపణల అప్రాధాన్య పోస్టుకు బదిలీ అయినా ఆ ఉద్యోగి.. ఇటీవలే ప్రాధాన్య పోస్టులోకి వచ్చారని అంటున్నాయి. అప్పటి నుంచి ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నాయి. దీనిపై మంత్రికి ఫిర్యాదులు వెళ్లాయని వెల్లడిస్తున్నాయి.

టెస్టులు, మందులు లేవంటున్నారు



మాకు ఈఎస్‌ఐ కార్డు ఉంది. ప్రతీనెలా చందా కట్ అవుతోంది. ఆరోగ్యం బాగోలేక ఈఎస్‌ఐ చిక్కడపల్లి డిస్పెన్సరీకి వస్తే ఇక్కడ కాదు నాచారం ఆస్పత్రికి వెళ్లాలన్నారు. అక్కడికి వెళితే టెస్టులు లేవు, మందులు లేవని మళ్లీ ఇక్కడికి పంపారు. వైద్యం కోసం ఇబ్బందిపడుతున్నాం. కనీసం ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడం లేదు.

\- ఉమ, హైదరాబాద్

టెస్టులు, ఎక్స్‌రే కూడా లేవంటున్నారు



ఆరోగ్యం బాగోలేక నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రికి వస్తే టెస్టులు లేవని బయట చేయించుకోవాలని చెబుతున్నారు. రోగులకు సరిగా చికిత్స అందడం లేదు. వైద్య సిబ్బందిని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. మా జీతాల్లో ఈఎస్‌ఐ కట్ అవుతోంది. వైద్యం అందడం లేదు. ప్రైవేటుకు వెళితే ఆర్థికంగా గుల్ల అవుతాం.

\- సునీల్, నాచారం, హైదరాబాద్

బాలికపై ఇద్దరు యువకుల లైంగికదాడి!

- నిందితులపై పోక్సో కేసు నమోదు
- కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో ఘటన

కరీంనగర్ క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గ్రామానికి చెందిన బాలిక (16)పై అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతర ఈ సంఘటనను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆ వీడియో వైరల్ కావడంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితులు ఇద్దరిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.

బాలుడిపై లైంగిక దాడికి యత్నం

మదీన, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీ బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో 4వ తరగతి చదువుతున్న బాలుడిపై ఓ గుర్తుతెలియని దుర్మార్గుడు లైంగిక దాడికి యత్నించాడు. ఓ కాలనీకి చెందిన బాలుడు ఆదివారం రాత్రి స్థానికంగా ఉన్న కిరాణ దుకాణానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి బాలుడిని అడ్డగించి, లైంగిక దాడికి యత్నించాడు. ఇంటికి వచ్చిన బాలుడిని గమనించిన కుటుంబసభ్యులు ఆరా తీయగా జరిగిన విషయం చెప్పాడు. వారు అతడిని ఆస్పత్రికి తరలించి, పోలీసులకు సమాచారమిచ్చారు.ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్ తెలిపారు.

వృద్ధ దంపతులకు మత్తిచ్చి బంగారం దోపిడీ

- ఆస్పత్రిలో భర్త మృతి, భార్య పరిస్థితి విషమం
- నమ్మకస్తుడైన యువకుడి పనే.. కరీంనగర్ జిల్లాలో ఘటన


గజ్జల శంకరయ్య(ఫైల్)

కరీంనగర్ క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వృద్ధ దంపతులకు నమ్మకస్తుడిగా ఉండే యువకుడే వారిపాలిట యముడయ్యాడు. వారికి మత్తుమందు ఇచ్చి చోరీకి పాల్పడ్డాడు. మందు తీవ్రతకు వృద్ధుడు మృతిచెందగా, వృద్ధురాలు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. కరీంనగర్ జిల్లాలోని గంగారం మండలం గర్షకుర్తికి చెందిన గజ్జల శంకరయ్య (76), లక్ష్మి(70) దంపతులు. వీరికి ఇంటికి దగ్గర్లోనే ఉండే కత్తి శివ అనే యువకుడు.. వారికి మందులు, కిరాణా సరుకులు తెచ్చి ఇచ్చేవాడు. శివ జల్సాలకు మరగడంతో బాగా అప్పులు పెరిగిపోయాయి. వృద్ధ దంపతులను చంపేసి లక్ష్మి మెడలోని బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లాలని శివ పథకం వేశాడు. శివ గతంలో ముంబైలో ఓ కల్లు దుకాణంలో పనిచేసి మానేశాడు. అక్కడ కల్లులో మత్తు కోసం కలిపే టాబ్లెట్లలో కొన్నింటిని దాచుకున్నాడు. శంకరయ్య, లక్ష్మి.. జ్వరం, జలుబు, దగ్గు ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారని తెలుసుకున్న శివ, ఈనెల 7న ఉదయం.. ఆరోగ్య సమస్యలన్నీ పోతాయని వారిని నమ్మించి.. ఆరుమాత్రల చొప్పున వారితో మింగించి వెళ్లిపోయాడు. వృద్ధ దంపతులు అపస్మారక స్థితిలోకి వెళ్లాక లక్ష్మి మెడలోని పుస్తెల తాడును తీసుకొని వెళ్లిపోయాడు. కొద్దిసేపటికి ఇరుగుపొరుగు చూసి.. వృద్ధ దంపతులను కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ఆ మరుసటి రోజు శంకరయ్య మృతిచెందగా, లక్ష్మి పరిస్థితి విషమంగా ఉంది. కాగా శివ.. ఆ పుస్తెల తాడు ను అదేగ్రామంలోని బంగారు వ్యాపారి కట్ల శ్రీనివాసాచారికి విక్రయించి రూ.1.85 లక్షలు తీసుకున్నాడు. సోమవారం శివను అదుపులోకి తీసు కున్న పోలీసులు.. రూ.25వేల నగదు, ఫోన్, సిమ్‌కార్డును స్వాధీనం చేసుకున్నాడు. శివపై హత్య, దోపిడీ, హత్యాయత్నం సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు కరీంనగర్ సీపీ గౌస్ ఆలం తెలిపారు.

గురుకులంలో బాలుడిపై ఉపాధ్యాయుడి లైంగిక దాడి

- మూడేళ్లుగా ఘోరం.. ఖమ్మం జిల్లాలో ఘటన
- పోక్సో కేసు నమోదు.. నిందితుడి ఆత్మహత్య

కొణిజర్ల / మధిర రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల పరిధిలోని ఓ గురుకుల పాఠశాలలో ఘోరం వెలుగుచూసింది. 14 ఏళ్ల బాలుడిపై ఓ ఉపాధ్యాయుడు మూడేళ్లుగా లైంగికదాడికి పాల్పడుతున్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు వెళ్లడంతో నిందితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొణిజర్ల ఎస్సై సూరజ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఓ గురుకుల పాఠశాలలో మధిర మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన అరిగెల ప్రభాకర్‌రావు(46) ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అక్కడ తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ బాలుడిపై ప్రభాకర్‌రావు మూడేళ్లుగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. తొలుత ఇంట్లో చెప్పేందుకు భయపడిన ఆ బాలుడు ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వెళ్లాడు. అనంతరం గురుకులానికి వెళ్లడానికి ఇష్టపడలేదు. తల్లిదండ్రులు అనేకమార్లు అడగగా ఉపాధ్యాయుడు తన పట్ల పాల్పడుతున్న ఘోరాన్ని వివరించాడు. ఈ ఘటనపై బాలుడి తండ్రి ఆదివారం రాత్రి కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ప్రభాకర్‌రావుపై పోక్సో కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ప్రభాకర్‌రావును ప్రిన్సిపల్ మందలించారని, దీంతో ఉద్యోగానికి రాజీనామా చేశాడని తెలిసింది. కేసు నమోదైందనే విషయం తెలుసుకున్న ప్రభాకర్‌రావు.. ఆదివారం రాత్రి స్వగ్రామంలోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్ వద్ద పురుగులమందు తాగాడు. ఇంటికి ఫోన్ చేసి.. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. కుటుంబసభ్యులు అతడిని మధిరలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందాడు.

జువెనైల్ హోంలో దారుణం

(మొదటి పేజీ తరువాయి)


రెహమాన్

పంపేందుకు ఏర్పాట్లు చేయగా బాలుడు వెళ్లేందుకు నిరాకరించాడు. తల్లి నిలదీయగా .. జువెనైల్ హోంలోని స్టాఫ్‌గార్డ్ రెహమాన్(27) తనపై లైంగికదాడికి పాల్పడుతున్నాడని చెప్పుకొని ఏడ్చాడు. గత మార్చిలో హోంలోని మూడో అంతస్తు గదిలోకి తనను తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని.. ఘటన గురించి బయటచెబితే హాని తలపెడతానని బెదిరించాడని, ఆ నెలలోనే తనపై నాలుగైదుసార్లు లైంగికదాడి చేశాడని వివరించాడు. కుమారుడిని వెంటబెట్టుకొని ఆ తల్లి శనివారం రాత్రి సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఘటనపై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. కాగా నిందితుడు.. ఆ జువెనైల్ హోంలో మరికొంత మంది బాలురపై లైంగిక దాడులు చేశాడన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీనిపైనా పోలీసులు విచారణ చేపట్టారు. మరోవైపు.. జువెనైల్ హోంలో ఇలాంటి ఘటనలు జరగకుండా గట్టి చర్యలు చేపడతామని సూపరింటెండెంట్ అఫ్జల్ పేర్కొన్నారు. హోంలో తరచూ జ్యుడిషయల్ ఆఫీసర్లు, సీడబ్ల్యూసీ సభ్యులు, ఎన్జీవోలు వచ్చి కౌన్సెలింగ్ ఇస్తుంటారని, బాలలతో విడిగా మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారని వివరించారు. వారికి చెప్పుకోవడం ఇష్టంలేని బాధితుల కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ బాక్స్ ఏర్పాటు చేస్తామని, దాని ద్వారా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. తనపై జరిగిన లైంగికదాడికి గురించి బాలుడు.. మరో ముగ్గురు పిల్లలకు చెప్పాడని.. ఆ పిల్లల నుంచి పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారని వెల్లడించారు. బాధితుడిపై లైంగికదాడి జరిగినట్లు పోలీసులకు ఆ పిల్లలు తెలియజేశారని వెల్లడించారు.

లైంగిక దాడి వాస్తవమే: మైథిలీ, విచారణాధికారి

జువెనైల్ హోంలో బాలుడిపై జరిగినట్లుగా వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని.. ఘటనపై ఉన్నతాధికారులు తనను విచారణాధికారిగా నియమించినట్లు నింబోలిఅడ్డ ప్రభుత్వ బాలికల గృహం సూపరింటెండెంట్ మైథిలీ తెలిపారు. ఇప్పటికే హోం సిబ్బంది, పిల్లలతో మాట్లాడి నివేదిక తయారుచేసి అధికారులకు అందజేశామని చెప్పారు. నిందితుడిపై చర్యలు ఉంటాయని అన్నారు.

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి కన్నుమూత

- ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు
- ప్రముఖుల నివాళి..

సీఎం రేవంత్ సంతాపం


కొండా లక్ష్మారెడ్డి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, న్యూస్ అండ్ సర్వీసెస్ సిండికేట్ వార్తా ఏజెన్సీ వ్యవస్థాపకుడు కొండా లక్ష్మారెడ్డి(85) కన్నుమూశారు. వయసు రీత్యా తలెత్తిన సమస్యతో బాధపడుతున్న లక్ష్మారెడ్డి.. జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 5.30 గంటలకు తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లక్ష్మారెడి స్వస్థలం మొయినాబాద్ జిల్లా పెద్ద మంగళారం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొండా వెంకటరంగారెడ్డికి మనవడు అవుతారు. పాత్రికేయ వృత్తిపై అభిలాషతో లక్ష్మారెడ్డి న్యూస్ అండ్ సర్వీసెస్ సిండికేట్(ఎన్‌ఎస్‌ఎస్) వార్తా ఏజెన్సీని 1980లో ప్రారంభించారు. చివరి వరకు దానికి మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగారు. రాజకీయాల్లో అడుగు పెట్టి కాంగ్రెస్ అభ్యర్థిగా చేవెళ్ల శాసనసభ నియోజకవర్గం నుంచి 1983లో పోటీ చేసి గెలిచారు. తర్వాత 1999, 2004 ఎన్నికల్లో హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ కమిటీ ప్రతినిధిగా, గ్రీవెన్స్ సెల్ చైర్మన్‌గా వ్యవహరించారు. ఉమ్మడి ఏపీ క్రీడా మండలి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. జూబ్లీహిల్స్ జర్నలిస్టు కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లకు అధ్యక్షుడిగా పని చేశారు. లక్ష్మారెడ్డి భౌతికకాయాన్ని సోమవారం పలువురు రాజకీయ, పాత్రికేయ రంగాల ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, కాలె యాదయ్య, మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఏఐసీసీ పరిశీలకుడు రాబర్ట్ బ్రూస్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, వయోధిక పాత్రికేయ సంఘం ప్రతినిధులు భండారు శ్రీనివాస రావు, మాజీ సీపీఆర్వో వనం జ్వాలానరసింహారావుతోపాటు పలువురు నేతలు నివాళులర్పించారు. లక్ష్మారెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. లక్ష్మారెడ్డి మృతి పట్ల స్పీకర్ ప్రసాద్‌కుమార్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్ బాబు, సీతక్క, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కొండా లక్ష్మారెడ్డికి ఇద్దరు భార్యలు. వారిలో ఒకరు నల్లగొండ జిల్లాకు చెందిన కమ్యూనిస్టు పార్టీ మాజీ ఎమ్మెల్యే దివంగత గురునాథ్‌రెడ్డి పెద్ద కుమార్తె సరళ కాగా, మరో భార్య పేరు అరుణ. లక్ష్మారెడ్డి-సరళ సంతానం విజిత్‌రెడ్డి, ప్రతిమ, అరుణ-లక్ష్మారెడ్డి పిల్లలు శైలేందర్ రెడ్డి, సుష్మ. సోమవారం సాయంత్రం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో లక్ష్మారెడ్డి అంత్యక్రియలు పూర్తయ్యాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బ్రిటన్‌కు ఆపన్నహస్తం!

పెట్టుబడిదారులు, వణిక్ ప్రముఖులే కాదు, వివిధరంగాల ప్రతినిధులతో కలిపి మొత్తం నూటపాతికమందితో ఆర్థికరాజధానిలో ముంబైలో కాలూనిన బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ పెద్ద హడావుడి, ఆర్భాటం లేకుండా వచ్చిన పనిముగించుకొని వెళ్ళిపోయారు. బెదిరింపులు, గాండ్రింపులు, హూంకరింపులతో అమెరికా అధినేత ట్రంప్ ఎదుటివారిని అవమానిస్తున్న కాలంలో భారత్–బ్రిటన్ వాణిజ్య ఒప్పందం ఉపశమనాన్ని ఇస్తోంది. ఆర్థికంగా ఎంతో ఎత్తుకు ఎదిగిన భారత్‌తో ఒప్పందాలు కుదర్చుకోవడం బ్రిటన్‌కే ఎక్కువ అవసరమన్న వాదన వాస్తవమే అయినా, సుంకాలూ ప్రతీకార సుంకాల పేరిట మన ఎగుమతులమీద ట్రంప్ కక్షసాధిస్తూ, వీసాల మీద నియంత్రణలతో మన ఉద్యోగులూ విద్యార్థులనూ హింస పెడుతున్న దశలో వాణిజ్యానికే కాదు, మేధస్సుకూ, నైపుణ్యాలకూ అడ్డు గోడలు ఉండబోవని బ్రిటిష్ ప్రధాని హామీ ఇస్తున్నారు.

ప్రపంచంలోనే మన అతిపెద్ద మార్కెట్ బ్రిటన్‌కోసం తలుపులు తెరుచుకుంటోంది. ఆర్థికవ్యవస్థల వరుసలో నాలుగోస్థానంలో ఉన్న భారత్‌తో యూకే చేస్తున్న వ్యాపారం స్వల్పం. భారత్ మొత్తం ఎగుమతుల్లో బ్రిటన్ వాటా మూడుశాతం, బ్రిటన్‌నుంచి ఇటు జరుగుతున్నది రెండుశాతమే కనుక, ఇరుదేశాల మధ్యా ఇచ్చిపుచ్చుకోవడానికి ఆకాశమంత అవకాశం ఉంది. ఏదో మేర రాజీలూ రాయితీలతో రేపోమాపో అమెరికాతోనూ ఒప్పందం కుదరవచ్చును కానీ, అంతలోగా సుంకాలనూ శాపనార్థాలనూ కలగలిపి మన మనసులను ట్రంప్ గాయపరచిన దశలో, రక్షణనుంచి సినీ రంగం వరకూ అన్నీ పంచుకుందామంటూ స్టార్మర్ సగౌరవంగా ప్రతిపాదించడం బాగుంది. కొన్నిరంగాల్లో బ్రిటన్ పెట్టుబడుల ప్రవేశం గురించి మన ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టంగా లేదన్న ఆరోపణలు ఉన్నప్పటికీ, అనేక రంగాల్లో భారత్ ఎగుమతులకు అదుపులూ అడ్డంకులూ లేకపోవడం స్వాగతించాల్సిన విషయం. అరడజనుకుపైగా రంగాల్లో బ్రిటన్ కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టి, రెండుదేశాలూ లాభపడవచ్చునంటున్నారు భారత ప్రధాని మోదీ. మిసైళ్ళు, నౌకల ఇంజన్ల కొనుగోలుతో బ్రిటన్‌తో రక్షణరంగంలో దోస్తీ మరింత హెచ్చింది. మనకంపెనీలు అక్కడ వేలకోట్ల పెట్టుబడులు పెడుతున్నందున, అటునుంచి కూడా ధనప్రవాహం ఉండబోతున్నదట. ఇక్కడి సినీనిర్మాతలు అక్కడ షూటింగ్ చేయడం, అక్కడి యూనివర్సిటీలు ఇక్కడ క్యాంపస్‌లు తెరవడం వంటివి ఆర్థిక ప్రయోజనాలతో పాటు, రెండుదేశాల మధ్యా సాన్నిహిత్యం మరిన్ని రంగాలకు విస్తరించిన సత్యాన్ని తెలియచేస్తున్నాయి. ఉద్యోగవీసాలమీద మీసాలు దువ్వుతూ, విదేశీవిద్యార్థుల ప్రవేశంమీద తమ విశ్వవిద్యాలయాలను ట్రంప్ నియంత్రిస్తున్న తరుణంలో, ఇకపై స్టెమ్ కోర్సుల కోసం బ్రిటన్‌వైపు చూసే విద్యార్థుల సంఖ్య కూడా హెచ్చుతుందట.

పరిణామంలో చిన్నదే కావచ్చును కానీ, ఈ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) ఉభయ దేశాలనూ దగ్గరచేసింది. వస్తు, సేవల రెండింటిలోనూ మిగులు మనవైపే ఉన్న విషయాన్ని అటుంచితే, యాభై ఆరు బిలియన్ డాలర్ల ప్రస్తుత ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ఉభయదేశాలూ ఐదేళ్ళలో 120 బిలియన్ డాలర్లు చేయాలనుకుంటున్నాయి. చైనా, అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్ వంటివి బ్రిటన్‌కు అత్యధికంగా ఎగుమతులు చేస్తూ తొలి స్థానాలు ఆక్రమించిన నేపథ్యంలో భారత్ ప్రధానంగా లబ్ధిపొందగలిగే రంగాలు ఏమిటన్న నిర్ధారణలు ఇప్పటికే జరిగాయి. సుంకాలు దాదాపుగా సున్నా అయిన స్థితిలో ఇప్పటికే బరిలో ఉన్న మిగతాదేశాలతో పోటీపడటానికి మనం విధానపరంగా చేయాల్సిందేమిటన్న విశ్లేషణలూ సాగుతున్నాయి. ఈ ఒప్పందం రేపటిరోజుల్లో అమెరికా, ఈయూలతో చేసుకోబోయే ఒప్పందాలకు మార్గదర్శకంగా ఉపకరించడంతో పాటు, ఎగుమతుల రంగంలో మనం చేపట్టవలసిన సంస్కరణలకు సన్నద్ధం కావడానికీ ఉపకరిస్తుంది. ట్రంప్ టారిఫ్ అస్త్రాలదెబ్బకు మిగతా ప్రపంచమార్కెట్ల అన్వేషణలో పడిన భారతదేశానికి బ్రిటన్ తొలిమెట్టు కాబోతోంది. ఒకపక్క బ్రెగ్జిట్ బాధనుంచి కోలుకోలేక బ్రిటన్ ఇంకా విలవిలలాడుతూంటే, ట్రంప్ తన అస్తవ్యస్థ విధానాలతో మొత్తం ప్రపంచాన్నే చెల్లాచెదురు చేసేశారు. 'సెటా'తో బ్రిటన్‌కు ఆపన్నహస్తం అందించిన భారతదేశం, అక్కడనుంచి వచ్చిపడే చవుక ఉత్పత్తులతో తాను దెబ్బతినకుండా జాగ్రత్తపడాలి. మన చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు, వ్యవసాయం, దాని అనుబంధరంగాలను ఎలా కాపాడుకోవాలో పాలకులు ఆలోచించాలి.

సర్వనాశనం రాగంగా శాంతిగీతం!



ఏకపక్ష ప్రేమలూ, ఏకపక్ష యుద్ధాలూ, ఏకపక్ష శాంతి ఒప్పందాల్లేని దేశ చరిత్రలు లేవు! కనీస న్యాయం కావాలని ఘోషించే వారే తరచూ వీటికి బాధితులుగా కనపడతారు. ఇక కనీవినీ ఎరుగని జీవన విధ్వంసానికి సాక్షులుగా నిలిచిన వారికి నోరెత్తే పరిస్థితీ ఉండదు. గాజాలో ఇప్పుడదే జరుగుతోంది. తాము ప్రతిపాదించిన బలవంతపు శాంతి ఒప్పందానికి అంగీకరించకపోతే సర్వనాశనాన్నే చూస్తారనే హెచ్చరికలు అగ్రరాజ్య అధినేత ట్రంప్ నుంచి రావటంతో హమాస్‌కు వేరే దారి కనపడటం లేదు. హమాస్ పూర్తిగా దిగి రావచ్చు. పాదాక్రాంతమూ కావచ్చు. ఇజ్రాయెల్– అమెరికా పెట్టిన అన్ని షరతులకూ అంగీకరించొచ్చు. కానీ హమాసే గాజా కాదు. హమాసే పాలస్తీనా కాదు. ప్రజలను ఒక సంస్థకు గుత్తాధిపత్యంగా భావించలేం. బాధిత ప్రజలకు న్యాయం దక్కటమే లక్ష్యమైతే శాంతి ప్రణాళిక ఆ దిశగా ఉండాలి. కానీ అందులో ఆ ఛాయల్లేవు. బాధితుల గొంతు అందులో లేదు. చిరకాలంగా వారు కోరుకుంటున్న న్యాయమూ లేదు. పాలస్తీనా సమస్య పరిష్కారానికి అందులో నిర్దిష్ట చర్యల్లేవు. రెండు దేశాల ఏర్పాటు వాగ్దానం ఊసేలేదు. ఇజ్రాయెల్ కోరుకున్న రీతిలో శాంతి ప్రణాళిక ఉందనే విమర్శలే ప్రధానంగా వినపడుతున్నాయి. సుంకాల యుద్ధాలతో నలిగిపోతున్న దేశాధినేతలకు.. ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోటానికి శాంతి ప్రణాళిక ఒక సందర్భాన్ని సృష్టించింది. అది వేరే కథ!

మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల్లో సైతం పరాజితులు తమ విన్నపాలనూ బలంగానే విన్పించారు. పరాజితులు పరాభవ భారంతో మిగిలిపోకుండా, దాని ఆసరాగా ప్రజలను మళ్లీ యుద్ధోన్ముఖులను చేయకుండా ఉంచటానికి ప్రయత్నాలు జరిగాయి. రెండు ప్రపంచ యుద్ధాల్లో తలపడిన దేశాలన్నీ ఎంతోకొంత సమవుజ్జీలు కావటంతో పరాజితులు పూర్తిగా పాదాక్రాంతులు కాలేదు. లేచి నిలబడే స్వేచ్ఛను దక్కించుకున్నారు. లోగొంతుతో కొన్ని స్పష్టంగానే చెప్పారు. స్వంత మార్గంలో ముందుకు వెళ్లటానికి వెసులుబాట్లూ పొందారు. అందుకే పరాజిత దేశాలైన జర్మనీ, జపాన్‌లు పదేళ్లలోనే మళ్లీ పుంజుకుని ఆర్థికంగా కీలకంగా మారాయి. గాజా పరిస్థితి వేరు. 365 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన ఒక చిన్న ప్రాంతంలో జరిగిన బీభత్సమూ, విధ్వంసమూ ఈ శతాబ్దంలో మరెక్కడా చోటుచేసుకోలేదు. ప్రపంచంలోనే అత్యధికంగా శరణార్థులు ఉన్న చిన్న ప్రదేశం గాజా. అత్యధిక జనసాంద్రతలు కలిగిన వాటిల్లో అగ్రభాగాన ఉంది. మరణాలు, ఆస్తులు, సౌకర్యాల విధ్వంసాల గురించి ఇప్పటి వరకూ వస్తున్నవన్నీ తుది లెక్కలు కావు. ప్రాణాలు కోల్పోయిన వారు 67,000 నుంచి 84,000 మంది ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి.

> గాజా, వెస్ట్‌బ్యాంక్ నుంచి వైదొలగటానికి ఇజ్రాయెల్ అంగీకరించి ఆ రెండూ ప్రాంతాలూ కలిసి స్వతంత్ర దేశంగా ఏర్పడటానికి దోహదం చేస్తే శాంతి ప్రణాళికకు అర్థం ఉంటుంది. ట్రంప్‌కు కానీ, నెతన్యాహుకు కానీ ఆ దిశగా అడుగులు వేయాలని ఏ మాత్రమూ లేదు. అందుకే 20 సూత్రాల శాంతి ప్రణాళికలో రెండు దేశాల ఏర్పాటు ప్రస్తావనకు ఎటువంటి ప్రాధాన్యం దక్కలేదు. ఎన్నో చర్చల అనంతరం కుదిరిన ఓస్లో ఒప్పందాలు (1993, 1995) విఫలమైన నేపథ్యంలో పాలస్తీనా నాయకుల ప్రమేయమే లేని 20 సూత్రాల ప్రణాళిక అనుకున్నట్లుగా అమలైతే అది పెద్ద విశేషమే అవుతుంది!

క్షతగాత్రులెందరో పూర్తిగా తెలియదు. అందులో పనిచేయగలిగిన వారెందరో చెప్పలేం. అనుకున్నట్లుగా శాంతి ప్రణాళిక అమలైతే, ఇజ్రాయెల్ దానికి అడ్డంకులు కల్పించకుండా ఉంటే అసలు లెక్కలు తేలతాయి. అప్పుడే యుద్ధ నేరాల, కిరాతకాల సంపూర్ణస్వరూపం బయటపడుతుంది.

1948 నుంచీ ఇప్పటివరకూ అరబ్బు దేశాలతో ఇజ్రాయెల్ పరోక్ష, ప్రత్యక్ష యుద్ధాలు చాలానే చేసింది. వాటిల్లో మరణించిన వారి సంఖ్యతో పోల్చితే గాజా మృతులే ఎక్కువ. 1948 యుద్ధంలో 10 నుంచి 15 వేల వరకూ అరబ్బులు చనిపోయారు. 1967 నాటి ఆరురోజుల యుద్ధంలో 15,000 మంది మరణించారు. 1973 నాటి యుద్ధంలో 8,000 నుంచి 18,500 వరకూ మరణాలు చోటుచేసుకున్నాయి. ఏ కోణం నుంచి చూసినా గాజా యుద్ధమంత దారుణమైంది మరొకటి లేదు. అందుకే ఈ యుద్ధంతో ఇజ్రాయెల్ ప్రతిష్ఠ ఎన్నడూ లేనంతగా దిగజారిపోయింది. సామాజిక మాధ్యమాల్లో గాజా బీభత్సాల దృశ్యాలు చూసిన వారి హృదయాలు విషాదంలో బరువెక్కాయి. యువతలో ఆగ్రహాలు వెల్లువెత్తాయి. విశ్వవిద్యాలయాల్లో నిరసన ప్రదర్శనలు హోరెత్తాయి. నిరసనలకు నిలయాలైన వర్సిటీలకు అందించే ఆర్థిక సహాయానికి కత్తెరవేసే చర్యలు అమెరికాలో మొదలయ్యాయి. వియత్నాం యుద్ధసమయంలో కూడా వర్సిటీల్లో నిరసనలు జరిగాయి. ఇప్పటిలా వాటిపై కత్తికట్టలేదు. భావస్వేచ్ఛకు వీలు ఇవ్వని ఛాందస జాతీయవాదం ఎక్కడైనా చెరుపే చేస్తుందనటానికి ఇంతకంటే నిదర్శనం లేదు.

పాలస్తీనా ప్రజల సమస్య పరిష్కారం అయితేనే గాజా, వెస్ట్‌బ్యాంకులో ప్రశాంతత నెలకొంటుంది. అక్కడి ప్రజలకు ఆమోదంలేని ఏ ప్రణాళికా దీన్ని సాధించలేదు. హమాస్ లాంటి తీవ్రవాద సంస్థలు కూడా ఒక దేశంగా ఇజ్రాయెల్ అస్తిత్వాన్ని అంగీకరిస్తున్నాయి. అరబ్బు దేశాలు కూడా ఇజ్రాయెల్‌తో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. ఇజ్రాయెల్‌ను ఇంకా గుర్తించని దేశాలు కూడా తెరవెనుక మంతనాలు సాగిస్తున్నాయి. ఏ దృష్టితో చూసినా ఇజ్రాయెల్ అస్తిత్వానికి ఇప్పుడు ప్రమాదమే లేదు. సైనికంగా ఇజ్రాయెల్‌తో తలపడే దేశం కూడా మధ్యప్రాచ్యంలో లేదు. దుస్సాహసం చేసినా ఓటమినే చూడాల్సి వస్తుంది. అంతటి శక్తిని ఇజ్రాయెల్ సంపాదించుకుంది.



■ రాహుల్ కుమార్

ఇటువంటి పరిస్థితుల్లో ఇజ్రాయెల్ గతంలో కంటే భిన్నంగా ముందుకొచ్చి పాలస్తీనా సమస్యను పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలి. కానీ ఒకనాటి పాలస్తీనా ప్రాంతమంతా గ్రేటర్ ఇజ్రాయెల్‌కే చెందాలనీ దైవనిర్దేశం ప్రకారం అది జరిగితీరుతుందనే మత విశ్వాసాలు గల పార్టీలపై ఆధారపడి అధికారాన్ని నెట్టుకొస్తున్న ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అందుకు సిద్ధంగా లేరు. ఆయన నాయకత్వం వహిస్తున్న లికుడ్ పార్టీకీ కూడా పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పాటు కావటం ఇష్టంలేదు. పరిమిత అధికారాలతో కూడిన స్వయంపాలనను పాలస్తీనాకు ఇవ్వటానికి కూడా లికుడ్ పార్టీలో అతివాదులు అంగీకరించరు. వాదనలో సహేతుకత లేనప్పుడూ, ఏ విధంగానైనా ఐక్యరాజ్యసమితి తీర్మానాలను కాలరాయాలని అనుకున్నప్పుడూ అతివాదులకు మతమే ఆలంబనగా ఉంటుంది. బైబిల్‌లో ఇజ్రాయెల్ ప్రజలు, వారు నివసించే ప్రాంతాల ప్రస్తావన ఉంది కాబట్టి.. పాలస్తీనా వాసులందరూ వేరేచోట్లకు తరలివెళ్లాలనే వితండవాదననే అతివాదులు చేస్తారు.

ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్రకారం 56 శాతం భూభాగం ఇజ్రాయెల్‌కూ 43 శాతం పాలస్తీనాకూ చెందాలి. ఒకశాతం జెరుసలెం ప్రాంతాన్ని అంతర్జాతీయ పర్యవేక్షణ కింద ఉంచాలి. రెండు దేశాల రాజధానులూ జెరుసలెంలోనే ఉండాలని ఐరాస తీర్మానంలో స్పష్టంగా ఉంది. ఐరాస ప్రణాళికను యూదులు ఆమోదించారు. అరబ్బు దేశాలు దాన్ని వ్యతిరేకించి యుద్ధానికి దిగాయి. బహుశా ఇది చారిత్రక తప్పిదమే కావచ్చు! యుద్ధంలో గెలిచిన ఇజ్రాయెల్ ఎక్కువ భూభాగాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకుంది. 56 శాతం భూమి 78 శాతమైంది. 1967 నాటి యుద్ధంతో మిగతా 22 శాతాన్నీ తన అధీనంలోకి తెచ్చుకుంది. గాజా, వెస్ట్‌బ్యాంకు ప్రాంతాలు అలా వచ్చినవే. ఈ రెండు ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ వైదొలగాలనీ ఐరాస తీర్మానాలు చేసినా అమెరికా, బ్రిటన్ మద్దతుతో ఇజ్రాయెల్ వాటిని ఖాతరుచేయలేదు. గాజా, వెస్ట్‌బ్యాంక్ నుంచి వైదొలగటానికి ఇజ్రాయెల్ అంగీకరించి ఆ రెండూ ప్రాంతాలూ కలిసి స్వతంత్ర దేశంగా ఏర్పడటానికి దోహదం చేస్తే శాంతి ప్రణాళికకు అర్థం ఉంటుంది. ట్రంప్‌కు కానీ, నెతన్యాహుకు కానీ ఆ దిశగా అడుగులు వేయాలని ఏ మాత్రమూ లేదు. అందుకే 20 సూత్రాల శాంతి ప్రణాళికలో రెండు దేశాల ఏర్పాటు ప్రస్తావనకు ఎటువంటి ప్రాధాన్యం దక్కలేదు. ఎన్నో చర్చల అనంతరం కుదిరిన ఓస్లో ఒప్పందాలు (1993, 1995) విఫలమైన నేపథ్యంలో పాలస్తీనా నాయకుల ప్రమేయమే లేని 20 సూత్రాల ప్రణాళిక అనుకున్నట్లుగా అమలైతే అది పెద్ద విశేషమే అవుతుంది! హమాస్, ఇస్లామిక్ జిహాద్ సంస్థలు బలపడటానికి ఓస్లో ఒప్పందాల వైఫల్యాలే ప్రధాన కారణాలు. చరిత్ర పునరావృతమైతే హమాస్ లాంటి సంస్థలే పుట్టుకొస్తాయి. వాటివల్ల ఇజ్రాయెల్ ప్రజలకూ, పాలస్తీనా ప్రజలకూ ఎటువంటి మేలూ జరగదు.

తన చుట్టూ పాలస్తీనా ఒక ముస్లిం దేశంగా ఉండటం ఇజ్రాయెల్‌కు ఇష్టంలేదు. భద్రతా కారణాల దృష్ట్యా అది సబబే అనుకుందాం! మరి చుట్టూ ఉన్న ముస్లిం దేశాల సంగతి ఏమిటి? వాటి నుంచి ప్రమాదాలు రావా? అన్న ప్రశ్నకు ఇజ్రాయెల్ వైపు సహేతుక సమాధానం కనపడదు. పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పడితే దానికంటూ చరిత్రను నెమరువేసుకునే క్రమం మొదలవుతుంది. విద్యా బోధనలో భాగంగా పాలస్తీనా చిన్నాభిన్నమైన తీరును వివరిస్తారు. ప్రజల జ్ఞాపకాల్లో నిక్షిప్తమైన బాధలు కళారూపాల ద్వారా వెలుగులోకి వస్తాయి. చరిత్రలో ఎవరు ఎక్కడ నుంచి వచ్చారో, ఎవరు ఎవరిని లొంగదీసుకున్నారో, పరసీమలకు ప్రజలు ఎలా చెల్లాచెదురయ్యారో తెలిపే సంఘటనలన్నీ ప్రజల ముందుంచటం అనివార్యమవుతుంది. అవన్నీ కలిసి ప్రజల్లో ఒక యుక్తాయుక్త వివేచనను మేల్కొలుపుతాయి. అది ఇజ్రాయెల్‌కు అసలు సరిపడదు. కానీ చరిత్రలోని చేదునిజాలను ఎల్లకాలమూ దాయలేం!

గాజాతో పాటు వెస్ట్‌బ్యాంకుని కూడా పూర్తిగా విలీనం చేసుకుని అక్కడి ప్రజలకు పూర్తిపౌరసత్వం కల్పించటానికి ఇజ్రాయెల్ ముందుకొస్తే అదొక కొత్త చరిత్ర అవుతుంది. దీంతోపాటు దేశదేశాల్లో తలదాచుకున్న పాలస్తీనా శరణార్థులందరికీ స్వదేశంలోకి ప్రవేశం కల్పించటానికి సిద్ధపడితే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయి. ఇవి జరగాలంటే ఇజ్రాయెల్ ప్రజాస్వామ్యపరంగా ఎంతో ఎదగాలి. యూదుల కోసమే ప్రత్యేక రాజ్యమన్న భావనను వీడాలి. ఒకనాటి పాలస్తీనా భూభాగంలో ఉండే ప్రజలందరికీ

> మనం ఆశించని రీతిలో చరిత్ర టక్కరి మలుపులు తిరుగుతుంది! గురజాడ ఎప్పుడో అన్నట్లుగా మతములన్నీ మాసిపోయి జ్ఞానమొక్కటే నిలిచివెలిగితే మెజారిటీ, మైనారిటీ భావనలు అంతరించక తప్పదు. సమష్టిజీవనానికి సమభావనను సమకూర్చుకోకా తప్పదు!


సమానహక్కులు కల్పించే విధంగా ఇజ్రాయెల్ రాజకీయ వ్యవస్థ పరిణతి చెందాలి. ఒకప్పుడు రెండు దేశాల ఏర్పాటును సమర్థించిన మేధావులెందరో ఇప్పుడది సాధ్యంకాదనే భావనకు వస్తున్నారు. వెస్ట్‌బ్యాంకులో ఇప్పటికే 5 లక్షలకు పైగా యూదులు నివసిస్తున్నారు. ఇజ్రాయెల్‌కు ప్రాణాధారమైన నీరు అక్కడ నుంచే వస్తుంది. అక్కడి యూదు కాలనీలన్నిటినీ ఖాళీచేసి పాలస్తీనాకు అప్పగించటానికి ఇజ్రాయెల్ సిద్ధంగానూ లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో గాజా, వెస్ట్‌బ్యాంక్ కలిసి ప్రత్యేక దేశంగా ఏర్పాటుచేసినా ఆర్థికంగా మనగలిగే పరిస్థితులు ఉండవనే వాదన కూడా బలంగానే ఉంది. కొందరు ప్రతిపాదిస్తున్నట్లుగా పాలస్తీనా ప్రజలతో కూడిన అఖండ ఇజ్రాయెల్ ఏర్పడితే బలాబలాలు తలకిందులు అవుతాయి. ఇప్పటికే ఇజ్రాయెల్ జనాభాలో 21శాతం మంది పాలస్తీనా అరబ్బులు ఉన్నారు. గాజా, వెస్ట్‌బ్యాంక్‌లు ఇజ్రాయెల్‌లో విలీనమైతే మొత్తం అరబ్బుల జనాభా 7.6 మిలియన్లు అవుతుంది. అప్పుడు యూదులు (7.2 మిలియన్లు) మైనారిటీలు అవుతారు. ఇక పాలస్తీనా శరణార్థులు 4.4 మిలియన్లు ఉన్నారు. వీరు కూడా అఖండ ఇజ్రాయెల్‌లోకి ప్రవేశిస్తే అరబ్బుల జనాభా 12.2 మిలియన్లకు చేరుతుంది. సొంత మతానికి చెందిన ప్రజల కోసం ప్రత్యేక రాజ్యం కావాలని తహతహలాడిన యూదు జాతీయవాదులకు అటువంటి ఊహే భయానకంగా ఉంటుంది. కానీ కొన్ని భయంకర వాస్తవాలను తప్పించుకోలేని పరిస్థితులూ వస్తాయి. మనం ఆశించని రీతిలో చరిత్ర టక్కరి మలుపులు తిరుగుతుంది! గురజాడ ఎప్పుడో అన్నట్లుగా మతములన్నీ మాసిపోయి జ్ఞానమొక్కటే నిలిచివెలిగితే మెజారిటీ, మైనారిటీ భావనలు అంతరించక తప్పదు. సమష్టిజీవనానికి సమభావనను సమకూర్చుకోకా తప్పదు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ప్రపంచ దృష్టిని ఆకర్షించిన పీఓకే ఆందోళన!

మొన్న బంగ్లాదేశ్, నిన్న నేపాల్, తాజాగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ప్రజలు తమ ప్రాథమిక సమస్యలపై ప్రశ్నిస్తూ, రోడ్ల మీదకు వచ్చి ప్రభుత్వాన్ని స్తంభింపజేశారు. పీఓకేలో ఉన్న ఫెడరల్ గవర్నమెంట్‌కి, ఆందోళనకారులకీ మధ్య చర్చలు విఫలమయ్యే నాటికి, కనీసం 10 మంది ఆందోళనకారులు, ముగ్గురు పోలీసులు చనిపోయారు, వందలాది ప్రజలు గాయపడ్డారు. అక్టోబర్ 4న అధికారులు, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ఆందోళనకారుల మధ్య చర్చలు జరిగి, ఆందోళనలు విరమించాలని ఒక అంగీకారానికి వచ్చారు.

ప్రధాన సమస్యలపై ఆందోళన మే నెలలో ప్రారంభమై, ఆగస్టు నాటికి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకత్వాన మిలిటెంట్ రూపం తీసుకుంది. ఆందోళనకారులు 38 అంశాలతో కూడిన డిమాండ్స్‌ను అధికారులకు సమర్పించి, అవి పరిష్కరించకపోతే తాము తిరిగి రోడ్ల మీదకు వస్తామని ప్రకటించారు. ఆందోళన ప్రారంభమైన ఐదవ రోజున పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ మొత్తం ఆగిపోయింది. ఏడవ రోజు కమ్యూనికేషన్ సిస్టం ఆపివేశారు. చివరికి అక్టోబర్ 1న పాకిస్థాన్ ప్రధానమంత్రి షహబాజ్ షరీఫ్ హై పవర్ డెలిగేషన్‌ను పీఓకే రాజధాని ముజఫరాబాద్‌కు చర్చల కోసం పంపించారు. ఆందోళనకారులు లేవనెత్తిన ఆహారం, విద్యుత్ ధరలు పెరుగుదల, నిరుద్యోగం తదితరాలపై రెండు రోజులపాటు చర్చలు జరిగిన తర్వాత ఆందోళనను విరమించాలని ఒక అంగీకారానికి వచ్చారు. 25 అంశాలతో కూడిన అంగీకార పత్రంపై ఇరుపక్షాలు సంతకాలు చేశాయి. వాటిలో ముఖ్యమైనవి.. కాల్పుల్లో చనిపోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని, అక్రమ కేసులను రద్దు చేయాలని, పౌరులకు హెల్త్ కార్డులు ఇవ్వటానికి నిధులు విడుదల చేయాలని, మంత్రులను 20 మందికి తగ్గించాలని, వీటితో పాటు అంగీకరించిన హామీలను అమలు చేయటానికి కమిటీని ఏర్పాటు చేయాలని, ఎలక్ట్రిసిటీ సిస్టం అభివృద్ధి చేయటానికి ఫండ్స్ కేటాయించాలని తదితర అంశాలతో ఒప్పందం కుదిరింది.



> ఆజాద్ కశ్మీర్ ప్రజల ఆందోళనకు అనేక దేశాలు సంఘీభావం ప్రకటించినా, భారత ప్రభుత్వం ఎందుకు స్పందించలేదు? ఆజాద్ కశ్మీరీ ప్రజలు స్వతంత్ర దేశంగానే ఉండాలని కోరుకుంటున్నారే కానీ, భారతదేశంలో కలిసిపోవాలన్న ఆకాంక్షను ప్రకటించలేదు.

పీఓకే గురించి మనం చాలా కాలంగా వింటున్నాం. ఈ మధ్య పహల్గాంలో ఉగ్రవాద దాడులకు ప్రతిగా భారత్ సిందూర్ పేరుతో చేసిన ప్రతిదాడుల సందర్భంగా హోం మంత్రి అమిత్ షా పీఓకే మనదేనని, ఇవాళ కాకపోయినా రేపైనా దానిని స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు కూడా. 1994లోనే పీఓకే భారతదేశ అంతర్భాగమని, ఆజాద్ కశ్మీర్ ప్రభుత్వాన్ని గుర్తించటం లేదని భారత పార్లమెంటు ప్రకటించింది. పీఓకేను 'ఆజాద్ జమ్మూ–కశ్మీర్'గా పాకిస్తాన్ ప్రకటించి తన అధీనంలో కొనసాగిస్తున్నది. రాజధానిగా ముజఫరాబాద్‌ను నిర్ణయించి, ప్రధాన మంత్రి గల స్వతంత్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కానీ దానిపై పూర్తి అధికారాలను పాకిస్తాన్ ప్రభుత్వం తన చేతులలో ఉంచుకుంది. పీఓకేలో జనాభా సుమారు 40 లక్షల మంది ఉంటారు. పీఓకేకు ప్రత్యేకంగా హైకోర్టు, సుప్రీంకోర్టులు ఉంటాయి. పాకిస్తాన్ పార్లమెంటులో ఇది భాగం కాదు. అయితే పాకిస్తాన్ ప్రభుత్వంలోని కశ్మీరీ ఎఫైర్స్, గిల్గిట్, బాల్టిస్తాన్ వ్యవహారాలకు సంబంధించిన మంత్రిత్వ శాఖ అధీనంలో ఇది ఉంటుంది. పేరుకు మాత్రమే స్వతంత్ర ప్రతిపత్తి గల రాష్ట్రం.

పాకిస్తాన్ ప్రభుత్వం జమ్మూ కశ్మీర్‌లోని పశ్చిమ ప్రాంతాలను, చైనా–పాకిస్తాన్ బోర్డర్‌లో ఉన్న గిల్గిట్, బాల్టిస్తాన్ ప్రాంతాలను 1947–48లో మొదటి పాకిస్తాన్–భారత్ యుద్ధం సందర్భంగా ఆక్రమించుకుంది. యునైటెడ్ నేషన్స్ దీన్ని వివాద ప్రాంతంగా, దీనికి శాంతియుత పరిష్కారం జరగాలని కోరుతున్నది. దీని సార్వభౌమత్వాన్ని మెజారిటీ దేశాలు గుర్తించటంలేదు.

తాజాగా పాకిస్తాన్ ప్రభుత్వాన్ని పెద్ద ఎత్తున కుదిపేసిన ఆజాద్ కశ్మీర్ ప్రజల ఆందోళనకు అనేక దేశాలు సంఘీభావం ప్రకటించినా, భారత ప్రభుత్వం ఎందుకు స్పందించలేదు! కారణం ఆజాద్ కశ్మీరీ ప్రజలు స్వతంత్ర దేశంగానే ఉండాలని కోరుకుంటున్నారే కానీ, భారతదేశంలో కలిసిపోవాలన్న ఆకాంక్షను ప్రకటించలేదు! ఇప్పటికీ 1977లో ఏర్పడిన జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ పేరుతో ఒక సంస్థ పాకిస్తాన్, ఇండియా దేశాల నుంచి ఆ ప్రాంత విముక్తి కోసం పోరాటం చేస్తూనే ఉంది. భారతదేశం ఈ సంస్థని టెర్రరిస్ట్ గ్రూపుగా నిషేధించింది. జమ్మూ–కశ్మీర్ భారతదేశంలో భాగంగా ఉన్నప్పటికీ, ఇప్పటికీ ఆ ప్రాంత ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జమ్మూ కశ్మీర్‌కు రాజ్యాంగం ప్రసాదించిన ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి ఆర్టికల్ 370ని 2019లో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం రద్దు చేసింది. నాటి నుంచి దానిని తిరిగి పునరుద్ధరించాలని అక్కడి ప్రజలు, రాజకీయ పార్టీలు ఆందోళనలు చేస్తూనే ఉన్నాయి. జమ్మూ కశ్మీర్‌లో అపారంగా ఉన్న సహజ వనరులను మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలలో భాగంగా బడా కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడానికి అడ్డంకిగా ఉన్న ఆర్టికల్ 370ని ప్రజాబీష్టానికి వ్యతిరేకంగా రద్దు చేసింది. ఏది ఏమైనా పీఓకే ప్రజలు తమ ప్రాథమిక హక్కులు, ముఖ్యమైన సమస్యలపై పాకిస్తాన్ ప్రభుత్వాన్ని మెడలు వంచే విధంగా చేసిన ఆందోళన ఫలితంగా పీఓకే మరొకసారి ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించింది.

■ ముప్పాళ్ళ భార్గవ శ్రీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ఈ రోజు మా చిట్టమ్మ పుట్టినరోజు!

ప్రపంచానికి గుముడవెల్లి రేణుక (మిడ్కో)గా తెలిసిన మా 'చిట్టమ్మ' 55వ పుట్టినరోజు.. ఈ రోజు! ఇప్పుడామె భౌతికంగా, మాకు శాశ్వతంగా దూరమైంది కాబట్టి ఇప్పట్నుంచి జయంతి అనాలేమో. తను మా ఇల్లు వదిలి ఇప్పటికి 22 ఏళ్లు. ఈ కాలంలో, ప్రతి అక్టోబర్ 14న ఇంట్లో మా అమ్మ పాయసం వండి అందరికీ పెట్టడం, రోజంతా ఆమెను తలుచుకొని దుఃఖించడం, గర్వించడం ఆనవాయితీ. అయితే, తను బతికుంటే, తన కార్యరంగమైన దండకారణ్యంలో, సహచర విప్లవకారుల మధ్య తన పుట్టిన రోజును ఎలా జరుపుకునేదో? కేక్‌లు కట్ చేయడాలు, లేదా పార్టీలూ.. ఇవేవీ వాళ్ల ఉద్యమ జీవితంలో ఎలాగూ ఉండవు. అయినా కూడా ఒక రచయితగా, విప్లవకారిణిగా ఎందరికో ఎంతో ప్రేమాస్పదురాలిగా నిలిచిన మా చిట్టమ్మ ఈ రోజు నిజంగా ఏమేం చేసి ఉండేదో?

బహుశా చీకట్లు తొలగిపోకముందే నిద్ర లేచేదేమో. తన పాలిథీన్ షీట్‌లో (గెరిల్లాలు పడుకోవడానికైనా, కూర్చోవడానికైనా, నడుం వాల్చి చదువుకోవడానికైనా, ఎవరితోనైనా కూర్చొని మాట్లాడటానికైనా.. అన్నింటికీ ఉపయోగించేది ఓ ఆరడుగుల పొడవు, మూడడుగుల వెడల్పు ఉండే పాలిథీన్ షీటే) అలాగే కాసేపు కూర్చొని ముందుగా అమ్మను, బాపును తలచుకునేదేమో. వాళ్లను చివరిసారి కలిసి అప్పుడే 22 ఏళ్లయిపోయింది కదా అని ఆశ్చర్యంతో, బాధతో గుర్తుచేసుకునేదేమో. వాళ్లకు ఉత్తరం రాసి కూడా 11 ఏళ్లు గడిచిపోయాయి కదా అని గుర్తొచ్చి ఓ నిట్టూర్పు విడిచేదేమో. వృద్ధాప్యంలో ఇప్పుడు వాళ్లెలా ఉన్నారో అని కాసేపు మనసులోనే దుఃఖించేదేమో. తన జీవిత సహచరులు, అమరులు సంతోష్, శాఖమూరిలను తలచుకునేదేమో. చాలా తక్కువ కాలంలో, అత్యంత విషాదకరంగా ముగిసిన వారిద్దరి సహచర్యం తనలో ఎంత స్ఫూర్తిని నింపిందో కదా అని ఆశ్చర్యపోయేదేమో.

ఇంకా.. తానున్న ప్రాంతం, సందర్భం అనుకూలిస్తే ఈ రోజు పొద్దున్నే స్నానం చేసేది. ఉన్నవాట్లోనే తనకిష్టమైన, శుభ్రమైన బట్టలు వేసుకునేది. కిచెన్‌కు వెళ్లి ఆ రోజు తన సహచరులు బ్రేక్‌ఫాస్ట్‌కు ఏం వండుతున్నారో చూసేది. తనకు నచ్చిన వంటకం ఏదైనా చేయడానికి అవసరమైన దినుసులు ఉన్నాయేమో ఆరా తీసేది. ఉంటే, తన డ్యూటీ అయినా, కాకున్నా, ఏదో ఒకటి వండి వాళ్లను సంతోషపెట్టేది. కానీ తనకీ రోజు ఎందుకు ప్రత్యేకం అని మాత్రం ఎవ్వరికీ చెప్పకపోయేది. ఒకవేళ తానున్న క్యాంపులో తనకు బాగా తెలిసిన సన్నిహితులు ఉంటే వాళ్లతో మాట్లాడేది. తనిలా పొద్దున్నే శుభ్రంగా తయారవడం, ముఖంలో ఆ మెరుపును గమనించి, కళ్లతోనే 'ఏంటి సంగతి' అన్నట్టు చూస్తే, నవ్వేసి ఉండిపోయేది. మెల్లిగా 'ఇవ్వాల్టితో మనకు 55 నిండినై.. అన్నట్టు' అని జవాబిచ్చేది ముఖమంతా వ్యాపించే తన ట్రేడ్‌మార్క్ చిరునవ్వుతో.



> రేణుక (మిడ్కో), తన 55 ఏళ్ల ప్రయాణంలోని మజిలీలన్నీ ఒక్కొక్కటీ నెమరు వేసుకునేదేమో. ఈ రోజంతా తనకు మా ఊరు కడవెండి, తన బాల్యం, కుటుంబసభ్యులు, ఆత్మీయులు అందరూ గుర్తొస్తూనే ఉండేవారేమో. చిన్నప్పుడు ఇంట్లో, ఊళ్లో తనను 'ఒంటూపిరి ప్రాణం అని వేళాకోళమాడే వాళ్లు, ఇప్పుడెంత గట్టి పిండంగా అయ్యానో' అనుకుని తనలోనే నవ్వుకునేదేమో.

వాళ్లు కూడా తమ సంతోషాన్ని హడావిడిగా మార్చకుండానే, గట్టిగా షేక్‌హ్యాండ్ చేసి, లేదా తనను దగ్గరికి తీసుకొని, హత్తుకొని గ్రీటింగ్స్ చెప్పేవాళ్లేమో. కిట్లో ఉన్న ఓ కొత్త పెన్నునో, లేదా వాడకుండా దాచుకున్న ఓ కొత్త డైరీనో ఆర్భాటం లేకుండా తన చేతిలో పెట్టేవాళ్లేమో. లేదంటే కిట్లో దాచుకున్న బిస్కెట్ ప్యాకెట్ తీసి తనకో ముక్క తినిపించేవాళ్లేమో.


ఆ తర్వాత ఆ రోజు చేయాల్సిన పనులేంటో లెక్క వేసుకునేది. వాటిలో తన కిష్టమైన దాన్ని ముందేసుకునేది. లేదా ఏదైనా మంచి పుస్తకం చదివేది. నచ్చిన కవితల పుస్తకం ఉన్నా, ల్యాప్‌టాప్‌లో స్కాన్ కాపీ ఉన్నా ఓపెన్ చేసి కూర్చునేది. తాను చాలాకాలంగా రాయాలని స్ట్రగుల్ అవుతున్న కథనో, కథనాన్నో మొదలుపెట్టడానికి ప్రయత్నించేది. తనకిష్టమైన విమలక్క పాట– 'ఆదివాసీ ఆత్మబంధువు ఏడికెళ్లెనే..' కనీసం రెండు సార్లయినా ప్లే చేసుకొని వినేది. ఆ రోజు ఏదైనా గ్రామానికి వెళ్లాల్సి వస్తే, చంటిపిల్లల తల్లులెవరైనా కలిస్తే కాసేపు వాళ్ల పిల్లలను ఎత్తుకొనేది. ముద్దు చేసేది.

తనను తాను ఎన్ని పనుల్లో ఇన్వాల్వ్ చేసుకోవాలనుకున్నా, ఈ రోజంతా తనకు మా ఊరు కడవెండి, తన బాల్యం, కుటుంబసభ్యులు, ఆత్మీయులు అందరూ గుర్తొస్తూనే ఉండేవారేమో. కడవెండి, మోత్కూరు, తిరుపతి, విశాఖ, బాసధార (ఒడిషా), దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్, అబూజ్‌మడ్... 55 ఏళ్ల ప్రయాణంలోని మజిలీలన్నీ ఒక్కొక్కటీ నెమరు వేసుకునేదేమో. అడవి జీవితంలో 21 ఏళ్లు గడిచినా, అంతంత మాత్రం ఆరోగ్యమే అయినా, ఇంకా బతికున్నందుకు ఆశ్చర్యపోయేదేమో. చిన్నప్పుడు ఇంట్లో, ఊళ్లో తనను 'ఒంటూపిరి ప్రాణం అని వేళాకోళమాడేవాళ్లు, ఇప్పుడెంత గట్టి పిండంగా అయ్యానో' అనుకుని తనలోనే నవ్వుకునేదేమో.

అలా పొద్దంతా అటూ ఇటూ తిరిగిన మనసుకు, అలసిన శరీరానికి విశ్రాంతి కోసం ఏ అర్ధరాత్రో పాలిథీన్ షీట్‌లో పడుకున్న తర్వాత, అసలు తన ప్రయాణం ఎలా మొదలైందీ.. ఏయే మలుపులు తీసుకుందీ.. అన్నీ నెమరు వేసుకునేదేమో. కడవెండిలో బహుశా ఆరో తరగతిలో ఉన్నప్పుడు తను చదివిన మొదటి నవల 'అమ్మ'ను గుర్తు చేసుకునేదేమో. ఓ పాతికేళ్ల తర్వాత దాన్ని మళ్లీ చదివి, ఆ ప్రపంచ ప్రఖ్యాత నవలకు వందేళ్లు నిండిన సందర్భంగా పరిచయ వ్యాసాన్ని కూడా రాసానని గుర్తు చేసుకునేదేమో. తను మొదటి రోజుల్లో రాసిన 'భావుకత', 'విద్రోహపు మనిషి' వంటి కథలకు వచ్చిన అనూహ్య స్పందన.. ఆ తర్వాత విప్లవ రచయితల పరిచయాల్లోకి వచ్చాక ఎదుర్కొన్న సంఘర్షణను గుర్తు చేసుకునేదేమో. ఉద్యమకారిణిగా ఎదుగుతూనే తనలోని కథకురాలిని నిలబెట్టుకునేందుకు కొన్నిసార్లు అయోమయంతో, మరెన్నోసార్లు అమాయకత్వంతో పడ్డ సంఘర్షణను గుర్తుచేసుకునేదేమో.

అప్పుడామెకు ఆ నాటికి తను రాసిన కథలన్నీ తనతోనే చదివించుకొని, వాటిని మెచ్చుకోవడమే కాదు, 'కథ మీద నీకు పట్టు దొరికింది కామ్రేడ్, ప్రొసీడ్' అని వెన్నుతట్టిన తన తొలి సహచరుడు సంతోష్ గుర్తొచ్చేవాడు. సంతోష్‌తో తన తొలి షేక్‌హ్యాండ్ గుర్తొచ్చేది. ఆయనను నల్లమల అడవుల్లో మొదటిసారి కలిసి, ఆ తర్వాత, తిరుపతిలోని తన రూమ్‌కు తిరిగొచ్చాక, కేవలం ఆయన చేతి స్పర్శ తొలగిపోవద్దనే, రోజుకు రెండుసార్లు స్నానం చేసే తను, రెండు రోజులు స్నానం చేయకుండా ఉండిపోవటం, ఆఖరుకు అన్నం కూడా స్పూనుతోనే తిన్న సందర్భం గుర్తొచ్చి ముసిముసిగా నవ్వుకొనేదేమో. అలా విప్లవంలో తన తొలి ప్రేమ రోజుల్ని గుర్తు చేసుకొని సిగ్గుతో మురిసిపోయేదేమో. చివరిసారి, ఆగస్ట్ 2, 1999న కాంచీపురం బస్టాండులో విడిపోతున్నప్పుడు 'ఈసారి కలవడం లేట్ కావచ్చు' అన్న సంతోష్ చివరి మాటలు కూడా ఆమెకు గుర్తొచ్చేవేమో. అది జీవితకాలం ఎదురు చూసేంత లేట్ అవుతుందని ఊహించలేకపోయానే అని ఆమె మనసు మరోసారి మూగగా రోదించేదేమో. కన్నీళ్లు వెచ్చగా చెంపల మీదుగా జారిపోతుంటే.. కలత నిద్రలోకి జారుకునేదేమో.

• గుముడవెల్లి సోమయ్య, జయమ్మ, ప్రసాద్, రాజు
రేణుక (మిడ్కో) కుటుంబ సభ్యులు



సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.7 కనిష్ఠం 21.6



పోలింగ్ సిబ్బంది సిద్ధం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్, అదనపు కమిషనర్ (ఎన్నికల విభాగం) హేమంత్ కేశవ్ పాటిల్, అదనపు కమిషనర్ (రెవెన్యూ, ఐటీ) అనురాగ్ జయంతిలతో కలిసి ఆన్‌లైన్ ద్వారా పీఓ, ఏపీఓ, ఓపీఓలు మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు.



తనిఖీల్లో రూ.25 లక్షల నగదు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ (ఎస్ఎస్‌టీ) సోమవారం చేపట్టిన తనిఖీల్లో భాగంగా రూ.25 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఏపీలోని విశాఖపట్నం జిల్లా సీతమ్మధార ఎన్ఈఏ లేఅవుట్‌కు చెందిన జైరాం తలాసియా కారులో యూసుఫ్‌గూడ వైపు వెళ్తున్నారు. మైత్రీవనం క్రాస్‌రోడ్డు వద్ద, సారథి స్టూడియో సమీపంలో ఎస్ఎస్‌టీ బృందం తనిఖీ చేయగా కారులో రూ.25 లక్షల నగదు లభ్యమైంది. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా స్వాధీనం చేసుకున్న నగదును ఎస్ఎస్‌టీ బృందం అధికారులు స్థానిక మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

డ్రగ్స్ కంపెనీలు

ఫార్మా కంపెనీల్లోనే మాదకద్రవ్యాల తయారీ

- నగరం నుంచి అంతర్జాతీయ మార్కెట్‌కు
- 2 కేసుల్లోనే రూ.22 కోట్ల విలువైన సరుకు స్వాధీనం
- చర్లపల్లిలో రూ.12 కోట్లు.. జీడిమెట్లలో రూ.10 కోట్లు
- రెండు కంపెనీల గుట్టు రట్టు చేసిన పోలీసులు
- డ్రగ్స్ తయారీకి అడ్డాగా నగరం
- మత్తులో జోగుతున్న అధికారులు



స్వాధీనం చేసుకున్న ఎఫిడ్రిన్ డ్రగ్స్, చిత్రంలో నిందితులు



జీడిమెట్లలో డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు పోలీసులు ఇటీవల గుర్తించిన కంపెనీ

నెలరోజుల్లో రూ. 22 కోట్లు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సరిగ్గా నెలరోజుల క్రితం చర్లపల్లి పారిశ్రామికవాడలో డ్రగ్స్ తయారీ కంపెనీపై ముంబై పోలీసులు దాడి చేశారు. రూ.12 కోట్ల విలువైన డ్రగ్స్ ముడిసరుకును పట్టుకోవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది. హైదరాబాద్‌లోని పారిశ్రామికవాడల్లోని మూతపడ్డ ఫార్మా కంపెనీల్లో తయారవుతున్న మాదకద్రవ్యాలు అంతర్జాతీయ మార్కెట్‌కు తరలిపోతున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఫార్మా కంపెనీల్లో పెద్దఎత్తున మాదకద్రవ్యాలు తయారవుతున్నా ఇండస్ట్రీస్, పీసీబీ, ఇతర శాఖల అధికారులు పసిగట్టలేకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అయ్యాయి. చర్లపల్లి ఘటన వెలుగులోకి వచ్చిన కేవలం నెలరోజుల్లోనే మరో రూ.10 కోట్ల డ్రగ్స్ తయారీ ముఠా బాగోతం వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది.

చర్లపల్లి పారిశ్రామికవాడలో డ్రగ్స్ తయారీ గుట్టురట్టయిన సరిగ్గా నెలరోజుల్లోనే జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని మరో కంపెనీలో రహస్యంగా డ్రగ్స్ తయారు చేస్తున్న ముఠాను నార్కోటిక్ బ్యూరో పోలీసులు పట్టుకున్నారు. ఎఫిడ్రిన్ డ్రగ్‌ను తయారు చేస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 10కోట్ల విలువైన 220 కేజీల ఎఫిడ్రిన్ సీజ్ చేశారు. ఈ డ్రగ్స్ విలువ అంతర్జాతీయ మార్కెట్లో రూ.72 కోట్లు ఉంటుందని పోలీసులు

మిగతా 6వ పేజీలో..



క్రాకర్స్ అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

తిరుమలగిరిలో రూ.45లక్షల విలువైన క్రాకర్స్ సీజ్

హైదరాబాద్‌సిటీ/చాదర్‌ఘాట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ఫైర్ క్రాకర్స్‌ను నిల్వ ఉంచుతున్న గోదాములపై సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేస్తున్నారు. తిరుమలగిరిలోని ఓ క్రాకర్స్ గోదాముపై సోమవారం దాడి చేసి రూ.45 లక్షల విలువైన ఫైర్ క్రాకర్స్ స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధి టీచర్స్ కాలనీలో రెసిడెన్షియల్ ప్రాంతంలో దుర్గా ఏజెన్సీస్ పేరుతో ఏర్పాటు చేసిన గోదాములో పరిమితికి మించి ఫైర్ క్రాకర్స్ నిల్వ చేసినట్లు విశ్వసనీయ సమాచారం అందింది. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ టీమ్ సభ్యులు, తిరుమలగిరి పోలీసులతో కలిసి సంయుక్తంగా గోదాముపై దాడి చేశారు. ప్రమాదకరంగా నిల్వ ఉంచిన రూ.45లక్షల విలువైన ఫైర్ క్రాకర్స్‌ను సీజ్ చేశారు. నిందితుడు అభిమన్యు కుమార్ శర్మను అదుపులోకి తీసుకున్నారు. అలాగే, మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి శాలివాహన నగర్‌లోని మరో గోదాములో రూ.8లక్షల విలువైన క్రాకర్స్‌ను పోలీసులు సీజ్ చేశారు. నిందితుడు రామ్‌గుప్తాను అదుపులోకి తీసుకున్నారు.

గోదాములో పరిమితికి మించి నిల్వ చేసిన ఫైర్ క్రాకర్స్ పెట్టెలు, చిత్రంలో నిందితుడు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల, రాకేష్‌రెడ్డి, నిరుద్యోగులు

మేం 300 మందిమి నామినేషన్లు వేస్తాం..

మేం 1000 మంది..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో నిరసనల వెల్లువ

కాంగ్రెస్‌ను ఓడిస్తామని ప్రకటనలు

ఉస్మానియా యూనివర్సిటీ, పంజాగుట్ట అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నిరుద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్‌కు పోటీగా నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో 1000 మంది నిరుద్యోగులం 30 అంశాలపై నామినేషన్ దాఖలు చేసి కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించే లక్ష్యంతో పని చేస్తామని నిరుద్యోగ జేఏసీ నాయకులు వెల్లడించారు. రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్క జనరల్ నోటిఫికేషన్ కూడా విడుదల చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద వారు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కందరపల్లి కాశీనాథ్, వైస్‌చైర్మన్ భూక్యా కుమార్, జనరల్ సెక్రటరీ ఆర్‌కె.వన్నార్ చోళ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఉద్యోగాల చోరీ

రాహుల్‌గాంధీ ఓటు చోరీ అంటూ దేశమంతా తిరుగుతున్నారని, తెలంగాణలో ఉద్యోగాల చోరీ జరుగుతోందని పలువురు వక్తలు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో 300 మంది నామినేషన్లు వేస్తారని నిరుద్యోగ జేఏసీ నాయకులు ప్రకటించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ నాయకుడు జనార్దన్ అధ్యక్షతన గ్రూప్-1లో జరిగిన

మిగతా 6వ పేజీలో..

మాల సంఘాల జేఏసీ నుంచి 200 మంది..

పంజాగుట్ట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాల సామాజిక వర్గాన్ని నాశనం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నారని, ఆ పార్టీని ఓడించేందుకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో 200 మంది నామినేషన్ వేస్తామని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, గౌరవ అధ్యక్షుడు చెరుకు రాంచందర్ తెలిపారు. వర్గీకరణ పేరుతో ఎస్సీలోని 58 కులాలకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకే నామినేషన్ వేయనున్నట్టు వారు ప్రకటించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విపరీతమైన అవినీతి పెరిగిపోయిందని, ఫ్యూచర్ సిటీ పేరుతో పేద రైతుల భూములు గుంజుకుంటున్నారని అన్నారు. కొండారెడ్డిపల్లికి రూ.కోట్లు మిగతా పల్లెలకు తూట్లా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా విఫలం అయ్యారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అంతం.. మాలల పంతంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు తాళ్లపల్లి రవి, దాసరి భాస్కర్, బేరా బాలకిషన్, నగేష్, గంగాధర్, మాదాసు రాహుల్ రావు, నామ సైదులు, కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లపై విజిలెన్స్

తప్పుడు పత్రాలతో జారీ చేసిన వాటిపై ఆరా

క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్న అధికారులు.. ఆర్టిజన్లు, లైన్‌మెన్లపై ఆరోపణలు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ శివారు ప్రాంతాల్లో తప్పుడు పత్రాలతో విద్యుత్ మీటర్లు జారీ చేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) విజిలెన్స్ విభాగం వాటిపై దృష్టి సారిస్తోంది. ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాలకు నేరుగా వెళ్లి ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను అధికారులు పరిశీలించి రిపోర్టులు సిద్ధం చేసి సీఎండీకి అందజేస్తున్నారు. సెక్షన్ స్థాయిలో వచ్చే ఫిర్యాదులపై విజిలెన్స్, డీపీఈ వింగ్ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. గాజులరామారం, దుండిగల్ ప్రాంతాల్లో సరైన పత్రాలు లేకుండా గతంలో విద్యుత్ మీటర్లు జారీ చేయడంతో సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. అనంతరం కుత్బుల్లాపూర్, మేడ్చల్, కీసర వంటి ప్రాంతాల్లో కొంతమంది తప్పుడు పత్రాలతో మీటర్లకు దరఖాస్తులు చేస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయి. ప్రధాన కార్యాలయానికి ఫోన్‌లో వచ్చే ఫిర్యాదులను రికార్డు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తోంది. ఇప్పటికే పలు డివిజన్లు, సెక్షన్ల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ ప్రారంభించి పలువురికి నోటీసులు జారీ చేశారు. గత రెండేళ్లలో సర్కిల్, డివిజన్, సెక్షన్ల స్థాయిలో చేపట్టిన నామినల్ పనులు, వాటి కేటాయింపులు, టెండర్ల ప్రక్రియపై పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలిస్తున్నారు.

ఆర్టిజన్లు, లైన్‌మెన్లపై ఆరోపణలు

శివారు ప్రాంతాల్లో కొంతమంది ఆర్టిజన్లు, లైన్‌మెన్లు ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. సంగారెడ్డి, మేడ్చల్, సరూర్‌నగర్, హబ్సిగూడ, సైబర్‌సిటీ, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ సర్కిళ్లలో కొంతమంది ఆర్టిజన్లు ప్రైవేట్ కాంట్రాక్టర్లుగా మారారు. ఉన్నతాధికారులతో ఉన్న పరిచయాలతో కొందరు ప్రైవేట్ కాంట్రాక్టర్లతో కలిసి డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్‌స్థాయిలో పనులు చేస్తున్నారు. సంగారెడ్డి సర్కిల్ ఇస్నాపూర్ 2 సబ్‌స్టేషన్ పరిధిలో ఓ ఆర్టిజన్‌ను బదిలీ చేసినా కొత్త స్థానానికి వెళ్లకుండా పాతపోస్టులో పనిచేస్తూ భారీగా అక్రమాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలున్నాయి. ఓ ప్రైవేట్ వెంచర్‌కు అనధికారికంగా ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడంతో పాటు, అక్రమ భవనాలకు కనెక్షన్లు ఇప్పిస్తూ భారీగా వసూళ్లకు పాల్పడినట్లు అభియోగాలు ఉన్నాయి.



వృద్ధ దంపతులపై కేర్ టేకర్ దాడి

- 8 తులాల బంగారు నగలతో పరార్

6

జీవో నం.9ని ఆమోదించకపోతే గవర్నర్ రాజీనామా చేయాలి

- 23న చలో రాజ్‌భవన్
- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్‌గౌడ్

ట్రాఫిక్ భారీగా జాం!

- భారీ వాహనాలతో ఇబ్బందులు
- పగటిపూటా రోడ్లపైకి..
- బ్రేక్‌డౌన్ అయితే ఆ రోడ్డు అంతే



కూకట్‌పల్లి వై జంక్షన్-బాలానగర్ మెట్రోస్టేషన్ సమీపంలో రోడ్డుమీద మొరాయించిన భారీ వాహనం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో రోడ్లపై రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యల తీవ్రత పెరుగుతూనే ఉంది. భారీ వాహనాలు, ట్రక్‌లు, లారీలు, గూడ్స్ క్యారియర్లు వంటి వాహనాలు బ్రేక్‌డౌన్‌లకు గురైనప్పుడు పరిస్థితి మరింత తీవ్రమవుతోంది. అందుకు తాజా నిదర్శనం కూకట్‌పల్లి వై జంక్షన్- బాలానగర్ మెట్రో స్టేషన్ సమీపంలో సోమవారం భారీ ట్రక్కు రోడ్డు మధ్యలో మొరాయించింది. దీంతో కొన్ని గంటల పాటు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తింది. సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో రోజూ నాలుగైదు చోట్ల భారీ వాహనాలు రోడ్లపై మొరాయిస్తుంటాయని ట్రాఫిక్ పోలీసులే చెబుతున్నారు. ముఖ్యంగా కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, మియాపూర్, బాచుపల్లి, ఎల్బీనగర్, ఉప్పల్ వంటి ప్రధాన మార్గాల్లో ఈ తరహా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రాత్రి సమయాల్లోనే రోడ్డు ఎక్కాల్సిన భారీ ట్రక్కులు పగటి వేళల్లోనూ ప్రధాన రోడ్లపైకి రావడం పెద్ద సమస్యగా మారిందని నగర ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక్క భారీ వాహనం బ్రేక్‌డౌన్ అయితే గంటల తరబడి ఆ మార్గంలో ట్రాఫిక్ చిక్కులు ఎదురవుతున్నాయి. నగర శివారు ప్రాంతాల్లో భారీ నిర్మాణాలు జరుగుతుండడంతో అక్కడికి భారీ వాహనాలు, ట్రక్కులు, ఇసుక, ఇటుక, కంకర, సిమెంటు, స్టీల్ లోడ్స్‌తో పగటి వేళలో కూడా తిరుగుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రాత్రి 10 తర్వాతే భారీ వాహనాలు తిరగాల్సి ఉన్నా, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్లపై బ్రేక్‌డౌన్ అవుతున్న వాహనాలను వేగంగా తొలగించేందుకు ప్రత్యేక క్రేన్ సర్వీసులను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల వారీగా అందుబాటులో ఉంచుకోవాల్సిన అవసరం ఉందని ట్రాఫిక్ నిపుణులు సూచిస్తున్నారు.

జేఎన్‌టీయూ అనుబంధ కాలేజీల్లో

ఐదుగురు ఆచార్యులకు స్థానచలనం



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న మూడు ఇంజనీరింగ్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌తో పాటు పలువురు ఆచార్యులను బదిలీ చేస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జగిత్యాల జేఎన్‌టీయూ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్న విశ్వనాథ రాజును సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించారు. అక్కడ పనిచేస్తున్న నర్సింహను జగిత్యాల కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. హైదరాబాద్ క్యాంపస్ కాలేజీలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ వెంకటేశ్వరరెడ్డిని పాలేరు జేఎన్‌టీయూ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించగా, అక్కడ ప్రిన్సిపాల్ పోస్టులో ఉన్న రమేశ్‌ను బాధ్యతల నుంచి రిలీవ్ చేసి కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతిగా నియమించారు. మరోవైపు జగిత్యాల జేఎన్‌టీయూ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శ్వేతను, అనారోగ్య కారణాల రీత్యా సుల్తాన్‌పూర్ కాలేజీకి బదిలీ చేసినట్లు రిజిస్ట్రార్ జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నకిలీ ఆధార్, పాన్‌కార్డుతో

రూ. 16.5 లక్షల రుణం

చంపాపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నకిలీ ఆధార్, పాన్‌కార్డులతో ఓ ఉద్యోగి బ్యాంక్‌కు టోకరా వేశాడు. రూ.16.5 లక్షల అప్పు తీసుకుని మోసానికి పాల్పడ్డాడు. కంచన్‌బాగ్‌లోని ఎస్‌బీఐలో 2023 నవంబర్‌లో ఉప్పల్ హబ్సిగూడ నేషనల్ జియోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో సీనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఉద్యోగి ప్రవీణ్ తన ఆధార్, పాన్‌కార్డు, మూడు నెలల పేస్లిప్‌లను బ్యాంక్ అధికారులకు అందించి పర్సనల్ ఎక్స్‌ప్రెస్ లోన్ కింద రూ.16.50లక్షల రుణం పొందాడు. బ్యాంక్‌కు గత సంవత్సరం నుంచి డబ్బులు చెల్లించడం లేదు. బ్యాంకు అధికారులు ప్రవీణ్ ఇచ్చిన ఆధార్, పాన్‌కార్డులను పరిశీలించగా అవి ఫేక్‌వని తేలింది. దీంతో ప్రవీణ్‌పై చర్యలు తీసుకోవాలని బ్యాంక్ మేనేజర్ శివకుమార్ కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

లోడు ఎంతయినా తట్టుకునేలా

1000 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు

డిమాండు పెరిగే ప్రాంతాల్లో అందుబాటులోకి.. ఇన్‌బిల్ట్ డీటీఆర్‌ల ఏర్పాటుతో ప్రమాదాల నివారణ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగం ఎంత పెరిగినా తట్టుకునేలా గ్రేటర్‌లో కొత్తగా 1000 కేవీఏ(కిలో వోల్ట్స్ పర్ యాంప్స్) డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్‌పంపిణీ సంస్థ అందుబాటులోకి తెస్తోంది. ప్రమాదాల నివారణకు ఇన్‌బిల్ట్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో పాటు స్విచ్‌గేర్లు ఒకే ప్రాంతంలో ఉండేలా డిస్కం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వీటి వల్ల ప్రమాదాలు కూడా తగ్గించుకునే అవకాశాలుంటాయని, ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్ లీక్ వంటి సమస్యలు తలెత్తవని అధికారులు చెబుతున్నారు. వేసవి డిమాండ్ నాటికి గ్రేటర్ పరిధిలోని 10 సర్కిళ్లలో 20కి పైగా వెయ్యి కేవీఏ సామర్థ్యం కలిగిన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ప్రస్తుతం గ్రేటర్‌లో 500 కేవీఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లే పెద్దవి.

2,282 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు



గ్రేటర్‌లో రికార్డు స్థాయిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో 2026 జనవరి నాటికి 9 సర్కిళ్లలో 2,282 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నిర్ణయించింది. బంజారాహిల్స్, హైదరాబాద్ సౌత్, సెంట్రల్, సికింద్రాబాద్, మేడ్చల్, హబ్సిగూడ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, సైబర్‌సిటీ సర్కిళ్లలో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 130, 160 కేవీఏ- 1709, 315 కేవీఏ - 398, 500 కేవీఏ- 45 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచేలా సమ్మర్‌యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. 9 సర్కిళ్లలో కొత్తగా 100 కేవీఏ సామర్థ్యం కల్గిన ట్రాన్స్‌ఫార్మర్లు 1080, 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 108 ఏర్పాటు చేయనున్నారు.

డిమాండ్ ఏ స్థాయిలో పెరిగినా..



గ్రేటర్ హైదరాబాద్‌లో ఏటా విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. దానికి తగ్గట్లు డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను మెరుగుపరుస్తున్నాం. ఓవర్‌లోడ్ అవుతున్న 500 కేవీఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 1000 కేవీఏ సామర్థ్యం గల వాటిని ఏర్పాటు చేస్తాం. విద్యుత్ డిమాండ్ ఏ స్థాయిలో పెరిగినా అంతరాయాలు తలెత్తకుండా, డీటీఆర్‌లపై ఓవర్‌లోడ్ పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం.

- ముషారఫ్ ఫరూఖీ, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ



సీపీఆర్ చేసే విధానాన్ని చూపిస్తున్న వైద్యుడు

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

● అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడే సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డియోపల్మనరీ రిససిటేషన్(సీపీఆర్) విధానాన్ని నేర్చుకోవడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. డీఎంహెచ్‌ఓ వెంకటి మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ వరకు జిల్లాలో సీపీఆర్ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, డీఆర్‌ఓ వెంకటాచారి, సీపీఓ సురేందర్, డీఎంఓ రాములు, కిమ్స్ వైద్య నిపుణుడు శేఖర్, బీసీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు ఆశన్న, కోటాజీ, డీఎస్‌ఓ శ్రీరామ్, కలెక్టరేట్ ఇన్‌చార్జి ఏవో విజయలక్ష్మి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లేఅవుట్లలో పార్కుల ఆక్రమణ

● హైడ్రా ప్రజావాణికి 48 ఫిర్యాదులు


హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్లాట్ పక్కన పార్కు ఉంటే మాయం చేస్తున్నారు. డెడ్ ఎండ్ రోడ్డు ఉంటే కబ్జా చేస్తున్నారు. లేఅవుట్ స్వరూపాన్ని మార్చేస్తున్నారు. చెరువులను కలుపుతూ సాగే వరద కాలువలను కూడా ఇష్టానుసారంగా మలుపులు తిప్పుతున్నారు. దీంతో కాలనీలు, బస్తీలు నీట మునుగుతున్నాయని పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి 48 ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ. రంగనాథ్ స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలు అప్పగించారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

'శాంతి చర్చలు, ప్రజాస్వామ్యం, విప్లవోద్యమం' ఆవిష్కరణ

రాంనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో విప్లవాన్ని, అది ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని, సవాళ్లను ఎలా అర్థం చేసుకోవాలనే అంశంపై పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాణి రాసిన శాంతి చర్చలు, ప్రజాస్వామ్యం, విప్లవోద్యమం, వాదోపవాద కలబోత పుస్తకాన్ని ఆవిష్కరించారు. కాత రామచంద్రారెడ్డి సహచరిణి మాలతి, విరసం నేతలు హుస్సేన్, ఎన్. వేణుగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మణ్, రవినర్ల తదితరులు మాట్లాడారు. దేశాన్ని సామ్రాజ్యవాద, భూస్వామ్య బంధనాల నుంచి విముక్తి చేసి సమసమాజ స్థాపన కోసం వేలాదిమంది రాడికల్ విద్యార్థులు సాయుధ విప్లవ పోరాటం కోసం రక్తం చిందించారని తెలిపారు. మిలిటెంట్ విద్యార్థి ఉద్యమంతోపాటు సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్మించడం కోసం జీవితాలను, ప్రాణాలను సైతం త్యాగం చేశారని వారు గుర్తు చేశారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రవీణ్‌కుమార్, మాలతి, హుస్సేన్, ఎన్.వేణుగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మణ్ తదితరులు

ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ పటిష్ఠతకు కృషిచేయాలి

మన్సూరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పటిష్ఠతకు యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ కో-ఇన్‌చార్జి రోషిణీ జైశ్వాల్, అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి సూచించారు. యూత్ కాంగ్రెస్ ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రధానకార్యదర్శిగా సంజుగౌడ్‌ను నియమించి నియామకపత్రం అందజేశారు. అనంతరం సంజుగౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు డివిజన్ల నుంచి యువకులు యూత్ కాంగ్రెస్‌లో చేరారు. వారికి రోషిణీ జైశ్వాల్, జక్కిడి శివచరణ్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి యరమల రాంరెడ్డి, చంద్రిక, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ డైరెక్టర్ విష్ణురెడ్డి, కాంగ్రెస్ నాయకులు శశిధర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ ఎల్బీనగర్ అధ్యక్షుడు శివ తదితరులు పాల్గొన్నారు.



సంజుగౌడ్‌కు నియామక పత్రం అందజేస్తున్న రోషిణీ జైశ్వాల్, శివచరణ్‌రెడ్డి

అభిప్రాయ సేకరణతో అధ్యక్షుడి ఎంపిక

ఏఐసీసీ పరిశీలకురాలు అంజలీ నింబాల్కర్



జిల్లా అబ్జర్వర్‌కు దరఖాస్తు అందజేస్తున్న నక్కా ప్రభాకర్‌గౌడ్



సమావేశానికి హాజరైన ముఖ్య నాయకులు, కార్యకర్తలు

శామీర్‌పేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలిసారిగా, వినూత్న రీతిలో క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి డీసీసీ అధ్యక్షుల నియామకాన్ని చేపడుతున్నట్లు ఏఐసీసీ పరిశీలకురాలు(అబ్జర్వర్) అంజలీ నింబాల్కర్ తెలిపారు. సోమవారం శామీర్‌పేట మండలం, అంతాయిపల్లి పరిధిలోని ఎస్ఎన్ఆర్ వేద కన్వెన్షన్ హాల్‌లో మేడ్చల్ నియోజకవర ముఖ్య నాయకులు, కార్యకర్తల సృజన అభియాన్ ముఖాముఖి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అంజలి నింబాల్కర్, పీసీసీ పరిశీలకురాలుగా సింగాపురం ఇందిర పాల్గొన్నారు. నింబాల్కర్ మాట్లాడుతూ తెలంగాణతో పాటు అన్ని రాష్ట్రాల్లో ఈ తరహా అధ్యక్ష పదవుల నియామకాన్ని చేపట్టినట్లు వివరించారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తూ క్షేత్ర స్థాయిలో వాస్తవాల ఆధారంగా అధ్యక్ష నియామకాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్, సీనియర్ నేత నక్కా ప్రభాకరగౌడ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ ఏ-బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అధిష్ఠానం ఆదేశాలను పాటిస్తూ పార్టీకి సేవ చేస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్ష పదవికి ఏడుగురు నాయకులు దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తు సమర్పించిన వారిలో వజ్రేశ్ యాదవ్, నక్కా ప్రభాకరగౌడ్, జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, రాపోలు రాములు, హరిమోహన్‌రెడ్డి, రేణుకుమార్ ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించండి

● అధికారులకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశం

మేడ్చల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌లు రాధిక గుప్తా, విజయేందర్‌రెడ్డితో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 81 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

'డ్రగ్స్' కంపెనీలు!

(5వ పేజీ తరువాయి)

అంచనా వేశారు. ఈ రెండు ఘటనల్లో రూ. 22 కోట్ల విలువైన డ్రగ్స్ తయారీ గుట్టు రట్టయింది.

నిద్రపోతున్న నిఘా..

నగర శివారుల్లోని పారిశ్రామిక ప్రాంతాల్లో కొన్ని కంపెనీలు మాదక ద్రవ్యాల తయారీకి అడ్డాగా మారుతున్నాయి. భారీ స్థాయిలో డ్రగ్స్ తయారవుతున్నా అధికారులు గుర్తించలేకపోతున్నారు. ఇండస్ట్రీస్, పీసీబీ, ఇతర శాఖల అధికారుల నిఘా వైఫల్యం కారణంగానే డ్రగ్స్ తయారీదారులు రెచ్చిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫార్మా కంపెనీలకు అనుమతులు మంజూరు చేస్తున్న అధికారులు ఆ తర్వాత ఆ కంపెనీలపై కనీస పర్యవేక్షణ ఉండటంలేదని ఆరోపణలు వస్తున్నాయి. ఆయా కంపెనీలు తీసుకున్న అనుమతులు ఏంటి? ఏం తయారు చేస్తున్నారు? అనే విషయంలో అధికారుల నియంత్రణ కొరవడింది. కంపెనీలపై నిఘా పెట్టిన నార్కోటిక్ (ఈగల్) టీమ్ అధికారులు నెలరోజుల్లోనే మరో అతిపెద్ద డ్రగ్స్ తయారీ రాకెట్‌ను పట్టుకున్నారు.

మూతబడ్డ పరిశ్రమలపై తగ్గిన ఫోకస్..

అడ్డదారిలో డబ్బు సంపాదనకు అలవాటు పడిన కొన్ని ముఠాలు.. నగరంలోనే గుట్టుగా డ్రగ్స్ తయారీకి తెరతీస్తున్నాయి. నగర శివారు ప్రాంతాలైన రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్స్, సంగారెడ్డి పరిధిలోని పారిశ్రామిక వాడల్లో కొన్ని మూతపడ్డ పరిశ్రమలను, ఖాళీగా ఉన్న షెడ్లను ఎంచుకుంటున్నాయి. వాటిని గోదాములు, ఇతర అవసరాల కోసమని తయారీదారులు లీజుకు తీసుకుంటున్నారు. వాటిలో మాదకద్రవ్యాలను తయారు చేస్తున్నారు. కొన్నేళ్లుగా న్యూ ఇయర్ వేడుకలకు ముందు సైబరాబాద్, నాచారం, పటాన్‌చెరు, జిన్నారం పరిధిలో డ్రగ్స్ ఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. పారిశ్రామిక వాడల్లో మూతపడ్డ పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి? ఎక్కడెక్కడ ఉన్నాయి? వాటిని ఎవరికైనా లీజుకు ఇచ్చారా? అక్కడ గుట్టుగా ఏం తయారు చేస్తున్నారు? అనే పర్యవేక్షణను అధికారులు మరచిపోయారు. ఈ నేపథ్యంలో పలు ఫార్మా కంపెనీల యజమానులు మూతపడ్డ షెడ్లను లీజులకు తీసుకొని వారి కంపెనీకి అనుబంధ సంస్థగా చూపించి వాటిలో మెఫిడ్రిన్, ఎఫిడ్రిన్, అల్ప్రాజోలమ్ వంటి మత్తు పదార్థాలను తయారు చేస్తున్నారు. ఫార్మా ప్రొడక్టు మాటున ఇతర రాష్ట్రాలకు, దేశాలకు సరుకును తరలిస్తున్నట్లు తెలుస్తోంది. డీఆర్‌ఏ, ఇతర రాష్ట్రాల పోలీసులు హైదరాబాద్‌కు వచ్చి కంపెనీల్లో డ్రగ్స్ తయారీ గుట్టు రట్టు చేసేంత వరకు ఇక్కడి అధికారులు కనిపెట్టలేకపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. న్యూ ఇయర్ వేడుకలకు మరో రెండు నెలలు మాత్రమే సమయం ఉన్నందున ఇప్పటికైనా పలు విభాగాల అధికారులు పారిశ్రామిక ప్రాంతాల్లోని కంపెనీలపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

రేపు జేఎన్‌టీయూకు స్వీడన్ బృందం

● బీటీహెచ్ వీసీ సహా పలువురు అధికారుల రాక

● జేఎన్‌టీయూ-స్వీడన్ ఎంవోయూకు 20ఏళ్లు పూర్తి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆచార్యుల, అధికారుల బృందం బుధవారం జేఎన్‌టీయూ క్యాంపస్‌ను సందర్శించనుంది. రెండు యూనివర్సిటీలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ మాస్టర్ ప్రోగ్రామ్(ఐడీడీఎంపీ) ప్రారంభమై 20ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో స్వీడన్ యూనివర్సిటీ అధికారుల బృందం జేఎన్‌టీయూ సందర్శనకు వస్తున్నట్లు వర్సిటీ ఉన్నతాధికారులు వెల్లడించారు. రెండురోజుల పర్యటనలో భాగంగా యూనివర్సిటీ అధికారులు, ఆచార్యులు, విద్యార్థులతో స్వీడన్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ హెనెరిక్ జాన్సన్ నేరుగా సంభాషించనున్నట్లు తెలిసింది. జేఎన్‌టీయూ-బీటీహెచ్‌లు సంయుక్తంగా ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు, బోధనా సిబ్బంది మార్పిడి వంటి అంశాలపై కీలకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం నిర్వహిస్తున్న కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సులతోపాటు కొత్తగా స్పేషియల్ టెక్నాలజీ కోర్సును పరిచయం చేస్తూ మరొక ఎంఓయూ కుదుర్చుకునేందుకు స్వీడన్ యూనివర్సిటీ అధికారులు ఉత్సాహం చూపుతున్నట్లు సమాచారం.

టీటీఏ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

నల్లకుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టీటీఏ) ఆధ్వర్యంలో అమెరికాలోని 15 రాష్ట్రాల్లో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించామని టీటీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి, అడ్వైజర్ కమిటీ చైర్మన్ డాక్టర్ విజయపాల్‌రెడ్డి, కో-చైర్మన్ డాక్టర్ మోహన్‌రెడ్డి, టీటీఏ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి చెప్పారు. దేవీనవరాత్రి ఉత్సవాల సందర్భంగా బతుకమ్మతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామని, ఈ కార్యక్రమాల్లో అమెరికాలో ఉంటున్న తెలుగు కుటుంబాలు పాల్గొన్నాయని సోమవారం వారు తెలిపారు.

నామినేషన్ వేసేందుకు ర్యాలీగా..



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న హైదరాబాద్ యూత్ కరేజ్ సంస్థ వ్యవస్థాపకుడు సల్మాన్ ఖాన్ - బోరబండ, ఆంధ్రజ్యోతి

మేం 300 మందిమి నామినేషన్లు వేస్తాం..

(5వ పేజీ తరువాయి)

అక్రమాలపై అఖిలపక్ష సమావేశం జరిగింది. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్, బీఆర్ఎస్ నాయకుడు రాకేష్‌రెడ్డి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(భీమ్ రావు అంబేడ్కర్)రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, మోతీలాల్ నాయక్, సంజీవ్ నాయక్, కోచింగ్ సెంటర్ నిర్వాహకులు అశోక్, గంగాధర్ తదితరులు మాట్లాడారు. నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఉప ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. ప్రభుత్వం గ్రూప్-1ను మరింత జఠిలం చేస్తోందని రాకేష్‌రెడ్డి ఆరోపించారు. నిరుద్యోగుల పోరాటాన్ని అణిచివేయాలని ప్రభుత్వం యత్నిస్తే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో చంద్రశేఖర్, ఇంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొట్టిన కారు.. యువకుడి మృతి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్కూటీని కారు ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పోచారం ఐటీకారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్‌కు చెందిన అర్ర సిద్దయ్య కుమారుడు సాయి యశ్వంత్(24) సివిల్ కాంట్రాక్ట్ పనిచేస్తుంటాడు. ఆదివారం స్కూటీపై స్నేహితుడు కాసుల పవన్‌తో కలిసి పోచారం మున్సిపాలిటీ, చౌదరిగూడ సమీపంలో పైప్‌లైన్ మరమ్మతు పనిచేసి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. అనురాగ్ యూనివర్సిటీ దాటి నాడెం చెరువు సమీపంలోకి వెళ్లగానే వెనుక నుంచి వచ్చిన కారు స్కూటీని ఢీకొట్టింది. సాయి యశ్వంత్‌కు తీవ్రగాయాలు కాగా, కాసుల పవన్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం మేడిపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు యశ్వంత్‌ను పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ బాడీ బిల్డర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక


తెలంగాణ బాడీ బిల్డర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

బర్కత్‌పుర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బాడీ బిల్డర్స్ ఫిజిక్ స్పోర్ట్స్ అసోసియేషన్ (టీబీబీపీఎస్ఏ) నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇటీవల జరిగిన జనరల్ బాడీ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పి.శ్రీనివాస్, కార్యదర్శిగా రంజన్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా యేసప్ప, మహ్మద్ ఇంతియాజ్‌లు నియమితులైనట్లు నూతన అధ్యక్షురాలు సుదం మాధవి తెలిపారు. కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. క్రీడలను మరింత ప్రోత్సాహించేందుకు కమిటీ కృషి చేస్తోందన్నారు.

మహాత్మాగాంధీ శాంతి పురస్కారానికి శ్యామ్‌రావు ముదిరాజ్ ఎంపిక



బర్కత్‌పుర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సహకార్ స్వచ్ఛంద సేవా సంస్థ యేటా ఇచ్చే మహాత్మా గాంధీ శాంతి పురస్కారానికి కాంగ్రెస్ ఓబీసీ సెల్ గ్రేటర్ ఉపాధ్యక్షుడు కె. శ్యామ్‌రావు ముదిరాజ్ ఎంపికయ్యారు. 25 ఏళ్లుగా సమాజ సేవ చేయడంతోపాటు నగర పాలక సంస్థలో విధులు నిర్వహిస్తూ పాతబస్తీ సంక్షేమ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని సహకార్ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల హేమంత్ తెలిపారు. ఈ నెల 14న బొగ్గులకుంట సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారి చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న బీఎస్ మూర్తి, చంద్రమోహన్‌రెడ్డి, అధ్యాపక బృందం తదితరులు

ఎంజీఐటీలో మైక్రోస్కోపీ కేంద్రం ప్రారంభం

నార్సింగ్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): టీఆర్ఏఈఆర్ఎఫ్, ఎంజీఐటీ సంయుక్తంగా సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ మైక్రోస్కోపీ సెంటర్ సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సంస్థల్లో ఇలాంటి పరిశోధనా ఆధారిత సదుపాయాలను ఏర్పాటు చేయడంలో యాజమాన్యం చూపించిన ఉత్సాహం అద్భుతమన్నారు. ఇనిస్టిట్యూట్‌లోని అధ్యాపక సిబ్బంది అందరూ ఈ నూతన సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఇనిస్టిట్యూట్‌లో కొనసాగుతున్న పరిశోధనా కార్యకలాపాలను పరిగణలోకి తీసుకుని, ఈ సదుపాయాన్ని మెటలర్జికల్, మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగంలో ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో రవిప్రకాష్‌రెడ్డి, లింగారెడ్డి, ప్రకాశం తదితరులు

'మాస్ మీడియా' పై అంతర్జాతీయ సదస్సు

నార్సింగ్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గండిపేట చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆంగ్ల భాషా బోధన, శిక్షణ, అభ్యాసం కోసం మాస్ మీడియా అనే అంశంపై రెండురోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సును సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీవీ-9 వ్యవస్థాపకుడు రవి ప్రకాష్ పాల్గొన్నారు. తమ మాతృభాషను ప్రేమిస్తే, ఇంగ్లీష్ భాషపై ప్రేమ స్వయంగా కలుగుతుందని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకట్‌రెడ్డి, ప్రకాశం, ప్రొఫెసర్ లింగారెడ్డి, సువర్ణ లక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హిందీ నేర్చుకోవాలి : ఐఐఎంఆర్ డైరెక్టర్

రాజేంద్రనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : అధికార భాష హిందీలో మాట్లాడటం, ప్రసంగాలు చేయడం కేంద్ర ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు, ఉద్యోగులు నేర్చుకోవాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి అన్నారు. సెప్టెంబరు 14 నుంచి అక్టోబరు 13 వరకు రాజేంద్రనగర్ లోని ఐఐఎంఆర్ లో జరిగిన హిందీ చేతన మాస్ కార్యక్రమ ముగింపు సమావేశంలో ఆమె సోమవారం పాల్గొని ప్రసంగించారు.

'సావనీర్‌ను ఆవిష్కరించుకోవడం ఆనందం'

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థుల సమాచారంతో సావనీర్‌ను ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉందని కాకతీయ విశ్వవిద్యాలయం ఫార్మా అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.ప్రభాశంకర్ అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అలుమ్ని అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మా సైన్సెస్‌ల ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న స్వర్ణోత్సవాలు సోమవారంతో ముగిశాయి. పూర్వ విద్యార్థుల సమాచారాన్ని సేకరించి, సందేశాలు, వ్యాసాలు, ఫొటోలను సేకరించి వాటిని ఓ సావనీర్‌గా డాక్టర్ శిరీష కలాం అద్భుతంగా రూపొందించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : గోషామహల్ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలు అర్హులైన వారికి అందించేలా తన వంతు కృషి చేస్తున్నానని కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.ధన్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం గోషామహల్‌లోని తన కార్యాలయంలో ఎస్.ధన్‌రాజ్‌కు, హైదరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ టి.సతీష్, వినోద్ గుప్తా, నరేశ్ పటేల్, ఆకాశ్‌సింగ్, యోగేశ్ యాదవ్, బుగ్గ వెంకటేశ్, కరణ్, ప్రసాద్, సంతోష్‌ల నేతృత్వంలో ఎస్.ధన్‌రాజ్‌ను గజమాలతో ఘనంగా సత్కరించారు.

ఆచార్య ఎస్వీ రామారావు చిరస్మరణీయుడు


రామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు తదితరులు

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహిత్య విమర్శ వికాసం కోసం జీవితాన్ని ధారపోసిన ఆచార్య ఎస్వీ రామారావు చిరస్మరణీయులని వక్తలు కొనియాడారు. ఇటీవల దివంగతులైన ప్రముఖ విమర్శకులు, పరిశోధకులు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు, ఆర్ట్స్ డీన్ ఆచార్య ఎస్వీ రామారావు సంస్మరణ సభ సోమవారం తెలంగాణ సారస్వత పరిషత్తులో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగింది. పెద్దసంఖ్యలో విచ్చేసిన కవులు, పండితులు రామారావు చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. డాక్టర్ సినారె పరిశోధన గ్రంథం తర్వాత ఆచార్య ఎస్వీ రామారావు పరిశోధన గ్రంథం అలాంటి గౌరవాన్ని పొందిందన్నారు. కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ఆచార్య టి.గౌరీశంకర్, గన్నమరాజు గిజా మనోహర్‌బాబు, డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, డాక్టర్ కాంచనపల్లి, డాక్టర్ నాళేశ్వరం శంకరం, డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, కొనకం మురళీ, రింగు రామ్మూర్తి, మరుమాముల దత్తాత్రేయ శర్మ, ఆచార్య రామారావు సతీమణి స్వయంప్రభ, కుమారుడు సాయి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వేడి!

- పని ఒత్తిడితో ఇద్దరు అంగన్‌వాడీ టీచర్ల రాజీనామా
- సూపర్‌వైజర్ వేధింపులు కూడా కారణం?



రాజేంద్రనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు రాజీనామా చేస్తున్నారు. ప్రతీ సర్వేను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. దానికి సూపర్‌వైజర్ వేధింపులు తోడయ్యాయని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఇద్దరు రాజీనామా చేశారు. ఇంకా మరికొందరు ఇదే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.. ఆ మేరకు కథనం..

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోకి వచ్చే శేరిలింగంపల్లి ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీమ్ (ఐసీడీఎస్) పరిధిలో సుమారుగా 60 మంది అంగన్ వాడీ టీచర్లు పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు మైలార్‌దేవుపల్లి సెక్టార్ లో ఇద్దరు రాజీనామా చేశారు. మరి కొంత మంది అదే బాటలో ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి కారణం పని ఒత్తిడి, సూపర్‌వైజర్ వేధింపులే కారణమని పలువురు అంగన్‌వాడీ టీచర్లు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల క్రితం సైతం సదరు అధికారి ఓ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన సందర్భంగా సరిగా పనిచేయాలని, లేనట్లయితే ఇప్పటికే ఇద్దరు రాజీనామా చేసి వెళ్లిపోయినట్లు 'మీరు కూడా వెళ్లిపోండి అని' అన్నట్లు తెలిసింది. ఆమెను ఇక్కడ నుంచి మార్చాలని, లేకుంటే మరి కొన్ని రోజుల్లో ఇంకొందరు అంగన్‌వాడీ టీచర్లు సైతం రాజీనామా చేసే అవకాశాలు ఉన్నాయని పలువురు చెబుతున్నారు.

"18 సంవత్సరాలుగా మేము అంగన్‌వాడీ టీచర్లుగా పనిచేస్తున్నాం. ఇప్పుడు అధికారులు మేము చేస్తున్న ప్రతీ సర్వేను ఆన్ లైన్ లో పెట్టమని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో పనిభారం ఎక్కువవుతోంది. ఇంకేమీ చేయలేక మాకు అన్నం పెట్టే ఉద్యోగాలకు రాజీనామా చేయాల్సిన పరిస్థితి. బిడ్డ జన్మనిచ్చినప్పటి నుంచి ఓ వ్యక్తి మరణించేవరకు చేయాల్సిన అన్ని సర్వేలు చేస్తున్నాం. అవే కాకుండా ఎన్నికల విధులు, పల్స్‌పోలియో, వివిధ రకాల మెడికల్ సర్వేలు ఇలా ఒకటి కాదు అన్ని రకాల సర్వేలు, విధులను నిర్వహిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలను నడుపుతున్నాం. మాపై ఒత్తిడి లేకుండా పనులు చేయించుకుంటే మంచిది" అని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో పని చేయలేకే మానేస్తున్నారు..

కొందరు అంగన్‌వాడీ టీచర్లు ఆన్‌లైన్‌లో పని సరిగా చేయలేకే రాజీనామా చేస్తున్నారు. ఇంకొందరు ఫోన్‌లో అందుబాటులో ఉండటం లేదు. ఒకరు మేము మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నామని వెళ్లిపోయారు. మరొకరు వారి ఇష్టపూర్వకంగా రాజీనామా చేశారు. నేను ఎవరినీ బలవంతంగా రాజీనామా చేయమని అడగడం లేదు. ఒక కేంద్రంలో తనిఖీకి వెళ్లినప్పుడు మాత్రం పనిచేయడం రాకపోతే రాజీనామా చేయండన్నాను.

: పద్మజ, సూపర్‌వైజర్, మైలార్‌దేవుపల్లి సెక్టార్

ఉన్నతాధికారులకు జవాబు చెప్పాలి

మేము జిల్లా స్థాయి అధికారులకు సమాధానం చెప్పాలి. అందుకే మీరు (అంగన్‌వాడీ టీచర్లు) చేస్తున్న పనిని ఆన్‌లైన్‌లో పెట్టమని అడుగుతుంటాం. ఇద్దరు టీచర్లు వారి ఇష్టానుసారంగానే రాజీనామా చేశారు.

కవిత, సీడీపీఓ, ఐసీడీఎస్ శేరిలింగంపల్లి ప్రాజెక్టు

సీపీఆర్‌పై అవగాహన వారోత్సవాలు


సీపీఆర్‌పై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

బర్కత్‌పుర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీపీఆర్‌పై అవగాహన వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.వి.రాజశేఖర్, ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ మంజునాయక్, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ శ్రవణ్‌రెడ్డి, ఎన్‌హెచ్ఎం ప్రతినిధి డాక్టర్ బ్రహ్మేంద్ర తదితరులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల 17 వరకు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని, కళాశాల విద్యార్థులకు సీపీఆర్‌పై పూర్తి అవగాహన పెంపొందిస్తామని వారు అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్‌భరత్, డాక్టర్ సతీష్‌లు దీనిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన తప్పనిసరి


కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్

రాజేంద్రనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం సమాచార హక్కు చట్టం - 2005 పై అవగాహన కల్పించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్ ఆన్‌లైన్ విధానంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వవిద్యాలయ అధికారులు, కంప్ట్రోలర్ శ్రీనివాసరావు, జాయింట్ రిజిస్ట్రార్ డి.శివాజీ, వర్సిటీ పరిధిలోని కళాశాలల అసోసియేట్ డీన్‌లు పరిశోధన స్థానాల అధిపతులు, అసోసియేట్ డైరెక్టర్స్ ఆఫ్ రీసెర్చ్, కృషి విజ్ఞాన కేంద్రాల సమన్వయ కర్తలు పాల్గొన్నారు. స.హ. చట్టం అమలు గురించి రిజిస్ట్రార్ జీఈసీహెచ్ విద్యాసాగర్, కంప్ట్రోలర్ శ్రీనివాస్‌రావులు వివరించారు. స.హ చట్టం అమలుపై ప్రభుత్వం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిరంతరం సమీక్ష చేస్తున్నాయన్నారు. ప్రతీఅధికారి ఈ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని వర్సిటీ పౌర సంబంధాల అధికారి డాక్టర్ వి.సుధాకర్, సహాయ పౌర సంబంధాల అధికారి టి. మార్క్స్ బాబులు సమన్వయం చేశారు.

కనీస పెన్షన్ రూ.7,500 చెల్లించాలి

- విశ్రాంత పెన్షనర్లు



పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

బర్కత్‌పుర, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో పనిచేసి పదవి విరమణ పొందిన ఉద్యోగులకు కనీస పెన్షన్ 7,500 రూపాయలు చెల్లించాలని నేషనల్ యాజిటేషన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు కె.శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి వై.వి.సుబ్బయ్య డిమాండ్ చేశారు. దీంతో పాటు డీఏ కూడా ఇవ్వాలన్నారు. సోమవారం బర్కత్‌పురలోని పీఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీలో నేషనల్ యాజిటేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు మద్దతుగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు మెడికల్ సదుపాయం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రిటైర్డ్ ఉద్యోగి, అతడి భార్యకు పూర్తి మెడికల్ సదుపాయం కల్పించాలన్నారు. వృద్ధాప్యంలో నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్లకు రిటర్న్ ఆఫ్ క్యాపిటల్(ఆర్‌వోసీ)ని 20 ఏళ్లకు ఒకసారి చెల్లించి , తిరిగి పెన్షన్ సదుపాయాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. లేకపోతే తమ పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు జి.ఎన్.రావు, సుధాకర్, కేజీరావు, రామేశ్వరం, ఎన్.ప్రసాదరావు, గంగాధర్, రామ్మూర్తి, వై.ఆర్.కె.రాజు, శ్రీనివాస్, భవాని, కోకిల, గిరిజారాణి పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న యాస్మిన్

రాజేంద్రనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్, మానవ వనరుల అభివృద్ధిపై తెలంగాణ వ్యవసాయ, ఉద్యానవన అధికారులకు ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం రాజేంద్రనగర్‌లో సోమవారం ప్రారంభమైంది. భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ, మొక్కల రక్షణ, క్వారంటైన్, నిల్వ డైరెక్టరేట్ కింద హైదరాబాద్ లోని సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ ద్వారా ఈ శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమాన్ని తెలంగాణ ఉద్యానవన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాష ప్రారంభించారు. పెస్ట్ మేనేజ్‌మెంట్‌పై క్షేత్రస్థాయి అధికారులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన రంగంలో రాష్ట్రం సాధించాల్సిన ఉత్పత్తి, ఉత్పాదకతలపై అధికారులకు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐపీఎం విభాగం ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీతా పాండే పెస్ట్ మేనేజ్‌మెంట్ పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో బెంగుళూరు రీజినల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎ సిద్దిఖీ, వెంకట్‌రెడ్డి, ఆర్ సునీతలు పాల్గొన్నారు.



గౌలిపురా సరస్వతి శిశు మందిర్ వద్ద గల హనుమాన్ దేవాలయం వద్ద సుమారు రూ.10లక్షలతో చేపట్టిన రోడ్డు పనులను బీజేపీ భాగ్యనగర్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు సీహెచ్ రూప్‌రాజ్ ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్, నాయకులు ఎం.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- చాంద్రాయణగుట్ట, (ఆంధ్రజ్యోతి)



ఉప్పుగూడ మహంకాళి దేవాలయం ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 28 వరకు నూతన శివాలయ మరకత లింగం, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఆలయ కమిటీ అధ్యక్షుడు జె.మధుసూదన్ గౌడ్ తదితరులు ఆవిష్కరించారు.

- చాంద్రాయణగుట్ట, (ఆంధ్రజ్యోతి)


అసంపూర్తిగా ఉన్న వంతెన

వంతెనకు ర్యాంప్, సైడ్‌వాల్స్ ఏవి?

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉప్పుగూడ శివాజీనగర్ సాయిబాబానగర్ బస్తీల మధ్య నాలాపై వంతెన నిర్మించారు. వంతెనకు ఇరువైపులా ర్యాంప్‌లు, సైడ్ వాల్స్ నిర్మించక మూడునెలలు గడుస్తోంది. దీంతో చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని స్థానికులు వాపోయారు. సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదని బీజేపీ ఉప్పుగూడ డివిజన్ మాజీ అధ్యక్షుడు అక్కినమోని వెంకటేశ్ తెలిపారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.


విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం.సుగుణారెడ్డి

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

రాజేంద్రనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన పాఠశాల స్థాయి జోనల్ గేమ్స్ లలో రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. కబడ్డీ అండర్ - 17 బాలుర విభాగంలో ఎం. సాయి చరణ్, రామ్ చరణ్‌లు, కబడ్డీ అండర్ - 14 బాలుర విభాగంలో ఎ. అమర్ సింగ్, ఆర్ సంతోష్, కె రవికుమార్, వాలీబాల్ అండర్ - 17 బాలుర విభాగంలో సంతోష్, తేజ, వాలీబాల్ అండర్ - 14 బాలుర విభాగంలో డి.హేమచంద్ర, కబడ్డీ అండర్ - 14 బాలికల విభాగంలో బి.పావని, ఖోఖో అండర్ -14 బాలికల విభాగంలో కె. సింధు లు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ కు ఎంపికయ్యారు. వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం.సుగుణారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

బంగారు ఆభరణాల చోరీ

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. ఈ సంఘటన ఛత్రినాక పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఛత్రినాక అడిషనల్ ఇన్‌స్పెక్టర్ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గౌలిపురా గాంధీ బొమ్మ వద్ద నివసించే ఆర్.రేణుక గత ఆదివారం ఓ శుభకార్యానికి వెళ్లొచ్చి ఏడు తులాల బంగారు ఆభరణాలను సీక్రెట్ లాకర్లో దాచింది. బుధవారం లాకర్ తెరచి చూడగా ఆభరణాలు కనిపించలేదు. ఈ చోరీపై ఛత్రినాక పోలీసులకు ఆమె గురువారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

16,17న ఎంజీబీఎస్‌లో కార్గో పార్సిల్ వస్తువుల వేలం

హైదరాబాద్‌సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ (ఎంజీబీఎస్)లోని కార్గో, పార్సెల్ కొరియర్ సర్వీసెస్ కౌంటర్‌కు చేరి డెలవరీ తీసుకోని వినియోగదారుల వస్తువులను ఈనెల 16, 17 తేదీల్లో వేలం నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జోన్ లాజిస్టిక్ మేనేజర్ బద్రి నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో ఎలక్ట్రిక్ వస్తువులు, ఐరన్, బైక్ అండ్ కార్ విడిభాగాలు, కంప్యూటర్ స్పేర్‌పార్ట్స్, దుస్తులు, ప్లాస్టిక్, బుక్స్, రెగ్జిన్, ఇతర వస్తువులు ఉన్నట్లు వివరించారు. వేలం పాట ఎంజీబీఎస్‌లోని పార్సెల్ గోడౌన్ ఆవరణలో ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 9391778825, 9154298865 నంబర్ల ద్వారా సంప్రదించాలన్నారు.

జేఎన్‌టీయూతో ఎంఓయూపై ఇరాన్ కాన్సులేట్ సభ్యుల చర్చలు



కాన్సులేట్ జనరల్ సభ్యులతో జేఎన్‌టీయూ వీసీ, రిజిస్ట్రార్, డైరెక్టర్ తదితరులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇరాన్‌లోని పురాతన విశ్వవిద్యాలయం ఇస్ఫహాన్ వర్సిటీతో విద్యా సహకార అవకాశాలపై ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ కాన్సులేట్ జనరల్ సభ్యులు జేఎన్‌టీయూ అధికారులతో సోమవారం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులను వారు కలిశారు. అనంతరం వైస్-కాన్సుల్ మొహ్సేన్ మొఘద్దామి, కాన్సులేట్ పీఆర్‌వో ఫాతిమా నఖ్వీ తదితరులు మాట్లాడుతూ రెండు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు, ఆచార్యుల మార్పిడి, ఉమ్మడి పరిశోధనకు ఉన్న అవకాశాలపై అవగాహనకు వచ్చినట్లు తెలిపారు. త్వరలోనే జేఎన్‌టీయూతో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకునేందుకు తాము ఎదురుచూస్తున్నట్లు కాన్సులేట్ సభ్యులు తెలిపారు. కాన్సులేట్ అధికారులతో జరిగిన సమావేశంలో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, అకడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కామాక్షి ప్రసాద్ పాల్గొన్నారు.

తార్నాకలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఐసీటీ డైరెక్టర్ డా. శ్రీనివాస్ రెడ్డి, పలువురు శాస్త్రవేత్తలు

తార్నాక, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి): తార్నాకలోని సీఎస్ఐఆర్-ఐఐసీటీలో 'సస్టైనబుల్ ఆర్గానిక్ సింథెసిస్ బయాలజీ 2025' పేరిట రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఐఐసీటీ డైరెక్టర్ డా.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన ఈ సదస్సుకు అమెరికా, జర్మనీ, సింగపూర్, ఫ్రాన్స్ దేశాల శాస్త్రవేత్తలతో పాటు, పారిశ్రామికవేత్త భీమారావు, ఆర్గానిక్ కెమిస్ట్రీ శాస్త్రవేత్త ప్రొ. చంద్రశేఖరన్ తదితరులు సదస్సునుద్దేశించి ప్రసంగించారు. పర్యావరణ అనుకూల సాంకేతిక పరిజ్ఞానంపై వినూత్న వ్యూహాలను రూపొందించడానికి ఈ సదస్సు ఎంతగానో దోహదపడుతుందన్నారు. స్థిరత్వ సూత్రాలకు అనుగుణంగా కొత్త అణువులు, పదార్థాలు, ఔషధాల ఆవిష్కరణకు సదస్సు కీలకంగా మారనుందని ఐఐసీటీ శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. సదస్సులో ప్రొ.గణేష్‌పాండే, డా. జేఎస్ యాదవ్, సదస్సు కన్వీనర్ డా.చాడ రాజిరెడ్డి, పీఆర్‌ఓ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ విద్యార్థులకు 'ఎంటర్‌ప్రెన్యూర్ షిప్'పై అవగాహన



ఈడీసీ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జేఎన్‌టీయూ, సీఐటీడీ అధికారులు, విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ), జేఎన్‌టీయూ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ (ఈడీసీ) సంయుక్తంగా చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థులలో సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఉపకరిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి అన్నారు. అవగాహన కార్యక్రమంలో ఈఎస్‌టీడీ డిజైన్ ఇంజనీర్ కస్తూరి, సీఐటీడీ సీనియర్ కన్సల్టెంట్ శ్రీధర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి మాధవీకుమారి, ఈడీసీ సమన్వయకర్త నాగుజాత, 100 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీవో నం.9ని ఆమోదించకపోతే

గవర్నర్ రాజీనామా చేయాలి

- 23న చలో రాజ్‌భవన్
- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

బర్కత్‌పుర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లకోసం జారీ చేసిన జీవో నం.9ని గవర్నర్ తక్షణమే ఆమోదించాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. జీవో నం.9ని ఆమోదించకపోతే గవర్నర్ తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడంపై కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర గవర్నర్ వైఖరిని నిరసిస్తూ ఈనెల 23న చలో రాజ్‌భవన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీలు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ నిరసన తెలపాలని కోరారు. రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వహించాల్సిన గవర్నర్ అందుకు విరుద్ధంగా పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఈవీ గౌడ్, జి.రవీందర్, దేవర శివ, ధర్మేంద్రసాగర్, జితేందర్, మల్లేష్, రమేష్, యశ్వంత్‌గౌడ్, నరేందర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

3 కోట్లకు పైగా జంటలకు సంతాన సమస్యలు

ఫెర్టిలిటీపై మరిన్ని పరిశోధనలు అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాయ్ హోంబర్గ్, వినేష్ గాడియా, డాక్టర్ జ్యోతి తదితరులు

కవాడిగూడ , అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలో దాదాపు మూడుకోట్లకు పైగా జంటలు సంతానలేమి సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను అధిగమించాలంటే ఫెర్టిలిటీపై మరిన్ని పరిశోధనలు అవసరమని ఫెర్టీ 9 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ వినేష్ గాడియా పేర్కొన్నారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఓ హోటల్‌లో ఫెర్టి 9 ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఫెర్టిజ్ఞాన్ 2025 పేరిట అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన గైనకాలజిస్టులు, ఎంబ్రియాలజిస్టులు, ఫెర్టిలిటీ నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు సమకాలీన వైద్య ధోరణులు.. సాంకేతికతలు తీసుకోవాల్సిన విధి విధానాలపై చర్చించారు. అనంతరం వినేష్ గాడియా మాట్లాడుతూ దేశంలో ఫెర్టిలిటీ సేవలకు డిమాండ్ వేగంగా పెరుగుతున్నప్పటికీ.. పరిశోధనలు మాత్రం పరిమితంగానే ఉన్నాయని అన్నారు. ఫెర్టి 9 ఫెర్టిలిటి సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ సంతానలేమికి ఆలస్య వివాహాలు. జన్యుకారణాలు, ఆహారపు అలవాట్లు, పొల్యూషన్, పంటలకు ఉపయోగించే క్రిమిసంహారక మందులు కారణమవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఇంగ్లండ్‌కు చెందిన రీ ప్రొడెక్టివ్ నిపుణులు రాయ్‌హోంబర్గ్, జేవియర్ ఎరిరో, వివిధ దేశాలకు చెందిన గైనకాలజిస్టులు, ఫెర్టిలిటి ఎక్స్‌పర్ట్‌లు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులపై కేర్‌టేకర్ దాడి

8 తులాల బంగారు నగలతో పరార్



వృద్ధ దంపతులపై దాడిచేసి చోరీ చేసిన అపార్ట్‌మెంట్

కవాడిగూడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉంటున్న వృద్ధ దంపతులపై ఓ కేర్‌టేకర్ దాడిచేసి వారిపై ఉన్న 8తులాల బంగారు నగలను అపహరించుకొని పారిపోయాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి కుటుంబసభ్యులు, స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హిమాయత్‌నగర్ స్ట్రీట్ నంబర్ 6లోని హెరిటేజ్ అపార్ట్‌మెంట్‌లో ఆనందరావు(86), అనసూయ(83) దంపతులు మూడో అంతస్తులో ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉండగా.. ఒక కుమార్తె ఓయూ సమీపంలోని డీడీ కాలనీలో, మరొకరు వేరే ప్రాంతంలో ఉంటున్నారు. వృద్ధ దంపతుల ఆలనా పాలనా చూసేందుకు కుటుంబసభ్యులు ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా కేర్ టేకర్‌ను నియమించారు. ఎనిమిది నెలలుగా గుంటూరుకు చెందిన గోవర్ధన్ కేర్‌టేకర్ వారి ఆలనా పాలనా చూస్తున్నాడు. అయితే, ఆదివారం ఓ శుభకార్యానికి కుమార్తెలు వెళుతున్నారని, అపార్ట్‌మెంట్‌కు రారనే విషయం తెలుసుకున్న కేర్‌టేకర్ గోవర్ధన్ ముందుగా వేసుకున్న పథకం ప్రకారం వృద్ధ దంపతులపై దాడి చేశారు.

అనసూయ ఒంటిపై ఉన్న బంగారు గాజులు, మెడలోని పుస్తెలతాడు, చెవికమ్మలు బంగారు గొలుసులు బలవంతంగా తీసుకున్నాడు. ఈ సమయంలో ఆమె చేతులకు, తలకు, మెడకు తీవ్రగాయాలయ్యాయి. ఈ క్రమంలో ప్రతిఘటించే ప్రయత్నం చేసిన ఆమె భర్త ఆనందరావుపై కూడా గోవర్ధన్ దాడిచేసి గాయపరిచాడు. ఆ తర్వాత అతను రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటి బయటనుంచి గడియపెట్టి వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలకు గురైన దంపతులు అపస్మారకస స్థితిలోకి వెళ్లిపోయారు. మరుసటి రోజు పనిమనిషి ఇంటి గడియతీసి లోనికి వెళ్లగా ఇళ్లంతా రక్తంతో పాటు గాయాలతో పడి ఉన్న దంపతులు కనిపించారు. వెంటనే డీడీ కాలనీలోని వారి అల్లుడు శ్రీధర్‌రావుకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు.

అతను దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌లతో వచ్చిన పోలీసులు ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. రాత్రి 8.30 గంటల ప్రాంతంలో బ్యాగుతో బయటకు వెళుతున్న కేర్‌టేకర్ కదలికలు సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో అనుమానిస్తూ ఆ దిశగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు రెండు బృందాలను విజయవాడ, గుంటూరుకు పంపినట్లు పోలీసులు తెలిపారు. వృద్ధులు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు శ్రీధర్‌రావు తెలిపారు.

పెద్ద అంబర్‌పేటలో దొంగల బీభత్సం

- రెండిళ్లలో దోపిడీకి
- కిలోన్నర వెండి, 35 గ్రాముల బంగారం, నగదు చోరీ



సీసీ కెమెరాలో నమోదైన దొంగ కదలిక దృశ్యాలు

హయత్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ పరిధిలోని పెద్ద అంబర్‌పేటలో ఆదివారం రాత్రి దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. ఇంటి ప్రధాన ద్వారానికి వేసిన సెంట్రల్ లాక్‌ను పగలగొట్టి రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఒక ఇంట్లో కిలోన్నర వెండి, 35 తులాల బంగారం, మరో ఇంట్లో నగదును దోచుకెళ్లారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. దొంగల కోసం గాలిస్తున్నారు. హయత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శేషానగర్‌కు చెందిన గూడురు రాజేందర్ (రిటైర్డ్ లెక్చరర్) పెద్దఅంబర్‌పేట్ సదాశివలో విల్లా నంబర్ 241, 242ను కొనుగోలు చేశారు. కొన్ని రోజులు అక్కడే ఉన్న ఆయన ఆరోగ్యం బాగా లేక విల్లాకు తాళం వేసి సొంత గ్రామానికి వెళ్లాడు. ప్రతి రోజూ విల్లాను శుభ్రం చేయడానికి ఒక పని మనిషిని ఏర్పాటు చేశాడు. సోమవారం ఉదయం పనిమనిషి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఆమె వెంటనే ఇంటి యజమానికి సమాచారం అందించింది. తలుపు సెంట్రల్ లాక్‌ను ధ్వంసం చేసి బీరువాలో ఉన్న కిలోన్నర వెండిని, 35 తులాల బంగారాన్ని అపహరించుకు పోయినట్లు గుర్తించిన యజమాని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ ఇంటి పక్కనే బొడ్డు కృష్ణారెడ్డికి చెందిన విల్లా నంబర్ 246 ఉంది. కృష్ణారెడ్డి గత నెల 22న తన ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి అమెరికా వెళ్లాడు. దుండగులు కృష్ణారెడ్డి విల్లా తాళాలు ధ్వంసం చేసి అందులో ఉన్న నగలు, నగదును అపహరించుకుపోయారు. కృష్ణారెడ్డి ఇంట్లో నుంచి ఎంత సొమ్ము పోయిందనే విషయం ఆయన వస్తే తప్ప తెలిసే అవకాశం లేదు. ముగ్గురు దుండగులు ఇంట్లో చోరీకి పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. మొత్తం 48 వినతులు రాగా, వీటిల్లో రెవెన్యూ శాఖకు 15, ఇతర శాఖలకు సంబంధించినవి 33 వచ్చాయి.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తనీయొద్దన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లకు స్టేజీల వారీగా లబ్ధిదారులకు డబ్బులు అందేలా చూడాలన్నారు. గ్రామ, మున్సిపలిటీల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని అన్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించాలన్నారు. వంద శాతం పల్స్ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పాల్గొన్నారు.

ఆలియా పాఠశాల హెచ్‌ఎంకు సన్మానం

- 6వ తరగతి విద్యార్థులకు పాదుపు పాఠాలు
- క్రెడిట్ కార్డు, రుణాలు, ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన



హెచ్‌ఎం విశ్వనాథ గుప్తాను సన్మానిస్తున్న నవీన్ నికోలస్

హైదరాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఆలియా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.విశ్వనాథ గుప్తాను పాఠశాల విద్యా శాఖ సంచాలకులు నవీన్ నికోలస్ సోమవారం తన కార్యాలయంలో సన్మానించారు. క్రెడిట్‌కార్డు, డెబిట్ కార్డు వినియోగం, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, రుణాలు పొందడం.. లాంటి ఆర్థిక క్రమశిక్షణ గురించి పాఠశాలలో చదివే 6వ తరగతి విద్యార్థులకు సైతం పూర్తి అవగాహన కల్పించేలా ఆయన ప్రత్యేక చొరవ తీసుకున్నందుకు అభినందించారు. పుస్తకాల్లోని పాఠాలకే పరిమితం కాకుండా ప్రతి విద్యార్థికి ఎంతో కీలకమైన ఆర్థిక క్రమశిక్షణ గురించి అవగాహన కల్పించడం అభినందనీయమని, ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని నవీన్ నికోలస్ కొనియాడారు.

గరికపూల చెలిమ కవి యాకూబ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి

రవీంద్రభారతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గరికపూల చెలిమ కవియాకూబ్ అని ప్రముఖ వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అభివర్ణించారు. మనుషుల గురించి, మానవత్వం గురించి ఆలోచించే కవిత్వం రాస్తున్న గొప్ప తాత్వికకవి అని కొనియాడారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో కవి యాకూబ్ సృజన సమాలోచన సదస్సు జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన ఈ సదస్సులో పలువురు వక్తలు ప్రసంగించారు. ప్రారంభ సభలో ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ సి.కాశీం మాట్లాడుతూ విమర్శకుడైన కవే అసలైన కవిత్వాన్ని సృజిస్తాడని, అలాంటి కవే యాకుబ్ అని అన్నారు. ఈ సదస్సు కన్వీనర్ డా.చంద్రయ్య శివన్న మాట్లాడూతూ రామల్లు రామచంద్రారెడ్డి మీద పరిశోధన చేసిన సాహసి యాకుబ్ అని కొనియాడారు. గౌరవ అతిథిగా హాజరైన భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ యాకూబ్ కవి సంగమం ద్వారా కొన్నివేల మంది యువ కవులని తయారు చేశారని కొనియాడారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి, విశిష్ట అతిథులు డా.సంగిశెట్టి శ్రీనివాస్, ప్రసేన్, సీతారాం, లక్ష్మీనర్సయ్య, జూపాక సుభద్ర, స్కైబాబా పాల్గొని యాకుబ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా యాకుబ్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. ముగింపు సభకు ముఖ్య అతిథిగా ఎంపీ మల్లురవితో కలిసి గోరటి వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవి యాకుబ్ చేసిన సాహిత్య సేవలను అభివర్ణించారు.

బీసీ రిజర్వేషన్ల సాధన జేఏసీ వైస్ చైర్మన్‌గా నారగోని



బర్కత్‌పుర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీల 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఏర్పాటైన బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) వైస్‌చైర్మన్‌గా పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీ.జీ.ఆర్.నారగోని నూతనంగా నియమితులయ్యారు. ఈ కమిటీకి ఎంపీ ఆర్.కృష్ణయ్య చైర్మన్‌గా నియమితులైన విషయం విదితమే. ఈ సందర్భంగా నారగోని మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టేకు నిరసనగా ఈ నెల 18న నిర్వహిస్తున్న తెలంగాణ బంద్‌లో అన్ని బీసీ కులాలు, సంఘాలు, రాజకీయ పార్టీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భార్యా భర్తల మధ్య మనస్పర్థలు

- భార్య ఆత్మహత్య..

వనస్థలిపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థలతో మనస్తాపం చెందిన గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఎన్‌రెడ్డి నగర్ సాగర్ కాంప్లెక్స్ రోడ్డు నం.1లో గుదిమల్వార్ మనీష్, రాజేశ్వరి దంపతులు కొంతకాలం క్రితం ప్రేమ పెళ్లి చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కాగా వీరి ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తి తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాజేశ్వరి(25) చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మనీష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డాక్టర్ పాలుకూరి లక్ష్మీకి దేవీ అవార్డు



దేవీ అవార్డును అందుకుంటున్న డాక్టర్ పాలుకూరి లక్ష్మీ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో ప్లాస్టిక్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ పాలుకూరి లక్ష్మీకి ప్రతిష్టాత్మక దేవీ అవార్డు దక్కింది. అదానీ సంస్థతో కలిసి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపు నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌హెచ్ఆర్‌సీ చైర్‌పర్సన్, మాజీ సుప్రీం కోర్టు జడ్జీ వి. సుబ్రమణియన్ ఈ అవార్డును డాక్టర్ లక్ష్మీకి అందజేశారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న పదిమంది మహిళలను సీనియర్ జర్నలిస్టుల బృందం ఎంపిక చేసింది. వైద్యవృత్తిలో ఉస్మానియా ఆస్పత్రిలోనే మొట్టమొదటి మహిళా ప్లాస్టిక్ సర్జన్‌గా విశిష్టమైన సేవలను అందిస్తోన్న డాక్టర్ పాలుకూరి లక్ష్మీని ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

పది తులాల బంగారం చోరీ

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం టౌన్ బోయవాడ రోడ్డులో ఆదివారం రాత్రి తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి పది తులాల బంగారు ఆభరణాలు, నగదును దోచుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం టౌన్ బోయవాడ రోడ్డులో నివాసముంటున్న ఎలమోని రవీందర్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నేరేడ్‌మెట్‌లో సోదరి ఇంటికి వెళ్లారు. సోమవారం సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అల్మారాలో ఉన్న పది తులాల బంగారు ఆభరణాలు, ఉన్న కొంత నగదును దుండగులు దోచుకెళ్లారు. క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

ఆదిభట్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపల్ రాందాస్‌పల్లికి చెందిన కంతి కిషన్ గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాందాస్‌పల్లికి చెందిన కిషన్ ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కిషన్‌కు సోమవారం గుండెపోటు రావడంతో మృతి చెందాడు. స్థానికులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డికి తెలపడంతో ఆయన కిషన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి సానుభూతి తెలిపారు.

ఆంధ్రజ్యోతి
9
నవ్య
డాక్టర్
మంగళవారం • 14 అక్టోబరు 2025



ప్రొక్టాలజీ

కొన్ని అలవాట్లు గుప్త ప్రదేశాల్లో పలు రకాల ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులకు కారణమవుతూ ఉంటాయి. కటి దిగువ ప్రదేశంలో తలెత్తే అలాంటి కొన్ని సమస్యలు, నివారణోపాయాల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

గుప్త ప్రదేశంలో గూఢ సమస్యలు

అందంగా కనిపించాలనే తాపత్రయంతో ఒంటిని అసౌకర్యానికి గురి చేసే బిగుతైన దుస్తులు, లోదుస్తులూ ధరించే అలవాటు కొందర్లో ఉంటుంది. అలాగే ఇంకొందరు బాహ్య సౌందర్యానికి ప్రాధాన్యమిస్తారే తప్ప, దుస్తుల వెనక దాగి ఉండే శారీరక శుభ్రత పట్ల ఈశ్రద్ధ వహిస్తూ ఉంటారు. ఇలాంటి అలవాట్లు, అశ్రద్ధలు అంతిమంగా ఆసన ఆరోగ్యాన్ని దెబ్బతీసే వ్యాధులకూ, ఇన్‌ఫెక్షన్లకూ దారి తీస్తూ ఉంటాయి.

అసలు సమస్య అలవాట్లతోనే...

ఆసనం... గాలి చొరబడే వీల్లేని గుప్త ప్రదేశం. అలాంటి ప్రదేశంలో సహజంగానే ఇన్‌ఫెక్షన్లు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పైగా బిగుతైన దుస్తులు, లోదుస్తులు ధరించడం, చమట, అపరిశుభ్రత, అపరిశుభ్ర లోదుస్తులు.... ఇలా పలు కారణాల వల్ల ఆ ప్రాంతంలో రెట్టింపు సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. వాటిని విపులంగా చర్చించుకుంటే..

- బిగుతైన జీన్స్ వేసుకునేవాళ్లు, అవే దుస్తుల్లో ఎక్కువ గంటలు పని చేసేవాళ్లలో ఆసన ప్రాంతంలో చమట పడుతూ ఉంటుంది. ఈ ప్రదేశాన్ని పొడిగా ఉంచుకోలేకపోవడం వల్ల ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు వేధించే ప్రమాదం ఉంటుంది
- అవాంఛిత రోమాలు ఒక్కొకరిలో ఒక్కోలా ఉంటాయి. కొందర్లో త్వరగా, దట్టంగా పెరుగుతాయి. వీటికి చమట తోడై ఇన్‌ఫెక్షన్లు పెరుగుతాయి.
- కొందర్లో ఆసనం దగ్గర కూడా దట్టమైన వెంట్రుకలుంటాయి. ఇలాంటి వారికి కూడా అసౌకర్యాలు తప్పవు
- లోదుస్తుల పరిశుభ్రత లోపించినా ఇన్‌ఫెక్షన్లు వేధిస్తాయి
- కొందరు బిగుతైన దుస్తుల్లోనే నిద్రకు ఉపక్రమిస్తూ ఉంటారు. ఇది కూడా సరి కాదు

ఆసనంలో తలెత్తే సమస్యలు ఇవే!

ఫాలిక్యులైటిస్: అవాంఛిత రోమాల మూలంగా చమట పట్టి, 'ఫాలిక్యులైటిస్' అనే సమస్య తలెత్తుతుంది. ఇది కాలక్రమేణా అల్సర్‌గా మారి చీము పడుతుంది

అజీర్తి: బిగుతైన జీన్స్‌తోనే నిద్రకు ఉపక్రమిస్తూ ఉండడం వల్ల, ఆ ఒత్తిడికి పొట్ట ఒత్తుకుపోయి, జీర్ణప్రక్రియ కూడా మందగిస్తూ ఉంటుంది

మలబద్ధకం: సాధారణంగా ఉదయం నిద్ర లేవగానే యానల్ కెనాల్ రిల్యాక్స్ అవుతుంది. కానీ రాత్రంతా బిగుతైన దుస్తుల్లో నిద్రపోవడం వల్ల ఆసనం రిల్యాక్స్ అవలేక, ఉదయం మలవిసర్జన జరగదు. దాంతో ఆఫీసుకు వెళ్లే



హడావుడిలో కాలకృత్యాలను వాయిదా వేసి, ఆ తర్వాత మలబద్ధకంతో బాధపడుతూ ఉంటారు. ఈ సమస్య అంతిమంగా మొలలు, ఫిషర్లకు దారి తీస్తుంది.

ఫిస్టులా: ఫిషర్లను నిర్లక్ష్యం చేయడం వల్ల అంతిమంగా పెరినియల్ యాబ్సెస్‌కు దారి తీస్తూ ఉంటుంది

ప్రొరైటస్ యానై: మలద్వారం చుట్టూరా దురద ఉంటుంది. దీనికి ఫిస్టులాలు, చమట, బిగుతైన లోదుస్తులు ప్రధాన కారణాలు

పిరుదుల మధ్య: బిగుతైన, గాలిచొరబడని, సింథటిక్ లోదుస్తుల వల్ల పిరుదుల మధ్య ఇన్‌ఫెక్షన్లు తలెత్తుతాయి

మలబద్ధకంతో...

మలబద్ధకం తలెత్తినప్పుడు, మలవిసర్జన సమయంలో ఒత్తిడిని ఉపయోగించడం మూలంగా మలద్వారం దగ్గర చీలిక ఏర్పడి ఫిషర్ ఏర్పడుతుంది. కోత ఏర్పనప్పుడు ఆ ప్రదేశంలోని చర్మం ముడుచుకుపోయి అతుక్కుపోతుంది. అలా ఆసనం దగ్గర పదే పదే ఫిషర్స్ ఏర్పడి, చర్మం అతుక్కుపోతూ ఉండడం వల్ల మలద్వారం బిగుతుగా మారిపోతుంది. దాంతో మలవిసర్జన సమయంలో మరింత ఒత్తిడిని ఉపయోగించవలసి వస్తుంది. ఫలితంగా మలద్వారం లోపల ఉండవలసిన పైల్స్ బయటకు జారతాయి. దీంతో మలద్వారం కుంచించుకుపోయి సమస్య మరింత జటిలమై, రక్తనాళాలు చిట్లి రక్తస్రావం, నొప్పి వేధిస్తాయి. దాంతో నొప్పిని తట్టుకోలేక మలవిసర్జనను పదే పదే వాయిదా వేస్తూ ఉంటారు. ఈ క్రమంలో ఫిషర్‌లో మలం నిల్వ ఉండిపోయి, అది పక్కకు ప్రయాణించి ఫిస్టులా ఏర్పడుతుంది. అలా వేరు మలద్వారం లోపల ఉండిపోయి, దాని కొమ్ములు ఆసనం చుట్టూరా ఏర్పడతాయి. వీటి నుంచి చీము స్రవిస్తూ ఉంటుంది. అయితే చాలా మంది వీటిని గమనించి, ఇది మలద్వారం దగ్గర కాకుండా పక్కన ఉంది కాబట్టి దీనికి మలద్వారంతో సంబంధం లేదనుకుని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు.

> **బిగుతైన బ్రాసరీలతో...**
>
> **బిగుతైన బ్రాసరీలు, వైరుతో కూడిన బ్రాసరీలతో రొమ్ముల దిగువన చర్మం ఒరుసుకుపోయి, అల్సర్లు, మొటిమలు ఏర్పడతాయి. అలాగే అక్కడ పేరుకునే చమట వల్ల సెబేషియస్ సిస్టులు తలెత్తుతాయి. రొమ్ములు గట్టిగా మారిపోతాయి లేదా రొమ్ముల్లో గడ్డలు ఏర్పడతాయి. ఇలా జరగకుండా ఉండాలంటే సరైన కొలతలతో కూడిన కాటన్ బ్రాసరీలను ఎంచుకోవాలి.**

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

అంతర్గతంగా ఆరోగ్యంగా లేనప్పుడు ఆ అసౌకర్యం, బాధ ముఖంలో ప్రతిఫలిస్తూ ఉంటాయి. కాబట్టి ముఖాన్ని ఎంత ఆకర్షణీయంగా, పరిశుభ్రంగా ఉంచుకుంటామో, ఆసన ప్రాంతాన్ని కూడా అంతే ఆరోగ్యంగా, పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అందుకోసం ఈ జాగ్రత్తలు పాటించాలి

- బిగుతైన జీన్స్ వాడకాన్ని పరిమితం చేయాలి. రాత్రుళ్లు అవే దుస్తుల్లో నిద్రకు ఉపక్రమించకూడదు
- రాత్రివేళ గాలి ధారాళంగా వీచే దుస్తులు వేసుకోవాలి. రాత్రుళ్లు లోదుస్తులు ధరించకపోయినా పరవాలేదు
- ముందు వైపు, ఆసనం చుట్టూరా ఉండే అవాంఛిత రోమాలను తొలగించుకోవాలి
- బిగుతైన లోదుస్తులకు స్వస్థి చెప్పాలి
- సింథటిక్ బదులుగా చమటను పీల్చుకునే కాటన్ లోదుస్తులు ఎంచుకోవాలి
- అండర్‌వేర్ పిరుదులకు సపోర్ట్ ఇచ్చేలా ఉండాలే తప్ప, బిగుతుగా ఉండకూడదు
- ఇన్‌ఫెక్షన్లు దరి చేరకుండా యాంటీ ఫంగల్ పౌడర్లు వాడుకోవచ్చు
- నెలసరి సమయంలో ఉపయోగించే ప్యాడ్స్ తరచూ మారుస్తూ ఉండాలి
- నాణ్యమైన, మన్నికైన శానిటరీ ప్యాడ్స్ వాడుకోవాలి
- పొద్దున, రాత్రి రెండుసార్లు తప్పనిసరిగా స్నానం చేయాలి
- ఎదిగే వయసులో ఉన్న టీనేజర్ల లోదుస్తుల సైజుల పట్ల తల్లి ఓ కన్నేసి ఉంచి, తదనుగుణంగా మారుస్తూ ఉండాలి
- బ్రాసరీలు, ప్యాంటీలు సాగిపోయి, వేలాడే పరిస్థితి తలెత్తేవరకూ వాటిని మార్చకుండా ఉండకూడదు
- నెలసరి తొలి రెండు రోజులూ శానిటరీ న్యాప్కిన్స్ రెండు నాలుగు గంటలకోసారి మార్చుకుంటూ, తర్వాత నుంచి ఉదయం, సాయంత్రం మార్చుకుంటూ ఉండాలి
- వ్యాయామంలో భాగంగా బరువులు ఎత్తేటప్పుడు, మలద్వారం మీద ఒత్తిడి పడుతుంది. కాబట్టి పిరుదులకు చక్కని సపోర్ట్ ఇచ్చే లోదుస్తులు వేసుకోవాలి

డాక్టర్ శాంతి వర్ధని
సీనియర్ ప్రొక్టాలజిస్ట్,
లాప్రోస్కోపిక్ అండ్ కొలొరెక్టల్ సర్జన్,
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్



కొత్త వైద్యం

ప్రయాణంతో ఆరోగ్యం

ఆరోగ్యం కోసం ప్రయాణాన్ని సూచించే మొట్టమొదటి దేశంగా తాజాగా స్వీడన్ పేరు పొందింది. ది స్వీడిష్ ప్రిస్క్రిప్షన్ అనే కొత్త ప్రయత్నంలో భాగంగా, దేశ పర్యాటక సంస్థ, కరోలిన్‌స్కా సంస్థకు చెందిన పరిశోధకులు ఉమ్మడిగా, ప్రకృతి, సంస్కృ



తులకు ఔషధాలుగా ప్రచారం కల్పిస్తున్నారు. అడవిలో నడక, సానా, చల్లనీళ్లలో మునక, ఫీకా బ్రేక్స్, ఆకాశంలో నక్షత్రాలను వీక్షించడం లాంటి పనుల వల్ల ఒత్తిడి తగ్గి, ఆరోగ్యం మెరుగుపడుతుందని వాళ్లు సూచిస్తున్నారు. రోగులు ఈ ప్రకృతి చికిత్సలను నిరాటంకంగా పొందడానికి వీలుగా వైద్యుల ప్రిస్క్రిప్షన్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నారు. అయితే ప్రయాణ ఖర్చులు తమ పరిధిలోకి రావనీ, చికిత్స పైనుంచి నివారణ, సమగ్రమైన ఆరోగ్యాల వైపు దృష్టిని మళ్లించడమే తమ లక్ష్యమనీ వైద్యులు ప్రిస్క్రిప్షన్‌లో స్పష్టం చేస్తున్నారు.

ఆరోగ్యం - ఆహారం

యాపిల్స్‌ను ఉడికించి తింటే?

యాపిల్ జ్యూస్ తాగుతాం. ముక్కలు చేసుకుని తింటాం. అయితే వీటిని ఉడికించి తినడం వల్ల మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను పొందే వీలుంది.

- యాపిల్స్‌ను ఉడికించినప్పుడు వాటిలో పెరిగే పెక్టిన్ పేగుల్లోని ప్రయోజనకరమైన బ్యాక్టీరియాకు ఆహారంగా మారుతుంది. దాంతో పేగుల్లోని వాతావరణం మెరుగుపడుతుంది
- నీటిలో కరిగే పీచు పేగుల ఆరోగ్యాన్ని క్రమబద్ధీకరించి, ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా సంఖ్యను పెంచుతుంది
- యాపిల్స్‌ను ఉడికించడం వల్ల అవి సులభంగా జీర్ణమవుతాయి. దాంతో అజీర్తి తలెత్తదు
- వీటిలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. ఫలితంగా పేగుల్లోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది



ఇలా వండుకోవాలి: రెండు యాపిల్స్‌ను శుభ్రంగా కడిగి, తొక్కు తొలగించాలి. ముక్కలుగా కోసి, విత్తనాలు తొలగించాలి. ఆ తర్వాత బాండీలో అర కప్పు నీళ్లు పోసి, యాపిల్ ముక్కలు జోడించి, అర టీస్పూను దాల్చినచెక్క పొడి, అర చెక్క నిమ్మరసం పిండి, చిన్న మంట మీద ఏడు నిమిషాలు ఉడికించాలి. ముక్కలు మెత్తబడే కలుపుతూ ఉడికించిన తర్వాత, ఈ పదార్థాన్ని అలాగే తినొచ్చు లేదా పెరుగు జోడించి తినొచ్చు.

ఈ మందులతో కాలేయ రక్ష

బరువు తగ్గించే మందులతో కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుందనే ఒక తాజా అధ్యయనం, వరల్డ్ జర్నల్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీలో ప్రచురితమైంది. మరిన్ని వివరాలు...

కాలేయ జబ్బు మూలంగా మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ సమస్యను ఎదుర్కొంటున్న రోగులకు, స్థూలకాయం, మధుమేహం కోసం అభివృద్ధి చేసిన మందులు కాలేయానికి ప్రయోజనాలను అందిస్తున్నట్టు, 'ఎఫికసీ అండ్ సేఫ్టీ ఆఫ్ యాంటి ఒబేసిటీ డ్రగ్స్ ఇన్ మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ అసోసియేటెడ్ స్టెటోయిక్ లివర్ డిసీజ్ అనే పేరుతో చేపట్టిన ఒక తాజా అధ్యయనంలో వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా 30 శాతం మంది ప్రజలు, మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ ఫలితంగా కాలేయంలో కొవ్వు పేరుకుపోయే సమస్యను ఎదుర్కొంటున్నారు. మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ అసోసియేటెడ్ స్టెటోహెపటైటిస్, మ్యాష్ సమస్యతో బాధపడే రోగుల్లో కాలేయ కణాలు దెబ్బతిని, అంతిమంగా కాలేయం, ఫైబ్రోసిస్, సిర్రోసిస్‌కు



దారి తీస్తూ ఉంటుంది. అయితే సంప్రదాయ చికిత్సలో భాగంగా జీవనశైలి మార్పులు, ఆహారం, వ్యాయామాల ద్వారా బరువు తగ్గించుకోవడం లాంటి నియమాలను వైద్యులు సూచిస్తూ ఉంటారు. వీటితో ఫలితం కనిపించని సందర్భాల్లో అంతిమంగా సర్జరీని ఆశ్రయిస్తూ ఉంటారు. అయితే మ్యాష్ సమస్యతో బాధపడుతున్న రోగులకు టిర్‌జెపటైడ్ లాంటి బరువు తగ్గించే మందులను 48 వారాల పాటు సూచించినప్పుడు. ఆ రోగులు బరువు తగ్గడంతో పాటు వారి కాలేయ ఆరోగ్యం కూడా మెరుగుపడుతున్న స్పష్టమైంది. అలాగే సెమాగ్లూటైడ్‌తో కాలేయంలో కొవ్వు పేరుకునే తీవ్రత తగ్గడంతో పాటు శరీరం ఇన్సులిన్‌ను ఉపయోగించుకునే తీరు మెరుగుపడి, కాలేయ వాపు, నొప్పి అదుపులో కొచ్చాయి. ఈ మందులతో కాలేయ ఫైబ్రోసిస్ కూడా తగ్గుముఖం పడుతున్నట్టు ప్రయోగాల్లో తేలింది కాబట్టి బరువును తగ్గించే మందులు కాలేయ ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయని పరిశోధకులు అంటున్నారు.

భారతీయులు పిండిపదార్థాల ప్రియులు. మనకు అన్నం లేదా రోటీ లేనిదే ఆకలి తీరదు. ఇలాంటి అధిక పిండిపదార్థాల ఆహార శైలి వల్లే ఊబకాయం, మధుమేహ సమస్యలు పెరుగుతున్నాయని తాజా ఐసిఎమ్‌ఆర్ (ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) అధ్యయనం హెచ్చరిస్తోంది. మరిన్ని వివరాలు...



అధ్యయనం

అధిక పిండిపదార్థాలే శత్రువులు

పిండిపదార్థాలు కచ్చితంగా శక్తి భాండాగారాలే! అయితే భారతీయుల ఆహారంలో రోజువారీ 62% క్యాలరీలు పిండిపదార్థాల నుంచే అందుతున్నాయి. మరీ ముఖ్యంగా తెల్ల అన్నం, అదనపు చక్కెరల నుంచే ఈ పిండిపదార్థాలు సమకూరుతూ ఉండడం మరింత ఆందోళనకరమైన విషయం. దక్షిణ భారత దేశంలో తెల్ల అన్నం ప్రధాన పిండిపదార్థ వనరు అయితే, తూర్పు, ఈశాన్య భారతదేశంలో గోధుమలు ప్రధాన పిండిపదార్థ వనరుగా ఉపయోగపడుతున్నాయి. దేశంలోని 21 రాష్ట్రాలు, సూచించిన చక్కెర మోతాదులను మించిపోయాయి. పిండిపదార్థాలతో ఊబకాయం, మధుమేహ ముప్పు పొంచి ఉంది కాబట్టి మన కంచాల్లో నుంచి అన్నం, రోటీలను పూర్తిగా తొలగించుకోవాలా? అంటే, అవసరం లేదు. వాటి పరిమాణాన్ని 5% తగ్గించుకుంటే సరిపోతుందని అంటున్నారు సీనియర్ డయాబెటాలజిస్ట్, అధ్యయనం తొలి రచయిత్రి, డాక్టర్ అంజన. ఐదు శాతం పిండిపదార్థాల కోతతో మధుమేహానికీ, ప్రిడయాబెటిస్‌కూ అడ్డుకట్ట వేయొచ్చని అంటున్నారామె. ఉదయం అల్పాహారంలో రెండు ఇడ్లీలు తినే అలవాటున్నవారు, ఒక ఇడ్లీని తొలగించి, దాని స్థానాన్ని సాంబారుతో భర్తీ చేసుకోవచ్చు. ఒక పూరీ స్థానాన్ని ఒక కప్పు పప్పుతో, రాజ్మాతో భర్తీ చేసుకోవచ్చు. అలాగే కప్పు పెరుగు, గుడ్డుతో బ్రేక్‌ఫాస్ట్‌ను పరిపూర్ణం చేసుకోవచ్చని సూచిస్తున్నారామె.

అన్నం, రోటీ ఒకటే!

సాధారణంగా అన్నం తగ్గించాలనుకునేవారు ఆ లోటును రోటీతో భర్తీ చేస్తూ ఉంటారు. కానీ అన్నం, రోటీ... రెండూ పిండిపదార్థాలే అనే విషయం గుర్తుపెట్టుకోవాలి. ఈ రెండింట్లో గ్లైసెమిక్ ఇండెక్స్ సమానంగా ఉంటుంది. పిండిపదార్థాలు త్వరగా జీర్ణమై, శరీరం వాటిని త్వరగా ప్రాసెస్ చేసుకుంటుంది. దాంతో శరీరంలో చక్కెర మోతాదులు పెరిగి, వెంటవెంటనే ఆకలేస్తుంది. ఇదే క్రమం కొనసాగుతూ, శరీరంలోకి చేరుకునే అదనపు క్యాలరీల వల్ల ఊబకాయం, మధుమేహం తలెత్తుతాయి. కాబట్టి పిండిపదార్థాల మోతాదును తగ్గించుకోవడం ఉత్తమం.

చిరుధాన్యాలు తినొచ్చా?

రాగులు, కొర్రలు, జొన్నలు, సజ్జలు, సామలు... ఇలా అనేక చిరుధాన్యాల పట్ల ఇటీవలి కాలంలో మక్కువ పెరిగింది. అయితే వీటిలో పీచు, మాంసకృత్తులు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం మార్కెట్లో దొరుకుతున్న చిరుధాన్యాలన్నీ పాలిష్ పట్టినవేననే విషయం గుర్తుపెట్టుకోవాలని అంటున్నారు సీనియర్ న్యూట్రిషనిస్ట్ సుధా వాసుదేవన్. వీటిని తినడం వల్ల, శుద్ధి చేసిన బియ్యానికి రెండు రెట్లు ఎక్కువగా చక్కెర మోతాదులు పెరుగుతాయని హెచ్చరిస్తున్నారామె. నిల్వ సామర్థ్యాన్ని పెంచడం కోసం చిరుధాన్యాలను శుద్ధి చేయడం వల్ల పోషకభరితమైన పొరలన్నీ తొలగిపోతున్నాయ(ని అంటున్నారు సుధ. చిరుధాన్యాలు జీర్ణమయ్యే సమయాన్ని పెంచడం కోసం వాటిని కూరగాయలు, చిక్కుళ్లు, పప్పుధాన్యాలతో కలిపి వండుకోవాలని సూచిస్తున్నారామె.

మాంసకృత్తులను పెంచి...

పిండిపదార్థాలను తగ్గించడంతో పాటు మాంసకృత్తులను పెంచడం మీద కూడా దృష్టి పెట్టాలి. మన దేశంలో ఒక రోజుకు తీసుకుంటున్న సగటు మాంసకృత్తులతో అందుతున్న క్యాలరీల సంఖ్య 12 శాతం మాత్రమే! కానీ రోజు మొత్తంలో మన శరీరానికి అందవలసిన మొత్తం క్యాలరీల్లో 50 శాతం క్యాలరీలు మాత్రమే పిండిపదార్థాల నుంచి, 20 నుంచి 30 శాతం క్యాలరీలు కొవ్వుల నుంచి, 20 శాతం క్యాలరీలు మాంసకృత్తుల నుంచి, 3 నుంచి 6 శాతం క్యాలరీలు పీచు నుంచి అందేలా చూసుకోవాలి. నిజానికి మాంసకృత్తులను కలిగిన పదార్థాలన్నీ ఖరీదైనవే! కాబట్టి పిండిపదార్థాల మోతాదు పెరుగుతోంది. అయితే ఇలాంటి పరిస్థితిలో పిండిపదార్థాల ప్రభావాన్ని తగ్గించుకోవడం కోసం 'ఫాస్ట్ కార్బ్స్'ను పరిమితం చేసుకోవాలి. అందుకోసం వైట్ బ్రెడ్, పాలిష్ పట్టిన ధాన్యాలను తగ్గించి, నెమ్మదిగా జీర్ణమయ్యే బీన్స్, చిక్కుళ్లు, నట్స్, పండ్లు తీసుకోవాలి. శాకాహారులు వృక్షాధారిత మాంసకృత్తులు మీద దృష్టి పెట్టాలి. ప్రతి భోజనంలో పులిసిన పాల ఉత్పత్తులకు చోటు కల్పించాలి. మాంసాహారులు రోజులో ఒక్క పూటైనా చేపలు, గుడ్లు తినాలి.

కళోంజి కథే వేరు

కళోంజి, లేదా కాలా జీరా ఆరోగ్యాన్ని అందించే ఒక ప్రత్యేకమైన దినుసుగా పేరు పొందింది. ప్రాచీన ఈజిప్టు సమాధుల్లో, చారిత్రక వైద్య ప్రతుల్లో స్థానం సంపాదించుకున్న ఈ చిన్న విత్తనం ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!



మూత్రపిండాల్లోని రాళ్ల పరిమాణాన్ని తగ్గించడంలో, వాటిని కరిగించడంలో కళోంజి ఎంతో బాగా సహాయపడుతుందని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ విత్తనం ప్రభావాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడం కోసం 2019 ఒక ప్రయోగాన్ని కూడా చేపట్టడం జరిగింది. ఈ ప్రయోగంలో భాగంగా మూత్రపిండాల రాళ్లతో బాధపడుతున్న 60 మంది రోగులకు రోజుకు రెండు సార్లు చొప్పున పది రోజుల పాటు 500 మిల్లీగ్రాముల కళోంజీని అందించినప్పుడు, కళోంజి తీసుకున్న 44 శాతం మందిలో, మూత్రపిండాల్లోని రాళ్లు బయటకు వచ్చేశాయి. 50 శాతం మంది మూత్రపిండాల్లోని రాళ్ల పరిమాణం తగ్గిపోయింది. దీన్ని బట్టి కళోంజి మూత్రపిండాల రోగులకు వరప్రదాయనిగా ఉపయోగపడుతుందని తేలింది. ఈ విత్తనాల్లోని థైమోక్వినోన్ అనే మూలకం యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ప్రభావాలను కలిగి ఉండడంతో పాటు మూత్రపిండాలకు ప్రయోజనాలను అందిస్తుంది. అలాగే మూత్రపిండాల్లోని రాళ్లను కరిగించడంతో పాటు, వ్యాధినిరోధకశక్తిని మెరుగుపరచడం, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడం, రక్తపోటు, మధుమేహాల అదుపుకు తోడ్పడడం, జీర్ణశక్తిని మెరుగుపరచడం మొదలైన ప్రయోజనాలను కూడా అందిస్తుంది.

వీటితో గుండెజబ్బులు దూరం

గ్రీన్ టీ, దానిమ్మ రసం, బీట్‌రూట్ రసం, పసుపు కలిపిన పాలు... వీటితో గుండె రక్తనాళాల్లో అవరోధాలు పేరుకునే పరిస్థితి కుంటుపడుతుంది. అందుకు తోడ్పడే అంశాలు ఈ పానీయాల్లో ఏమున్నాయంటే....

ఆక్సిజన్‌ను మోసుకువెళ్తూ, రక్తప్రవాహానికి తోడ్పడే రక్తనాళాల్లో కాలక్రమేణా అవరోధాలు పేరుకుపోయి, అథెరోస్క్లెరోసిస్ అనే సమస్య తలెత్తుతుంది. క్రమేపీ పేరుకుపోయే కొలెస్ట్రాల్, కొవ్వు లేదా క్యాల్షియంలు రక్తనాళాలను మూసుకుపోయేలా చేసి, రక్తపోటుకూ అంతిమంగా గుండెపోటుకూ దారి తీస్తాయి. కాబట్టి ఈ పరిస్థితికి దోహదపడే ఇన్‌ఫ్లమేషన్, చెడు కొలెస్ట్రాల్‌లను తగ్గించే ఆహార నియమాలను పాటించాలి.

గ్రీన్ టీ: గ్రీన్‌టీలోని కాటెచిన్స్ అనే యాంటీఆక్సిడెంట్స్, రక్తనాళాల్లో ప్రధాన అవరోధాలకు దోహదపడే, ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌నూ, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌నూ తగ్గిస్తాయి. ప్రతిరోజూ గ్రీన్ టీ తాగడం వల్ల, రక్తనాళాల్లోని అంతర్గత గోడల పనితీరు మెరుగుపడి, రక్తనాళాల్లో నమ్యత పెరిగి రక్త ప్రవాహం సాఫీగా జరుగుతుంది. కాబట్టి రోజుకు రెండు నుంచి మూడు కప్పుల తాజా గ్రీన్ టీ తాగడం ద్వారా గుండె రక్తనాళాలు ఆరోగ్యంగా ఉంటాయి

దానిమ్మ రసం: దానిమ్మలోని ప్యూనికలాజిన్స్, యాంథోసయానిన్స్, రక్తనాళాల్లో ఇన్‌ఫ్లమేషన్‌నూ ఆక్సిడేటివ్ స్ట్రెస్‌నూ తగ్గిస్తాయి. అలాగే క్రమం తప్పకుండా దానిమ్మ రసం తాగితే గుండె రక్తనాళాల్లో ప్లేక్ నిల్వ తగ్గుతుంది. ఈ పండులోని ఫ్లేవనాయిడ్స్ రక్తంలో కొలెస్ట్రాల్ ఆక్సిడేషన్‌ను కూడా తగ్గిస్తాయి. కాబట్టి ఈ పండు ప్రయోజనాలను పూర్తిగా పొందాలనుకుంటే తాజా దానిమ్మ రసాన్ని చక్కెర జోడించకుండా తాగాలి



బీట్‌రూట్ రసం: ఈ రసంలో నైట్రేట్స్ ఉంటాయి. వీటిని శరీరం నైట్రిక్ ఆమ్లంగా మలుచుకుంటుంది. దాంతో రక్తనాళాలు విప్పారి, రక్తపోటు తగ్గుతుంది, రక్త ప్రవాహం మెరుగవుతుంది. ప్రతి రోజూ బీట్‌రూట్ రసం తాగడం వల్ల రక్తనాళాల బిరుసుతనం తగ్గుతుందని పరిశోధనలు నిరూపించాయి

మహిళల ఆరోగ్యం

ఎముకల దృఢత్వం 30 ఏళ్ల లోపే...

30 ఏళ్లు దాటిన మహిళల్లో ఎముకలు గుల్లబారే ముప్పు ఎక్కువగా ఉంటుంది. ఈ ముప్పు నుంచి తప్పించుకోవాలంటే ఒక చిట్కా పాటించాలి. మహిళల్లో ఎముకలు 30 ఏళ్ల వయసుకు పతాక స్థాయి దృఢత్వానికి చేరుకుని, ఆ తర్వాత నుంచి క్రమేపీ బలహీనపడుతూ పెళుసుగా మారి విరిగిపోయే స్వభావాన్ని అలవరుచుకుంటాయి. కాబట్టి ప్రతి మహిళా 30 ఏళ్ల వయసుకు చేరుకునే సమయానికి ఎముకల సాంద్రత గరిష్ఠ స్థాయికి చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకోసం వ్యాయామం, పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలి. ఎముకల ఆరోగ్యాన్ని కాపాడే జీవనశైలిని అనుసరించిన మహిళల్లో ఎముకల క్షీణత తక్కువగా ఉన్నట్టు అధ్యయనాలు సైతం నిరూపించాయి. కాబట్టి ఆహారంలో మాంసకృత్తులు అధికంగా ఉండేలా చూసుకోవాలి. బరువులెత్తే వ్యాయామాలు చేయాలి. ఈ వ్యాయామాలు ఎముకల సాంద్రతనూ, కండరపుష్టినీ పెంచేలా ఉండాలి. మెగ్నీషియం మోతాదు తగ్గితే ఎముకల సాంద్రత కూడా తగ్గుతుంది. కాబట్టి మెగ్నీషియం కలిగి ఉండే బాదం, జీడిపప్పు, గుమ్మడి విత్తనాలు, పాలకూర తింటూ ఉండాలి. అలాగే ఎముకల దృఢత్వాన్ని పెంచే విటమిన్ కె కోసం, బ్రోకొలి, సోయాబీన్స్ తీసుకోవాలి.



పెరుగుతున్న యాంటీబయాటిక్ నిరోధకత

న్యూఢిల్లీ, అక్టోబరు 13: ప్రపంచవ్యాప్తంగా 2023లో బయటపడిన ప్రతి ఆరు బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లలో ఒకటి యాంటీబయాటిక్ నిరోధకత కలిగిన బ్యాక్టీరియా వల్లే సంభవించాయని డబ్ల్యూహెచ్‌వో తాజా నివేదిక తెలిపింది. మూత్రనాళాలు, బ్లడ్ ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే బ్యాక్టీరియాలో యాంటీబయాటిక్ నిరోధకత ఎక్కువగా ఉంటోందని ఈ నివేదిక పేర్కొంది. 'గ్లోబల్ యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ సర్వైలెన్స్ రిపోర్ట్-2025' పేరిట డబ్ల్యూహెచ్‌వో ఈ నివేదికను విడుదల చేసింది. యాంటీబయాటిక్స్ మితిమీరిన వినియోగం వల్ల బ్యాక్టీరియాను చంపడానికి వినియోగించే మందులకు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని పెంచుకుంటూ యాంటీబయాటిక్ నిరోధకత ఏర్పడుతుందని వైద్య నిపుణులు తెలిపారు.

రక్తపోటు, ఊబకాయంతో అధిక మరణాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 13: అధిక రక్తపోటు, వాయుకాలుష్యం, ధూమపానం, ఊబకాయం, మధుమేహం వంటి 88 రకాల సమస్యల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని, వాటిని నియంత్రిస్తే దాదాపు సగం మరణాలను నివారించవచ్చని పరిశోధకులు తెలిపారు. 2022తో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా మరణాల రేటు తగ్గినప్పటికీ.. ఆత్మహత్యలు, మాదకద్రవ్యాల అధిక వినియోగం, మద్యపానం వంటి దురలవాట్ల వల్ల యువతలో మరణాల రేటు మాత్రం తగ్గలేదని ఈ అధ్యయనం గుర్తించింది. 2023లో చైనాలో అత్యధికంగా 1.07 కోట్ల మరణాలు సంభవించగా, భారత్‌లో 98.5 లక్షలు, అమెరికాలో 3 లక్షలకు పైగా మరణాలు సంభవించాయి.

ఆటోఇమ్యూన్ బాధితుల్లో 70% మహిళలే

న్యూఢిల్లీ, అక్టోబరు 13: ఆటోఇమ్యూన్ వ్యాధులతో బాధపడుతున్న వారిలో దాదాపు 70% మంది మహిళలేనని, భారత్‌లో దీన్ని ఒక ప్రధాన ఆరోగ్య సమస్యగా గుర్తించాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు పేర్కొన్నారు. రోగనిరోధక వ్యవస్థ పొరపాటున మన శరీరంలోని ఆరోగ్యకరమైన కణజాలంపై దాడిచేయడం వల్ల ఆటోఇమ్యూన్ వ్యాధుల బారిన పడుతుంటారు. ఇండియన్ రుమటాలజీ అసోసియేషన్ 40వ వార్షికోత్సవం సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ.. భారత్‌లోని 20 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సుగల మహిళలు ఎక్కువగా ఆటోఇమ్యూన్ వ్యాధుల బారినపడుతున్నారని చెప్పారు.

కొత్తగా హెచ్-1బీ ఉద్యోగులను నియమించం

టీసీఎస్ సీఈవో కృతివాసన్ వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 13: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం హెచ్-1బీ వీసాలపై కొత్త ఉద్యోగులను తీసుకోబోమని టీసీఎస్ సీఈవో కే కృతివాసన్ తెలిపారు. వారికి బదులు అమెరికాలోని స్థానిక ప్రతిభావంతులను నియమించుకోవడంపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. అమెరికాలో తమ కంపెనీకి 32 వేల మంది సిబ్బంది ఉండగా.. వారిలో దాదాపు 11 వేల మంది హెచ్-1బీపై వచ్చిన వారేనని చెప్పారు. హెచ్-1బీ వీసా ఉద్యోగులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించాలని భావిస్తున్నామని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడం టెక్ కంపెనీల్లో గందరగోళానికి దారి తీసిన తెలిసిందే.

కెనడాలో మెయిల్ బాక్సుల దొంగతనం కేసులో 8 మంది భారతీయ యువకుల అరెస్టు

ఒట్టావా, అక్టోబరు 13: కెనడాలోని పీల్ రీజియన్‌లో మెయిల్ బాక్సుల నుంచి లక్షలాది డాలర్ల విలువైన వస్తువులను దొంగిలించిన ఒక భారీ రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. ఈ కేసులో భారతీయ మూలాలున్న ఎనిమిది మంది యువకులను అరెస్టు చేశారు. వీరిపై ఏకంగా 344 అభియోగాలు నమోదు చేశారు. అంతకుముందు సోదాల్లో 450కి పైగా దొంగిలించిన మెయిల్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ 4 లక్షల కెనడియన్ డాలర్ల (సుమారు రూ. 2.53 కోట్లు) కంటే ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు.

బాబోయ్.. ఇథనాల్



- ఇ20తో తగ్గిపోతున్న పాత వాహనాల మైలేజీ.. తరచుగా రిపేర్లు
- ఇంధన ఖర్చు పెరుగుతోందని యజమానుల గగ్గోలు
- లోకల్‌సర్కిల్స్ సంస్థ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 13: కొండ నాలుకకు మందు వేస్తే.. ఉన్న నాలుక ఊడినట్లుంది ఇథనాల్ కలిపిన పెట్రోల్‌తో వ్యవహారం. కాలుష్యంతో పాటు, ఇంధన దిగుమతుల వ్యయం తగ్గుతుందని పెట్రోల్‌లో ప్రస్తుతం ఇథనాల్‌ను 20 శాతం (ఇ20) కలుపుతున్నారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి దీనిని సరఫరా చేస్తున్నారు. అయితే ఈ ఇథనాల్ మిశ్రమ పెట్రోల్‌తో తమ కార్ల మైలేజీ భారీగా తగ్గిపోతోందని, మరమ్మతులు ఎక్కువగా వస్తున్నాయని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ విషయంలో లోకల్‌సర్కిల్స్ అనే సంస్థ ఓ సర్వే చేసింది. ఆ మేరకు.. 2022 కంటే ముందు కొనుగోలు చేసిన తమ వాహనాల మైలేజీ ఇ20 పెట్రోల్‌తో తగ్గిపోతోందని 10లో 8 మంది పేర్కొన్నారు. గతంతో పోల్చితే ఈ ఏడాది ఇంధన ఖర్చు ఎక్కువ అయిపోతోందన్నారు. ఈ పెట్రోల్‌తో వాహనాలకు రిపేర్లు వస్తున్నాయని 52% మంది చెప్పారు. ఇంజన్లు పాడైపోతున్నాయని, ట్యాంకులు, కార్బురేటర్లు చెడిపోతున్నాయన్నారు.

- సర్వేలో భాగంగా దేశంలోని 323 జిల్లాల్లో 36 వేలకు పైగా వాహనాల యజమానుల అభిప్రాయాలు సేకరించారు. దీనిలో టైర్1 నగరాల నుంచి 45%, టైర్2 నగరాల నుంచి 27, ఇతర చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి 28 శాతం ఉన్నారు. పెట్రోల్ సంబంధిత మరమ్మతులు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 40 శాతం పెరిగాయని మెకానిక్‌లు కూడా చెప్పారు.
- ఇ20 వల్ల తన కారులో ఇంధనం నీరుగా మారిపోయిందని, దాని రిపేర్‌కు 4 లక్షలు ఖర్చయిందని చెన్నైలోని ఓ లగ్జరీ కార్ ఓనర్ వాపోయారు.
- ఆగస్టులో సర్వే చేసినపుడు 28 శాతం మంది మాత్రమే రిపేర్ల గురించి చెప్పారు. కానీ అక్టోబరు సర్వేలో ఆ సంఖ్య 52 శాతానికి పెరిగింది.
- కొనుగోలు చేసి మూడేళ్లు, ఆపైబడ్డ వాహనాల విడిభాగాలు త్వరగా పాడైపోతున్నట్లు గుర్తించారు. ద్విచక్రవాహనాల్లో ఫ్యూయల్ ఇంజెక్టర్లు దెబ్బతింటున్నాయని, ఆయిల్ ట్యాంకులు తుప్పు పట్టిపోతున్నాయని మెకానిక్స్ వెల్లడించారు.

పెరుగుతున్న ఇథనాల్ వినియోగం

స్వచ్ఛ ఇంధనం వైపు వేసే అడుగుల్లో ఇ20 ఓ భాగమని, దీంతో రైతులకు లాభాలు చేకూరతాయంటూ పెట్రోల్‌లో ఇథనాల్ శాతాన్ని పెంచడాన్ని ప్రభుత్వం సమర్థించుకుంటోంది. 2024 నాటికి ప్రపంచ రవాణా ఇంధనంలో ఇథనాల్ మిశ్రమం వాటా 5 నుంచి 6 శాతంగా ఉంది. గతేడాది నాటికి ఇథనాల్ మార్కెట్ విలువ 98.5 బిలియన్ డాలర్లకు పైగా ఉంది. ఏటా 6.9% పెరుగుదలతో 2035 నాటికి ఆ మార్కెట్ విలువ 205.2 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు.

పీఎం కిసాన్ పక్కదారి!

(మొదటిపేజీ తరువాయి)

మంది భార్యాభర్తలు ప్రయోజనం పొందుతున్నారని రుజువైంది. బుధవారం(ఈ నెల 15)లోగా తనిఖీల ప్రక్రియ పూర్తిచేయాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రం లేఖలు రాసింది. పీఎం-కిసాన్ పథకం కింద అన్నదాతలకు పెట్టుబడి సాయంగా కేంద్రం ఏటా రూ.6 వేల చొప్పున అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో మూడు విడతల్లో నేరుగా జమ చేస్తున్న సంగతి తెలిసిందే. పథకం మార్గదర్శకాల ప్రకారం.. కుటుంబంలో భార్య గానీ, భర్త గానీ ఎవరో ఒకరు మాత్రమే ఈ సాయం పొందడానికి అర్హులు. ఒకే కుటుంబంలో మైనర్ పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులు కూడా లబ్ధి పొందుతున్న 1.76 లక్షల కేసులను కూడా కేంద్రం గుర్తించింది. 2019 ఫిబ్రవరి 1 తర్వాత రిజిస్టర్ చేసుకున్న రైతులు.. తమ భూములకు గత యజమానులు ఎవరో వివరాలు సమర్పించాల్సి ఉండగా.. 33.34 లక్షల మంది తప్పుడు వివరాలు ఇవ్వడమో.. ఫారంలో ఆ వివరాలను ఖాళీగా వదిలేయడమో చేశారు. పూర్వపు యజమానులు అనుచితంగా ఈ పథకం ప్రయోజనాలను పొందకుండా ఉండేందుకే ఈ నిబంధన పెట్టారు. అయినా 8.11 లక్షల మంది పూర్వపు యజమానులు, ప్రస్తుత యజమానులు.. ఉభయులూ ఆరేసి వేలు పొందుతున్నారని తేలింది. వారసత్వం ద్వారా భూములు మ్యుటేషన్ చేయించుకున్న రైతులు కూడా ఈ పథకానికి అర్హులే. అయితే ఇతర మార్గాల్లో మ్యుటేషన్ చేయించుకున్న రైతులు కూడా ఈ పథకం కింద సొమ్ము తీసుకుంటున్నారు. ఇలాంటివారు 8.11 లక్షల మంది వరకు ఉన్నట్లు తాజా తనిఖీల్లో వెల్లడైంది. ఇలాంటి లోపాలను నివారించేందుకు, పథకం ప్రయోజనాలను అసలైన లబ్ధిదారులకే అందించేందుకు కేంద్రప్రభుత్వం ఇటీవల పలు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి కొత్త లబ్ధిదారుల ఎంపికకు రైతు గుర్తింపు కార్డును తప్పనిసరి చేసింది.



ఆరేళ్లు.. 20 వాయిదాలు

చిన్న సన్నకారు రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు, పెట్టుబడి సాయం కోసం వారు ప్రైవేటు వడ్డీవ్యాపారుల బారిన పడకుండా కాపాడడానికి, సాగును నిరాటంకంగా సాగించేందుకు రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయంగా అందించడానికి మోదీ ప్రభుత్వం 2019 ఫిబ్రవరి 24న లోక్‌సభ ఎన్నికలకు ముందు పీఎం-కిసాన్ స్కీంను ప్రారంభించింది. ఇది పూర్తిగా కేంద్ర పథకం. గుర్తించిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమచేస్తోంది. ఏటా మూడు వాయిదాల్లో రూ.2 వేల చొప్పున ఇస్తోంది. ఇప్పటికి 20 వాయిదాలు చెల్లించింది. దీని మొత్తం విలువ రూ.3.90 లక్షల కోట్లు. ఈ ఏడాది ఆగస్టు 2న ప్రధాని మోదీ వారాణసీ నుంచి 9.7 కోట్ల మందికి 20వ వాయిదా కింద తలో రూ.2 వేల చొప్పున జమచేశారు. 21వ వాయిదా మొత్తాన్ని మెరుపు వరదల ప్రభావిత జమ్మూకశ్మీరు రైతులకు ఈ నెల 7వ తేదీనే చెల్లించారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ 8.55 లక్షల మంది ఖాతాల్లో రెండేసి వేలు జమచేశారు. దేశంలోని మిగతా రైతులకు దీపావళిలోగా జమచేసే అవకాశం ఉంది. భూమిపై హక్కులు కలిగిన చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు ఈ పథకానికి అర్హులు. అధికాదాయం పొందే రైతులు, సర్వీసులో ఉన్న, రిటైరైన ప్రభుత్వాధికారులు, ఆదాయ పన్ను చెల్లింపుదారుల కుటుంబాలకు అర్హత లేదు. పీఎం కిసాన్ పోర్టల్ లేదా పీఎం కిసాన్ యాప్, చేరువలోని కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవలసి ఉంటుంది. ఈ పథకానికి గత ఏడాది బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లు కేటాయించగా.. పెరిగిన లబ్ధిదారులను దృష్టిలో ఉంచుకుని 2025-26 బడ్జెట్‌లో రూ.63,500 కోట్లు కేటాయించారు. మరోవైపు.. రైతుకు ఇప్పుడిస్తున్న రూ.6 వేల సాయం చాలడం లేదని.. దీనిని రూ.12 వేలకు పెంచాలని పార్లమెంటరీ కమిటీ ఇటీవల సిఫారసు చేయడం విశేషం.

కరూర్ ఘటనపై సీబీఐ దర్యాప్తు

- రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో పర్యవేక్షణ కమిటీ
- సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు



చెన్నై, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కరూర్‌లో గత నెల టీవీకే అధినేత విజయ్ సభలో జరిగిన తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తునకు సుప్రీం కోర్టు సోమవారం ఆదేశించింది. దర్యాప్తు పర్యవేక్షణకు సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఇదే సమయంలో తొక్కిసలాట ఘటనపై మద్రాస్ హైకోర్టు ఐజీ అస్రాగార్గ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన 'సిట్, తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు వెలువరించింది. కరూర్‌లో గత సెప్టెంబరు 27వ తేదీ రాత్రి తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, నటుడు విజయ్ నిర్వహించిన రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాట ఘటనలో 41 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు చేపట్టిన దర్యాప్తు వివరాలు, సంబంధిత పత్రాలను తక్షణమే జస్టిస్ రస్తోగి కమిటీ, సీబీఐలకు అప్పగించాలని సుప్రీంకోర్టు తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పును విజయ్ స్వాగతించారు. 'న్యాయానిదే గెలుపు' అంటూ ఏకవాక్యంతో 'ఎక్స్'లో తన అభిప్రాయాన్ని పేర్కొన్నారు.

అపరిశుభ్ర మరుగుదొడ్డి ఫొటోకు రూ.1,000 ఫాస్టాగ్ బహుమతి

- ఈ నెల 31 వరకు అమలు...ఎన్‌హెచ్ఏఐ ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబరు 13: టోల్ ప్లాజాల వద్ద పరిశుభ్రత పాటించేలా ప్రభుత్వరంగ సంస్థ అయిన భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) పలు చర్యలు తీసుకుంటోంది. టోల్ ప్లాజాల వద్ద తమ నిర్వహణలోని మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయన్న సమాచారం పంపేవారికి బహుమతి ఇవ్వనున్నట్టు ప్రకటించింది. రూ. వెయ్యి విలువ చేసే మొత్తాన్ని ఫాస్టాగ్ అకౌంట్‌లో రీఛార్జి చేయనుంది. జాతీయ రహదారిపై ప్రయాణించేవారు అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లను గమనిస్తే అందుకు సంబంధించిన ఫొటోనే 'రాజ్ మార్గ్ యాత్ర' యాప్‌లో పోస్టు చేయాల్సి ఉంటుంది. వినియోగదారుడి పేరు, లొకేషన్, వాహనం రిజిస్ట్రేషన్ నెంబరు, ఫోన్ నెంబరు వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. అర్హత సాధించిన ఫొటోను ఎంపిక చేసిన అనంతరం రూ. వెయ్యి సంబంధిత వెహికల్ రిజిస్ట్రేషన్ నెంబరు (వీఆర్ఎన్)కు అనుసంధానమైన ఫాస్టాగ్‌కు జమ అవుతాయి. ఈ కార్యక్రమం ఈ నెల 31 వరకు అమల్లో ఉంటుంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



గ్రామీణ నేపథ్యంలో

సందీప్ కిషన్

సందీప్ కిషన్, మిథిలా పార్కర్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ మల్లిక్ రామ్ తెరకెక్కిస్తున్న సిరీస్ 'సూపర్ సుబ్బు'. రాజీవ్ ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలకా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది. సోమవారం చిత్రబృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ 'ప్రస్తుతం తెరకెక్కుతోన్న కథలు మన జీవితాల్ని ప్రతిబింబిస్తున్నాయి. 'సూపర్ సుబ్బు' కథ విన్న వెంటనే ఇది అందరికీ రీచ్ అవ్వాలని అనిపించింది. ప్రేక్షకులు ఈ సిరీస్‌ని ప్రేమిస్తారనే నమ్మకం ఉంది. సిరీస్ ఆద్యంతం నవ్వుల భరితంగా ఉంటుంది. అందర్నీ అలరించేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి' అని అన్నారు. 'గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథాంశం మనకు చాలా విషయాలు తెలియజేస్తుంది. కొత్తదనంతో పాటు హృదయానికి హత్తుకునే భావోద్వేగాలతో ఈ సిరీస్‌ను రూపొందిస్తున్నాం. చాలా రోజుల తర్వాత గుర్తుండిపోయే కంటెంట్ చూశామన్న అనుభూతి కలుగుతుంది' అని మల్లిక్‌రామ్ చెప్పారు. 'ఇందులోని పాత్రలు చాలా దగ్గరగా, వైవిధ్యంగా అనిపిస్తాయి' అని మిథిలా పార్కర్ పేర్కొన్నారు.

వినోదం పంచే లవ్ ఓటీపీ



ఇద్దరమ్మాయిలను ఒకరికి తెలియకుండా మరొకరిని ప్రేమలోకి దింపిన ఓ యువకుడి జీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కిన వినోదాత్మక చిత్రం 'లవ్ ఓటీపీ'. అనీష్ కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహించారు. జాన్విక, స్వరూపిణి హీరోయిన్లు. రాజీవ్ కనకాల కీలకపాత్ర పోషించారు. విజయ్ ఎం. రెడ్డి నిర్మించారు. చిత్రబృందం సోమవారం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'చక్కని ప్రేమకథతో పాటు తండ్రీ కొడుకుల అనుబంధాన్ని ఆవిష్కరించేలా ఈ చిత్రం ఉంటుంది' అని అన్నారు. 'చిత్రీకరణ పూర్తయింది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం. ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశాన్ని ఇచ్చే చిత్రమిదని నిర్మాత తెలిపారు.



అంచనాలను అందుకుంటాం

సిద్ధు జొన్నలగడ్డ

"తెలుసు కదా' చిత్రం ట్రైలర్ ద్వారా ప్రేక్షకులకు సినిమా గురించి ఒక గొప్ప, అద్భుతమైన అనుభూతిని ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. మా లక్ష్యం నెరవేరింది. ట్రైలర్‌తో ప్రేక్షకుల్లో సినిమాపై అంచనాలు పెరిగాయి. వాటిని అందుకునేలా మా సినిమా ఉంటుంది' అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. ఆయన కథానాయకుడిగా ప్రముఖ స్టైలిస్ట్ నీరజకోన దర్శకత్వం వహించిన చిత్రమిది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 17న విడుదలవుతోంది. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ 'టిల్లూ లాంటి పాత్రల నుంచి బయటకు రావాలంటే ఇలాంటి సినిమాలు చేయాలి. టిల్లు అమాయకుడు. కానీ 'తెలుసు కదా'లో మాత్రం నాది చాలా తెలివైన వ్యక్తి పాత్ర. చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. యువతను, కుటుంబ ప్రేక్షకులను మెప్పించే సినిమా ఇది' అని చెప్పారు. హీరోయిన్ రాశీ ఖన్నా మాట్లాడుతూ 'ప్రేమకథల్లో ఇదో గొప్ప చిత్రమవుతుంది. ప్రేక్షకుల మనసును తాకే భావోద్వేగాలున్న చిత్రమిది' అన్నారు. నీరజ కోన మాట్లాడుతూ 'దర్శకురాలిగా ఇది నాకు తొలి చిత్రం. చాలా ప్రత్యేకమైనది. ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే మంచి కంటెంట్‌తో వస్తున్నాం. ఇదొక మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్' అని చెప్పారు. నిర్మాత కృతి ప్రసాద్ మాట్లాడుతూ "తెలుసు కదా' కథ వినగానే నాకు నచ్చింది. ఈ తరం యువతకు బాగా నచ్చుతుంది. ఒక మంచి సినిమాను నిర్మించినందుకు గర్వంగా ఉంది. ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని అన్నారు. ఈ సినిమాలో నా మనసుకు నచ్చిన పాత్ర పోషించాను అని హీరోయిన్ శ్రీనిధి శెట్టి అన్నారు.

ఈ విజయం ఐశ్వర్య త్యాగానికి నిదర్శనం

అభిషేక్ బచ్చన్





'ఈ విజయం నాకెంతో ప్రత్యేకం. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయ్యింది. ఈ ఏడాది ఫిల్మ్‌ఫేర్ అవార్డుల్లో ఉత్తమ నటుడి అవార్డు వచ్చినందుకు ఆనందంగా ఉంది. ఈ స్పీచ్ కోసం చాలా రోజులు సాధన చేశాను. ఈ సందర్భంగా నా భార్య ఐశ్వర్య, కుమార్తె ఆరాధ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పాలి. నా కలలను సాకారం చేసుకోవడానికి వాళ్లు నన్ను ఎంతో ప్రోత్సహించారు. ఈ అవార్డు అందుకోవడానికి ఐశ్వర్య ప్రధాన కారణం. ఆమె చేసిన త్యాగాల వల్లే నేను ఇక్కడ ఉన్నాను. ఈ పురస్కారమే అందుకు నిదర్శనం' అని అన్నారు అభిషేక్ బచ్చన్. ఇటీవలె జరిగిన 70వ ఫిల్మ్‌ఫేర్ వేడుకల్లో ఆయన ఉత్తమ నటుడిగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగానికి గురయ్యారు. 'ఇది నా కల. నా కుటుంబం ముందు అవార్డును స్వీకరించడం నాకు రెట్టింపు సంతోషాన్ని ఇస్తోంది. నేను కృతజ్ఞతలు చెప్పాల్సిన వ్యక్తులు చాలా మందే ఉన్నారు. వారిలో 'ఐ వాంట్ టూ టాక్ దర్శకుడు సూజిత్ సర్కార్ ఒకరు. ఇక నన్ను 25 ఏళ్లుగా ప్రోత్సహిస్తున్న ప్రేక్షకులకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఈ విజయాన్ని నా తండ్రి అమితాబ్ బచ్చన్‌కు, నా కుమార్తె ఆరాధ్యకు అంకితం చేస్తున్నాను' అని పేర్కొన్నారు.

నా పాత్రకు ప్రాధాన్యమెక్కువ

- మమిత బైజు

'ప్రేమలు' చిత్రంతో ఘన విజయం సొంతం చేసుకున్న మమిత బైజు తాజాగా 'డ్యూడ్'లో ప్రదీప్ రంగనాథన్ సరసన కథానాయికగా నటించారు. ఈ చిత్రంతో కీర్తీశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఈనెల 17న తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మమిత బైజు మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు. "డ్యూడ్'లో నా పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంది. మునుపెన్నడూ చేయని 'కురల్' అనే పాత్రలో కనిపిస్తాను. ఆమె తన భావోద్వేగాల పట్ల నిబద్ధతగా, తన చుట్టూ ఉన్న వారందరితో స్నేహంగా ఉంటుంది. ఈ పాత్ర పోషించడం నాకు ఓ గొప్ప అనుభవం. ఈ చిత్రంలోని కొన్ని భావోద్వేగ సన్నివేశాలు నాకు సవాలుగా అనిపించాయి. వాటికోసం రాత్రంతా డైలాగ్స్ ప్రాక్టీస్ చేశాను. చిత్రీకరణ సమయంలో ఎలాంటి ఆందోళనకు గురికాకుండా సన్నివేశాలపై దృష్టి కేంద్రీకరించాను. ప్రదీప్‌తో కలిసి నటించడం ఓ గొప్ప అనుభూతి. సాయి అభ్యంకర్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. పాటలన్నీ మనసుని ఆకట్టుకుంటాయి' అని తెలిపారు.






మిత్రమండలి అందర్నీ అలరిస్తుంది

శ్రీవిష్ణు

'మిత్రమండలి' పెద్ద హిట్ అవుతుంది. ప్రియదర్శి ఎప్పుడూ ఎనర్జిటిక్‌గా ఉంటారు. ఆయన ఎంచుకునే కథలు చాలా బావుంటాయి. బన్నీ వాసు గారు నెలకి ఒక సూపర్‌హిట్ మూవీని అందిస్తున్నారు. ఈ చిత్రంపై ఆయన చాలా నమ్మకంతో ఉన్నారు' అని కథానాయకుడు శ్రీ విష్ణు అన్నారు. ప్రియదర్శి, నిహారిక ఎన్‌ఎమ్ జంటగా విజయేందర్ తెరకెక్కించిన చిత్రం 'మిత్రమండలి'. బీవీ వర్క్స్ బ్యానర్, బన్నీ వాసు సమర్పణలో కల్యాణ్ మంతిన, భానుప్రతాప, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించారు. ఈ నెల 16న చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ విష్ణు మాట్లాడుతూ 'మిత్రమండలి' అందర్నీ అలరిస్తుంది. మీ అందర్నీ ఫుల్లుగా ఖుషీ చేసి థియేటర్ల నుంచి బయటకు పంపిస్తుంది' అని చెప్పారు. 'ఈ చిత్రంతో దీపావళిని ముందుగానే మీ ముందుకు తెస్తున్నాం' అని ప్రియదర్శి తెలిపారు. 'ఇదో క్లీన్ ఎంటర్‌టైనర్. సినిమాలోని ప్రతీ సన్నివేశం నవ్విస్తుంది. నా సినిమాలే ఆడాలని నేను ఎప్పుడూ ఆలోచించను. అందరి సినిమాలూ ఆడాలి. హిట్ అవ్వాలి' అని బన్నీ వాసు కోరారు.

కథా నేపథ్యం మేరకే కె - ర్యాంప్ టైటిల్

జైన్స్ నాని



మా సినిమా కథకు 'కె- ర్యాంప్' అనే టైటిల్ చక్కగా సరిపోతుందనే పెట్టాం. ముందు కొన్ని వేరే టైటిల్స్ అనుకున్నా ఇది క్యాచీగా ఉండడంతో, త్వరగా ప్రేక్షకుల్లోకి వెళ్తుందనిపించింది. ఈ చిత్రంలో హీరో పాత్ర పేరు కుమార్. ర్యాంప్ అనే మాట మనందరం బాగా వాడుతుంటాం. అలా కథా నేపథ్యం, హీరో పాత్రచిత్రణకు సరిపోయేలా 'కె-ర్యాంప్' అనే టైటిల్‌ను నిర్ణయించాం' అని దర్శకుడు జైన్స్ నాని అన్నారు. ఆయన దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటించిన చిత్రమిది. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా జైన్స్ నాని సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- ఈ సినిమా ట్రైలర్‌లో కుటుంబ ప్రేక్షకులు ఇబ్బందిపడేలా ఒకట్రెండు డైలాగ్‌లు ఉన్నాయి. అయితే సినిమా అంతా అదే తరహాలో ఉంటుందని అనుకోవద్దు. ప్రతి ప్రేక్షకుణ్ణి మెప్పించేలా ఈ కథ ఉంటుంది. మంచి కథతో పాటు ప్రేక్షకులను అబ్బురపరిచే మలుపులు ఉన్నాయి. ముఖ్యంగా విరామం సమయంలో వచ్చే ట్విస్ట్ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. మా నిర్మాతలు పూర్తి స్వేచ్ఛనివ్వడం వల్లే అనుకున్న విధంగా సినిమాను తెరకెక్కించగలిగాను.
- నేను మద్రాస్ ఐఐటీలో చదువుకునేటప్పుడే కొన్ని లఘుచిత్రాలను తెరకెక్కించాను. వాటికి మంచి పేరు వచ్చింది. చదువు పూర్తయ్యాక దర్శకత్వ శాఖలో సహాయకుడిగా చేరాను. కిరణ్ అబ్బవరానికి ఈ కథ వినిపించడం, ఆయన ఓకే చేయడంతో 47 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేశాం. కొత్తదనం కోసం కేరళ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను.

విడుదల తేదీ ఖరారు

విక్రాంత్, చాందినీ చౌదరి, వెన్నెల కిశోర్, తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం ప్రధాన పాత్రధారులుగా సంజీవ్ రెడ్డి తెరకెక్కిస్తోన్న 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా విడుదల తేదీ ఖరారైంది. మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తోన్న ఈ చిత్రం నవంబరు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. వెన్నెల కిశోర్ డాక్టర్ భ్రమరం పాత్రలో నవ్వించబోతున్నారు. నేటి సమాజంలో యువ జంటలు ఎదుర్కొంటున్న ఓ సమస్య నేపథ్యంలో సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.



హెచ్‌సీఎల్ టెక్ లాభం రూ.4,235 కోట్లు

రూ.31,942 కోట్ల ఆదాయం

ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్ ●వరుసగా 91వ త్రైమాసిక డివిడెండ్ ఇది

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) హెచ్‌సీఎల్ టెక్ రూ.4,235 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. వార్షిక ప్రాతిపదిక లాభంలో ఎలాంటి వృద్ధి లేనప్పటికీ, ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో నమోదైన రూ.3,843 కోట్ల లాభంతో పోలిస్తే 10.2 శాతం పెరిగింది. ఈ క్యూ2లో కంపెనీ ఏకీకృత ఆదాయం మాత్రం వార్షిక ప్రాతిపదికన 10.6 శాతం పెరిగి రూ.31,942 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇదే కాలానికి ఆదాయం రూ.28,862 కోట్లుగా నమోదైంది. ఈ క్యూ1లో నమోదైన రూ.30,349 కోట్ల రెవెన్యూతో పోలిస్తే 5.25 శాతం వృద్ధి నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయం వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 3-5 శాతంగా కొనసాగించినప్పటికీ, సేవల ఆదాయ వృద్ధి అంచనాను మాత్రం 3-5 శాతం నుంచి 4-5 శాతానికి మెరుగుపరిచింది.

కాగా, ఈ త్రైమాసిక ఆర్థిక ఫలితాల సందర్భంగా హెచ్‌సీఎల్ టెక్ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. డివిడెండ్‌కు అర్హులైన వాటాదారుల ఎంపికకు రికార్డు తేదీని ఈ నెల 17గా నిర్ణయించిన కంపెనీ.. 28న చెల్లింపులు చేపట్టనుంది. హెచ్‌సీఎల్ వరుసగా 91 త్రైమాసికాలుగా డివిడెండ్ ప్రకటిస్తూ వస్తోంది.



"గ్లోబల్ డెలివరీ మోడల్‌ను బలోపేతం చేసుకుంటూ రావడం ద్వారా కంపెనీ వ్యూహాత్మకంగా హెచ్1బీ వీసాలపై ఆధారపడటం తగ్గించుకుంటూ వచ్చింది. అమెరికాలో స్థానిక నియామకాలను, శిక్షణను పెంచడం ద్వారా స్థానికీకరణను మెరుగుపరుచుకోవాలనుకుంటున్నాం."

- సీ విజయ్ కుమార్,
సీఈఓ, ఎండీ, హెచ్‌సీఎల్ టెక్

- గడిచిన త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్ ఉద్యోగులు నికరంగా 3,489 మంది పెరిగి 2,26,640కి చేరుకున్నారు. గత మూడు నెలల్లో కొత్తగా 5,196 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకున్నట్లు కంపెనీ తెలిపింది. కాగా, ఈ క్యూ2లో ఉద్యోగుల వలసల రేటు 12.6 శాతానికి తగ్గింది.
- గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, ఈసారి ఫ్రెషర్ల నియామకాలను గణనీయంగా పెంచాలన్నది ఆలోచన. గత ఏడాది హైరింగ్‌తో పోలిస్తే, ఈ ప్రథమార్థంలో దాదాపు 92% నియామకాలు చేపట్టినట్లు హెచ్‌సీఎల్ టెక్ చీఫ్ పీపుల్ ఆఫీసర్ రామ్ సుందర రాజన్ తెలిపారు. ఈ ఏడాది ప్రణాళికకు అనుగుణంగా ద్వితీయార్థంలో మిగతా నియామకాలను చేపడతామన్నారు.
- ఉద్యోగులందరికీ వేరియబుల్ చెల్లింపులను వారి జీతంలో 'ఫిక్స్‌డ్ పే'లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించిన కంపెనీ.. ఈ నెల నుంచి వేతనాలను పెంచుతున్నట్లు తెలిపింది.

భారత ఫార్మా సీడీఎంఓ కంపెనీలకు ఊతం

బయోసెక్యూర్ చట్టానికి అమెరికా సెనెట్ ఆమోదం



వాషింగ్టన్: అమెరికా-చైనాల మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతోంది. అమెరికా సెనెట్ తాజాగా యూఎస్ బయోసెక్యూర్ యాక్ట్‌తో కూడిన నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్ (ఎన్‌డీఏఏ)కు ఆమోదం తెలిపింది. ప్రతినిధుల సభ, అధ్యక్షుడు ట్రంప్ ఇంకా ఈ బిల్లుకు ఆమోదం తెలపాల్సి ఉంది. ఈ రెండు ప్రక్రియలు పూర్తయితే ఇది చట్టంగా మారి అమల్లోకి వస్తుంది. అమెరికా బయోటెక్, హెల్త్ డేటా కంపెనీల్లో చైనా బయోటెక్, ఫార్మా కంపెనీలు పెట్టే పెట్టుబడులకు ఈ చట్టంతో తెరపడుతుందని భావిస్తున్నారు. ఈ చట్టం కింద అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) ఏదైనా చైనా ఫార్మా కంపెనీ, చైనా సైన్యం కనుసన్నల్లో పని చేస్తోందని భావిస్తే ఆ కంపెనీ అమెరికా బయోటెక్, హెల్త్‌కేర్ డేటా కంపెనీల్లో పెట్టే పెట్టుబడులను దేశ భద్రత పేరుతో అమెరికా ప్రభుత్వం అడ్డుకోవచ్చు. ఇప్పటికే ఉప్పు-నిప్పుల్లా ఉన్న అమెరికా-చైనా వాణిజ్య సంబంధాలు ఈ చట్టంతో మరింత వేడెక్కే అవకాశం ఉందని భావిస్తున్నారు.

భారీ మార్కెట్: అమెరికా ఫార్మా కంపెనీలు ప్రస్తుతం ఏటా 4,100 కోట్ల డాలర్ల నుంచి 4,370 కోట్ల డాలర్ల విలువైన సీడీఎంఓ సేవలను ఔట్‌సోర్స్ చేసుకుంటున్నాయి. 2034 నాటికి ఇది 8,400 కోట్ల డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఎఫ్‌డీఏ ఆమోదిత ప్లాంట్లు అత్యధికంగా ఉన్న భారత్‌కు ఇది ఎంతో కలిసి వస్తుందని భావిస్తున్నారు.

మన కంపెనీలకు మేలే


ఈ చట్టం భారత ఫార్మా రంగానికి చెందిన కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మాన్యుఫాక్చరింగ్ ఆర్గనైజేషన్స్ (సీడీఎంఓ)కు మేలు చేస్తుందని భావిస్తున్నారు. దీంతో అమెరికా బయోటెక్, ఫార్మా కంపెనీలు తమ కొత్త ఔషధాల అభివృద్ధి, తయారీ కార్యకలాపాలను భారత్‌లోని సీడీఎంఓ కంపెనీలకు తరలించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే అనేక అమెరికా కంపెనీలు.. భారత్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్, లారస్ ల్యాబ్స్, న్యూలాండ్ లేబొరేటరీస్, జుబిలెంట్ ఫార్మా, పిరామల్ ఫార్మా వంటి ఫార్మా కంపెనీల నుంచి ఈ సేవలు అందుకుంటున్నాయి. తాజా పరిణామాలతో ఇది మరింత పెరగనుంది.

ఎమిరేట్స్ ఎన్‌బీడీకి ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో మెజారిటీ వాటా?

- ఇరువర్గాల మధ్య కొనసాగుతున్న చర్చలు
- డీల్ విలువ రూ.9,000 కోట్ల పైనే ఉండే చాన్స్

న్యూఢిల్లీ: దేశీయ ప్రైవేట్ రంగానికి చెందిన లిస్టెడ్ బ్యాంకింగ్ సంస్థ ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో మెజారిటీ వాటాను దక్కించుకునేందుకు ఎమిరేట్స్ ఎన్‌బీడీ సన్నాహాలు చేస్తోంది. గత కొద్ది నెలలుగా ఇరువర్గాల మధ్య చర్చలు జరుగుతున్నాయని, ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో 51 శాతానికి పైగా వాటాను చేజిక్కించుకునేందుకు ఎమిరేట్స్ ఎన్‌బీడీ ఆసక్తిగా ఉందని బ్యాంకింగ్ వర్గాలు వెల్లడించాయి. చర్చలు పురోగతిలో ఉన్నాయని, డీల్ కుదిరేందుకు మరి కొంత సమయం పట్టవచ్చని ఆ వర్గాలు తెలిపాయి. సోమవారం బీఎస్ఈలో ఆర్‌బీఎల్ షేరు ధర రూ.290.15 వద్ద స్థిరపడింది. బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.17,786.79 కోట్లుగా నమోదైంది. ఈ లెక్కన బ్యాంక్‌లో 51 శాతం వాటా కోసం ఎమిరేట్స్ ఎన్‌బీడీ రూ.9,071 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. కాగా ప్రభుత్వ రంగంలోని ఐడీబీఐ బ్యాంక్‌లో వ్యూహాత్మక వాటా కొనుగోలుకు పోటీపడుతున్న సంస్థల్లో ఎమిరేట్స్ ఎన్‌బీడీ కూడా ఉందని గతంలో వార్తలు వచ్చాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	520
చిత్తూరు	553	విశాఖపట్నం	510
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	114
కరీంనగర్	102	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	97
కర్నూలు	102	నెల్లూరు	102
విశాఖపట్నం	127	అనంతపురం	102
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,25,400 ▲	1,14,950 ▲	1,80,000 ▲
విజయవాడ	1,28,000 ▲	1,22,000 ▲	1,82,000 ▲
విశాఖపట్నం	1,28,000 ▲	1,13,900 ▲	1,97,000 ▲
రాజమండ్రి	1,25,400 ▲	1,14,950 ▲	1,79,000 ▲
ప్రొద్దుటూరు	1,30,200 ▲	1,19,780 ▲	1,79,000 ▲
ముంబై	1,24,155 ▲	1,13,726 ▲	1,75,325 ▲

8 ఏళ్ల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం

- 2017 జూన్ తర్వాత ఇదే ప్రథమం
- సెప్టెంబరులో 1.54 శాతంగా నమోదు

న్యూఢిల్లీ: రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబరు నెలలో 8 సంవత్సరాల కనిష్ఠ స్థాయి 1.54 శాతానికి దిగి వచ్చింది. ఆగస్టు నెలలో ఇది 2.07% ఉండగా గత ఏడాది సెప్టెంబరులో 5.49% ఉంది. ఆహార వస్తువుల ధరలు ప్రత్యేకించి కూరగాయలు, పళ్లు, పప్పు దినుసుల ధరలు గణనీయంగా తగ్గడం ఇందుకు కారణం. 2017 జూన్‌లో నమోదైన 1.46% తర్వాత నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే. అలాగే ఈ ఏడాది రిటైల్ ద్రవ్యోల్బణం 2% కన్నా దిగువకు రావడం ఇది రెండో సారి. ప్రభుత్వం ఆర్‌బీఐకి నిర్దేశించిన ద్రవ్యోల్బణం కట్టడి పరిధిలో (2% పైకి లేదా దిగువకు సర్దుబాటుతో 4% అంటే 2-6%) కనిష్ఠ స్థాయి కన్నా దిగి వచ్చినట్టు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. సెప్టెంబరు నెలలో ద్రవ్యోల్బణం 53 బేసిస్ పాయింట్లు (0.53%) తగ్గిందని ఎన్ఎస్ఓ తెలిపింది. ఆహార ద్రవ్యోల్బణం ఆగస్టులో (-) 0.64% ఉండగా సెప్టెంబరులో (-) 2.28 శాతానికి తగ్గింది. గత ఏడాది సెప్టెంబరులో ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 9.24 శాతంగా ఉంది.

కేరళలో గరిష్ఠం

రాష్ట్రాల వారీగా చూసినట్టయితే సెప్టెంబరు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం కేరళలో గరిష్ఠంగా 9.05% ఉండగా ఉత్తరప్రదేశ్‌లో కనిష్ఠంగా (-) 0.61 శాతంగా నమోదైంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 1.07% ఉండగా పట్టణ ప్రాంతాల్లో 2.04 శాతంగా ఉంది.

బం'గరం గరం'

పసిడి సరికొత్త ఆల్‌టైం రికార్డు

- రూ.1.28 లక్షలకు 10 గ్రాముల ధర
- ఒక్కరోజే రూ.1,950 పెరుగుదల
- ప్రొద్దుటూరులో రూ.130,200కి చేరిన పసిడి

న్యూఢిల్లీ: పసిడి, వెండి పరుగు ఆపనంటున్నాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర సోమవారం రూ.1,950 పెరిగి సరికొత్త జీవితకాల గరిష్ఠస్థాయి రూ.1,27,950కి చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహమూ అదే స్థాయిలో ఎగబాకి కొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1,27,350కి పెరిగింది. కిలో వెండి సైతం ఏకంగా రూ.7,500 పెరుగుదలతో రూ.1.79 లక్షల ధర పలికింది. సిల్వర్‌కూ ఇది కొత్త రికార్డే. అంతర్జాతీయంగా వీటి ధరలు మరింత ఎగబాకడమే ఇందుకు ప్రధాన కారణం. కాగా ప్రొద్దుటూరులో 10 గ్రాముల బంగారం ఏకంగా రూ.1,30,200 పలికింది. మరోవైపు ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం దాదాపు 2 శాతం ఎగబాకి సరికొత్త రికార్డు స్థాయి 4,084 డాలర్లకు చేరింది. సిల్వర్ సైతం దాదాపు 3 శాతం పెరుగుదలతో ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 51.74 డాలర్లకు చేరుకుంది.

ధనత్రయోదశి నాటికి రూ.1.30 లక్షలకు: ఈ ఏడాదిలో బంగారం ధరలు ఇప్పటికే 50% పెరిగాయి. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు కొనసాగితే, ఈ ధనత్రయోదశి (శనివారం) నాటికి 10 గ్రాముల బంగారం రూ.1.30 లక్షలు దాటవచ్చని ఎస్ఎంసీ గ్లోబల్ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ హెడ్ వందన భారతి అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాది తొలినాళ్లలో ధర రూ.1.50 లక్షలకు చేరుకోవచ్చని ఆమె అంచనా వేశారు.

మార్కెట్‌కు ట్రంప్ సుంకాల పోటు

సెన్సెక్స్ 174 పాయింట్లు పతనం

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత వారాంతంలో చైనాపై 100 శాతం అదనపు సుంకాలు ప్రకటించడంతో ఆసియా మార్కెట్లతో పాటు దేశీయ ఈక్విటీ సూచీలూ సోమవారం నష్టాల్లో పయనించాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లలో అమ్మకాలతో సెన్సెక్స్ 173.77 పాయింట్లు కోల్పోయి 82,327.05 వద్ద ముగిసింది. నిఫ్టీ 58 పాయింట్లు తగ్గి 25,227.35 వద్ద స్థిరపడింది.

టాటా క్యాపిటల్‌కు స్పందన అంతంతే: గత వారం ఐపీఓ ముగించుకున్న టాటా క్యాపిటల్ లిమిటెడ్ సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో తన షేర్లను నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.326తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 1.22 శాతం లాభంతో రూ.330 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 1.35 శాతం లాభంతో రూ.330.40 వద్ద స్థిరపడింది.

టాటా సన్స్ సారథిగా చంద్రశేఖరన్ హ్యాట్రిక్!

న్యూఢిల్లీ: టాటా సన్స్ సారథిగా ఎన్ చంద్రశేఖరన్‌ను మరో విడత కొనసాగించాలని టాటా ట్రస్ట్స్ బోర్డు నిర్ణయం తీసుకుంది. దీంతో వరుసగా మూడో విడత చంద్రశేఖరన్ గ్రూప్ సారథ్య బాధ్యతలు నిర్వహించనున్నారు. గ్రూప్ రిటైర్మెంట్ పాలసీకి భిన్నంగా టాటా ట్రస్ట్స్ బోర్డు ఆయనకు మరో విడత పొడిగింపు ఇవ్వాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. అయితే దీన్ని టాటా ట్రస్ట్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. చంద్రశేఖరన్ ప్రస్తుతం రెండో విడత సారథ్య బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనకు 65 సంవత్సరాల వయసు నిండే నాటికి అంటే 2027 ఫిబ్రవరికి ఈ రెండో విడత అధికార కాలం పూర్తి కావలసి ఉంది. టాటా సన్స్ సారథిగా ఆయన రెండో విడత పదవీ కాలం 2022 ఫిబ్రవరిలో ప్రారంభమైంది. టాటా సన్స్ బోర్డుతో ఆయన అనుబంధం 2016 అక్టోబరులో ప్రారంభం కాగా 2017 జనవరిలో ఆయనను టాటా సన్స్ చైర్మన్‌గా నియమించారు. టాటా గ్రూప్ రిటైర్మెంట్ నిబంధనావళి ప్రకారం సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు 65 సంవత్సరాల వయసు నిండగానే రిటైర్ కావలసి ఉంది.

ఇక లాంఛనమే..

విజయానికి 58 పరుగుల దూరంలో గిల్ సేన

భారత్ లక్ష్యం 121.. ప్రస్తుతం 63/1

విండీస్ రెండో ఇన్నింగ్స్ 390

క్యాంప్‌బెల్, హోప్ శతకాలు

రెండో టెస్టు



న్యూఢిల్లీ: వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను టీమిండియా క్లీన్‌స్వీప్ చేయడం ఇక లాంఛనమే. కానీ రెండో టెస్టులో విండీస్ బ్యాటర్ల పట్టువదలని పోరాటంతో సిరీస్‌లో తొలిసారిగా ఆట ఐదో రోజుకు చేరడం గమనార్హం. అటు 121 పరుగుల లక్ష్య ఛేదనకు సోమవారం చివరి సెషన్‌లో బరిలోకి దిగిన భారత్ ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 63/1 స్కోరుతో ఉంది. క్రీజులో సాయి సుదర్శన్ (30), రాహుల్ (25) ఉన్నారు. ఇక, విజయానికి భారత్ కేవలం 58 పరుగుల దూరంలో ఉంది. దీంతో మంగళవారం తొలి సెషన్‌లోనే మ్యాచ్ ముగిసే చాన్సుంది. యశస్వీ జైస్వాల్ (8) రెండో ఓవర్‌లోనే వెనుదిరిగాడు. అయితే అంతకుముందు విండీస్ తమ ఫాలోఆన్‌లో అంచనాలకు మించి చివరి వికెట్ వరకు పోరాడింది. క్యాంప్‌బెల్ (115) కెరీర్‌లో తొలి శతకం నమోదు చేయగా.. అటు షాయ్ హోప్ (103) ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత టెస్టుల్లో సెంచరీని అందుకోవడం విశేషం. వీరిద్దరి ఆటతీరుతో విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగులకు ఆలౌటైంది. గ్రీవ్స్ (50 నాటౌట్), చేజ్ (40), సీల్స్ (32) రాణించి విండీస్‌కు 120 పరుగుల ఆధిక్యాన్ని అందించారు. బుమ్రా, కుల్దీప్ చెరో 3.. సిరాజ్ 2 వికెట్లు తీశారు.



శతకాల మోత: ఓవర్‌నైట్ స్కోరు 173/2తో నాలుగో రోజు ఆరంభించిన విండీస్‌ను వీలైనంత త్వరగా ఆలౌట్ చేద్దామనుకున్న భారత బౌలర్లకు అవకాశం దక్కలేదు. ఈ సెషన్‌లో ఒక వికెట్‌ను మాత్రమే తీయగలిగారు. తొలి గంట ఆటలో క్యాంప్‌బెల్, హోప్ ఇబ్బంది లేకుండా ఆడారు. స్పిన్నర్లు కూడా బంతిని టర్న్ చేయలేక పోయారు. ఓ సిక్సర్‌తో క్యాంప్‌బెల్ సెంచరీని అందుకున్నాడు. చివరకు మూడో వికెట్‌కు 177 పరుగుల భారీ భాగస్వామ్యం అందాక క్యాంప్‌బెల్‌ను జడేజా అవుట్ చేశాడు. ఆ తర్వాత చేజ్ కూడా దీటుగా ఆడాడు. లంచ్ బ్రేక్ అనంతరం హోప్ కూడా సెంచరీ పూర్తి చేశాడు. ఆ వెంటనే సిరాజ్ రెండో కొత్త బంతితో అతడిని బౌల్డ్ చేయగా..కుల్దీప్ ఒకే ఓవర్‌లో చేజ్, పియర్ (0)లను అవుట్ చేశాడు. టెయిలెండర్లను బుమ్రా దెబ్బతీసినప్పటికీ.. ఆఖరి వికెట్‌కు గ్రీవ్స్, సీల్స్ మాత్రం పట్టు వీడలేదు. 311 రన్స్‌కే 9 వికెట్లు కోల్పోయిన దశలో.. ఈ ఇద్దరూ క్రీజులో పాతుకుపోయి 361/9 స్కోరుతో మ్యాచ్‌ను ఆఖరి సెషన్‌కు తీసుకెళ్లారు. మరో 29 పరుగులు జోడించాక సీల్స్‌ను బుమ్రా అవుట్ చేయడంతో పదో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యం ముగిసినట్టయ్యింది. వీరి పోరాటం లేకపోయుంటే మ్యాచ్ సోమవారమే ముగిసేది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 518/5 డిక్లేర్;
వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 248 ఆలౌట్;
వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (ఎల్బీ) జడేజా 115, చందర్‌పాల్ (సి) గిల్ (బి) సిరాజ్ 10, అథనజె (బి) సుందర్ 7, హోప్ (బి) సిరాజ్ 103, చేజ్ (సి సబ్) దేవ్‌దత్ (బి) కుల్దీప్ 40, ఇమ్లాచ్ (ఎల్బీ) కుల్దీప్ 12, గ్రీవ్స్ (నాటౌట్) 50, పియర్ (సి) నితీశ్ (బి) కుల్దీప్ 0, వారికన్ (బి) బుమ్రా 3, ఫిలిప్ (సి) జురెల్ (బి) బుమ్రా 2, సీల్స్ (సి) సుందర్ (బి) బుమ్రా 32; **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 118.5 ఓవర్లలో 390 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-17, 2-35, 3-212, 4-271, 5-293, 6-298, 7-298, 8-307, 9-311, 10-390. **బౌలింగ్:** సిరాజ్ 15-3-43-2, జడేజా 33-10-102-1, సుందర్ 23-3-80-1, కుల్దీప్ 29-4-104-3, బుమ్రా 17.5-5-44-3, జైస్వాల్ 1-0-3-0.
భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) ఫిలిప్ (బి) వారికన్ 8, రాహుల్ (బ్యాటింగ్) 25, సాయి సుదర్శన్ (బ్యాటింగ్) 30; **ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం: 18 ఓవర్లలో 63/1. వికెట్ పతనం:** 1-9 .**బౌలింగ్:** సీల్స్ 3-0-14-0; వారికన్ 7-1-15-1; పియర్ 6-0-24-0; చేజ్ 2-0-10-0.

సిరాజ్‌కు వడదెబ్బ



అధిక వేడి, తేమ కారణంగా భారత పేసర్ సిరాజ్ మైదానంలో తీవ్ర అలసటకు గురయ్యాడు. నాలుగో రోజు రెండో సెషన్‌లో అతను వరుసగా ఆరు ఓవర్లు వేయడంతో నీరసించాడు. దీంతో వెంటనే డగౌట్‌కు వెళ్లిన సిరాజ్‌కు సహాయక సిబ్బంది అతడి తలపై ఐస్ ప్యాక్ పెట్టి శరీర ఉష్ణోగ్రతను తగ్గించే ప్రయత్నం చేశారు. ఫిజియో థెరపిస్ట్ సిరాజ్ కాలికి మసాజ్ చేశాడు. ఆ తర్వాత సిరాజ్ బౌలింగ్‌కు దిగలేదు. అయితే ఇదంతా గమనించిన కామెంటేటర్ దినేశ్ కార్తీక్.. పేసర్లకు మహారాజా తరహా చికిత్స లభిస్తుంటుందని సరదాగా వ్యాఖ్యానించాడు.

1 ఈ ఏడాది టెస్టుల్లో ఎక్కువ వికెట్లు (8 టెస్టుల్లో 37) తీసిన బౌలర్‌గా సిరాజ్. జింబాబ్వే పేసర్ ముజరబాని (36)ని అధిగమించాడు.

దక్షిణాఫ్రికా 216/6

పాక్‌తో మొదటి టెస్టు

లాహోర్: టోనీ జోర్జి (81 బ్యాటింగ్), ఓపెనర్ రికెల్టన్ (71) అర్ధ శతకాలతో ఆదుకోవడంతో పాకిస్థాన్‌తో తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో రెండో రోజు ఆఖరికి దక్షిణాఫ్రికా 216/6 స్కోరు చేసింది. నొమన్ అలీ నాలుగు వికెట్లు పడగొట్టాడు. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు సఫారీలు ఇంకా 162 పరుగులు వెనుకంజలో ఉన్నారు. చేతిలో నాలుగే వికెట్లే ఉన్నాయి. జోర్జి, రికెల్టన్ మూడో వికెట్‌కు 94 పరుగులు జోడించారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 313/5తో సోమవారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్థాన్ 378 పరుగులకు ఆలౌటైంది.

స్పోర్ట్స్

వెన్నెల శుభారంభం

ప్రపంచ జూ.బ్యాడ్మింటన్

గువాహటి: ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి వెన్నెల శుభారంభం చేసింది. సోమవారం మొదలైన టోర్నీ వ్యక్తిగత విభాగం బాలికల సింగిల్స్‌లో వెన్నెల 15-1, 15-6తో సియోఫ్రా ఫ్లిన్ (ఐర్లాండ్)పై గెలిచి రెండో రౌండ్ చేరింది. బాలుర సింగిల్స్‌లో లల్తాజువాల 15-4, 15-4తో డెనిస్ ముకాస (ఉగాండా)పై, జ్ఞాన దత్తా 5-15, 15-7, 15-7తో మిలన్ మెస్టెర్‌హాజీ (హంగేరీ)పై గెలిచి రెండో రౌండ్‌లో ప్రవేశించారు.


వైభవ్ మరో చరిత్ర

బిహార్ వైస్ కెప్టెన్‌గా ఎంపిక



పట్నా: బాల బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ బిహార్ రంజీ జట్టు వైస్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. బుధవారం మొదలయ్యే ఈ రంజీట్రోఫీ సీజన్‌లో తొలి రెండు మ్యాచ్‌లకు 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్టు బిహార్ క్రికెట్ సంఘం సోమవారం ప్రకటించింది. దాంతో రంజీట్రోఫీ చరిత్రలో అతి చిన్న వయస్సులో వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్న క్రికెటర్‌గా వైభవ్ చరిత్ర సృష్టించనున్నాడు. వైభవ్ గత సీజన్‌లో 13 ఏళ్లప్పుడు రాజస్థాన్ తరపున ఐపీఎల్ అరంగేట్రం చేసి రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. సకీబుల్ గనీని బిహార్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు.

జోష్నకు 'జపాన్' టైటిల్



న్యూఢిల్లీ: భారత వెటరన్ స్క్వాష్ ప్లేయర్ జోష్న చిన్నప్ప పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సింగిల్స్ టైటిల్ నెగ్గింది. సోమవారం జరిగిన జపాన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో 39 ఏళ్ల జోష్న 11-5, 11-9, 6-11, 11-8తో మూడో సీడ్ హయా అలీ (ఈజిప్టు)ను చిత్తు చేసి విజేతగా నిలిచింది. జోష్న చివరిగా 2015లో ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ సింగిల్స్ టైటిల్ గెలిచింది.

సఫారీల ఉత్కంఠ విజయం

మహిళల వరల్డ్‌కప్



నదినె డిక్లెర్క్ (37 నాటౌట్)

పోరాడి ఓడిన బంగ్లాదేశ్

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికా మరో అద్భుత విజయాన్నందుకుంది. సోమవారం బంగ్లాదేశ్‌తో ఆఖరి ఓవర్ వరకు ఆసక్తికరంగా జరిగిన ఈ మ్యాచ్‌లో సఫారీలు 3 వికెట్ల తేడాతో గట్టెక్కారు. ముందుగా బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 232/6 స్కోరు సాధించింది. షోర్న అక్తర్ (51 నాటౌట్), షర్మీన్ అక్తర్ (50), నిగర్ సుల్తానా (32), ఫర్గానా (30) రాణించారు. ఎలబాకు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో దక్షిణాఫ్రికా 49.3 ఓవర్లలో 235/7 స్కోరు చేసి నెగ్గింది. 78 రన్స్‌కే ఐదు వికెట్లు కోల్పోయిన దశలో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ట్రియాన్ (62), కాప్ (56) 85 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే చివర్లో బౌలర్ల కట్టడితో ఉత్కంఠ పెరిగింది. 8 బంతుల్లో 9 రన్స్ కావాల్సిన వేళ జోరు మీదున్న నదినె డిక్లెర్క్ (37 నాటౌట్) సులువైన క్యాచ్‌ను షోర్న వదిలేయడం బంగ్లాను దెబ్బతీసింది. ఇక ఆఖరి ఓవర్‌లో తనే 4,6తో గెలుపునకు కావాల్సిన 8 రన్స్‌ను సాధించి మూడు బంతులుండగానే మ్యాచ్‌ను ముగించింది. నహీదాకు 2 వికెట్లు లభించాయి. భారత్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ డిక్లెర్క్ ఆఖరిదాకా నిలిచి విజయాన్నందించిన విషయం తెలిసిందే.

నేటి మ్యాచ్ — మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
శ్రీలంక x న్యూజిలాండ్

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 50 ఓవర్లలో 232/6 (షోర్న అక్తర్ 51 నాటౌట్, షర్మీన్ అక్తర్ 50; ఎలబా 2/42). **దక్షిణాఫ్రికా:** 49.3 ఓవర్లలో 235/7 (ట్రియాన్ 62, కాప్ 56, డిక్లెర్క్ 37 నాటౌట్; నహీదా 2/44).

మోహిత్, వెంకట్రామ్ పసిడి ధమాకా



మోహిత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలుగు క్రీడాకారులు పతకాల మోత మోగించారు. భువనేశ్వర్‌లో సోమవారం జరిగిన అండర్-20 విభాగం 3వేల మీటర్ల రేసులో మోహిత్ చౌధరి (నాగర్ కర్నూల్) స్వర్ణం నెగ్గాడు. 800 మీటర్ల పరుగులో మోగిలి వెంకట్రామ్ రెడ్డి (కర్నూలు) పసిడి పతకం సొంతం చేసుకున్నాడు. ఇద్దరికీ ఇది ఈ టోర్నీలో రెండో స్వర్ణం కావడం విశేషం. అండర్-18 హెప్టాథ్లాన్‌లో ఖమ్మం అథ్లెట్ బడ్డి వైశాలి రజతంతో మెరిసింది.

యువెంటస్‌తో జత కట్టిన శాట్



మాట్లాడుతున్న మంత్రి శ్రీహరి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఫుట్‌బాల్‌ను అట్టడుగు స్థాయి నుంచి అభివృద్ధి చేసేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) కీలకమైన ముందడుగు వేసింది. సోమవారం గచ్చిబౌలి క్రీడా సముదాయంలో ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత సాకర్ క్లబ్ యువెంటస్‌తో క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో శాట్ ఒప్పందం చేసుకుంది. వారం రోజుల పాటు రాష్ట్రంలోని నిష్ణాతులైన ఫుట్‌బాల్ కోచ్‌లు, క్రీడాకారులకు యువెంటస్ క్లబ్ హైపవర్ టీమ్ ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. ఆ తర్వాత కూడా యువెంటస్ క్లబ్‌తో తెలంగాణ క్రీడాకారులకు శిక్షణ ఇప్పించేందుకు శాట్ కసరత్తు చేస్తుందని చైర్మన్ శివసేనా రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ క్రీడాశాఖ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, యువెంటస్ క్లబ్ హెడ్ కోచ్ ఫ్రాన్సిస్కో బెల్మామెల్లి, టెక్నికల్ డైరెక్టర్ లూకా కరోనా తదితరులు పాల్గొన్నారు.



లేగదూడకు 'కృష్ణ' అని నామకరణం చేస్తున్న బండి సంజయ్

చర్లపల్లి జైలు దేశానికి ఆదర్శం

» ఖైదీల సంక్షేమంలో నంబర్ వన్: కేంద్ర మంత్రి సంజయ్

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఖైదీల సంక్షేమంలో చర్లపల్లి జైలులో చేపడుతున్న సంస్కరణలు దేశానికి ఆదర్శమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఖైదీలకు బీమా సౌకర్యం కల్పిస్తూ నంబర్ వన్‌గా నిలుస్తోందని ప్రశంసించారు. వారి కుటుంబ సభ్యులకు వడ్డీ లేకుండా రుణ సదుపాయం కల్పించడం అభినందనీయని అన్నారు. మహిళా ఖైదీల పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చదివిస్తూ ఫీజులను కూడా జైళ్ల శాఖ చెల్లించడం గొప్ప విషయమన్నారు. ఈ విషయంలో జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా విజన్‌ను అభినందించారు. కస్టడీ-కేర్-కరక్షన్ కు సౌమ్య మిశ్రా నిజమైన ఆచరణ రూపమిస్తున్నారని చెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సోమవారం చర్లపల్లి జైలును సందర్శించారు. ఖైదీల కోసం ఏర్పాటు చేసిన పరిశ్రమల గురించి, వారు తయారు చేస్తున్న ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోశాలను సందర్శించిన ఆయన గోవులకు మేత తినిపించి, ఒక లేగ ఆవుకు 'కృష్ణ' అని నామకరణం చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల జైళ్ల శాఖలు సైతం చర్లపల్లి జైలును సందర్శించి సంస్కరణలు అమలు చేసేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఖైదీలు తయారు చేస్తున్న ఉత్పత్తులు నాణ్యమైనవిగా ఉన్నందున హైదరాబాద్‌లో 'ప్రత్యేక మేళా' నిర్వహించాలని సూచించారు.

విద్యుత్తు ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర: రాఘవులు

హైదరాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దేశంలో విద్యుత్తు రంగాన్ని ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆరోపించారు. సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రతిపాదించిన విద్యుత్తు సవరణ చట్టం అమల్లోకి వస్తే కరెంటు పంపిణీ సంస్థలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోతాయన్నారు. తెలంగాణలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు వల్ల రైతులకు మేలు జరుగుతోందని, కొత్త చట్టం అమల్లోకి వస్తే ఉచిత విద్యుత్తు అమలు కాదన్నారు. విద్యుత్తు రంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు.

నాసి రకం బొగ్గు మాకు అంటగడతారా?

» సింగరేణి వైఖరిని ఆక్షేపిస్తూ తెలంగాణ జెన్‌కో లేఖ

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 'మీరు సరఫరా చేసే బొగ్గును మండిస్తే బూడిద ఎక్కువ వస్తోంది. నాసిరకం బొగ్గు మాకు అంటగట్టి.. మేలిమి రకం బొగ్గు ఇతర రాష్ట్రాలకు ఇస్తారా? ఈ బొగ్గు వల్ల ప్లాంట్ ఉత్పాదక సామర్థ్యం(పీఎల్ఎఫ్) మేరకు ఉత్పత్తి జరగడం లేదు.. ప్లాంట్లు దెబ్బతింటున్నాయి. నిర్దేశిత బొగ్గు కన్నా ఎక్కువ మండించాల్సిన పరిస్థితి నెలకొంది. తక్షణమే ఇంధన సరఫరా ఒప్పందం (ఎఫ్ఎస్ఏ)కు అనుగుణంగా మేలిమి రకం బొగ్గు సరఫరా చేయాలి' అని సింగరేణి యాజమాన్యాన్ని తెలంగాణ జెన్‌కో కోరినట్లు తెలిసింది. రెండేళ్లుగా సింగరేణి సరఫరా చేస్తున్న బొగ్గుపై తీవ్ర ఆక్షేపణ తెలియజేస్తూ సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కు జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్ లేఖ రాసినట్లు సమాచారం. రాష్ట్రంలోని విద్యుత్ ప్లాంట్లను జీ-9, జీ-10బొగ్గును వినియోగించేలా డిజైన్ చేస్తే.. కానీ, జీ-14, 15 బొగ్గు సరఫరా చేస్తున్నారని అభ్యంతరం తెలిపినట్లు తెలిసింది.

ఉమ్మడి జిల్లాలకు టీఆర్‌పీ ఇన్‌చార్జిల నియామకం

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పది ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జులను నియమిస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న సోమవారం ప్రకటన విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లాకు సుదగాని హరిశంకర్ గౌడ్, కరీంనగర్‌కు మాదం రజినికుమార్ యాదవ్, నల్గొండకు వట్టే జానయ్య యాదవ్, మెదక్‌కు జ్యోతి పండల్, ఖమ్మంకు కలివేముల మధుబాబు, మహబూబు నగర్‌కు సంగెం సూర్యారావు, వరంగల్‌కు పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, హైదరాబాద్‌కు భావన వేంకటేశ్, ఆదిలాబాద్‌కు కొమ్ముల ప్రవీణ్‌లను ఇన్‌చార్జులుగా నియమించారు.

జేఈఈ విద్యార్థులకు ఉచితంగా డిజిటల్ బుక్‌లెట్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జేఈఈ-2026కు సిద్ధమవుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అవగాహన కోసం ఐఐటీల్లో కటాఫ్ మార్కులు, ర్యాంకులు, సీట్ల భర్తీ, విశ్లేషణకు సంబంధించిన డిజిటల్ బుక్‌లెట్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం తెలిపింది. 146 పేజీల బుక్‌లెట్‌లో ఐఐటీ-జేఈఈ 2025 ర్యాంకులు, దేశవ్యాప్తంగా ఐఐటీల్లో సీట్ల కేటాయింపు, కటాఫ్ మార్కులు, రిజర్వేషన్ల వారీగా ఓపెనింగ్, క్లోజింగ్ ర్యాంకుల విశ్లేషణ, ఐఐటీల్లో కోర్సుల సమాచారాన్ని పొందుపరిచినట్లు వెల్లడించింది. పుస్తకం వెబ్‌వెర్షన్‌లో అందుబాటులో ఉందని, కావాల్సిన వారు వాట్సాప్ నంబర్ 9849016661కు మెసేజ్ చేయాలని పేర్కొంది.

ఓవర్సీస్ విద్యా నిధి లబ్ధిదారుల సంఖ్య పెంపు

రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశీ విద్యకోసం అందించే ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల (విద్యానిధి) లబ్ధిదారుల సంఖ్యను పెంచింది. గతంలో 300 మంది బీసీలకు మాత్రమే ఇస్తుండగా, ఇప్పుడు 700కు పెంచారు. ఎస్సీ విద్యార్థుల సంఖ్యను 210 నుంచి 500కు, ఎస్టీ విద్యార్థుల సంఖ్యను 100 నుంచి 200కి పెంచారు. ఈ మేరకు ఏటా అదనంగా 610 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

మద్యం దుకాణాల దరఖాస్తుకు రూ. 3 లక్షలా?

» హైకోర్టులో పిటిషన్ దాఖలు

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మద్యం విధానం 2025-27లో నిర్ణయించిన దరఖాస్తు రుసుమును సవాలు చేస్తూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలయింది. మద్యం దుకాణాల కోసం రూ.3 లక్షలు దరఖాస్తు రసుముగా ప్రభుత్వం నిర్ణయించింది. లైసెన్సు రానప్పటికీ దానిని వాపసు చేయబోదు. ఇది అక్రమమని పేర్కొంటూ వెస్ట్ మారేడ్‌పల్లికి చెందిన గడ్డం అనిల్‌కుమార్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. మద్యం దుకాణాల కేటాయింపులో గౌడ్స్, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించిన ప్రభుత్వం వారికి దరఖాస్తు ఫీజులో ఎలాంటి మినహాయింపు ఇవ్వకపోవడం అన్యాయమని తెలిపారు. లైసెన్సు రానప్పటికీ దరఖాస్తుదారులకు రీఫండ్ ఇవ్వకపోవడం సరికాదని పేర్కొన్నారు. ఈ కారణలతో పేద, బలహీనవర్గాల వారు దుకాణాల కోసం పోటీపడే పరిస్థితి లేదని, ఆర్థికంగా ఉన్నవారే దుకాణాలకు దరఖాస్తు చేస్తున్నారని తెలిపారు. అందువల్ల మద్యం విధానానికి సంబంధించిన జీవో 93పై స్టే ఇవ్వాలని కోరారు. దీనిపై సోమవారం జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియలో పిటిషనర్ పాల్గొనకుండా ఉండవచ్చని వ్యాఖ్యానించింది. దీనిపై ప్రభుత్వ వైఖరిని తెలియజేయాలని ఎక్సైజ్ శాఖకు ఆదేశాలు జారీచేసిన ధర్మాసనం.. విచారణను నవంబర్ 3కు వాయిదా వేసింది.

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై మరో వ్యాజ్యం

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవో 9ను సవాల్ చేస్తూ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. బీసీల్లో ఏ,బీ,సీ,డీ,ఈ కేటగిరీల వారీగా రిజర్వేషన్ కల్పించాలని.. బీసీలకు మొత్తంగా 42 శాతం ఇవ్వడం వల్ల నష్టపోతామని పేర్కొంటూ సంచారజాతులు, పాక్షిక సంచార జాతులు, డీనోటిఫైడ్ ట్రైబల్స్ అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సంచారజాతులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరింది. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం.. ఈ అంశంపై ఇప్పటికే దాఖలయిన పిటిషన్లకు దీనిని జత చేయాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి సూచించింది.

రైతుల కష్టం వాన పాలు



భువనగిరి జిల్లా ఎదుల్లాగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

అకాల వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

వలిగొండ మండలంలో 14.6 సెం.మీ. వర్షం

పొంగిన వాగులు.. నిలిచిన రాకపోకలు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అకాల వర్షంతో రైతుల కష్టం నీటి పాలైంది. అనేకచోట్ల ఆరబోసిన ధాన్యం వర్షం నీటిలో కొట్టుకుపోయింది. వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయమేర్పడింది. భారీ ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి ప్రజలు భయభ్రాంతులయ్యారు. యాదాద్రి-భువనగిరి, నల్లగొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని పలు మండలాల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్నలు నీటి పాలయ్యాయి. ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో 14.6 సెం.మీ., ఆత్మకూరు (ఎం)లో 12.8, మోత్కూరులో 11.3 సెం.మీ. వర్షం కురిసింది. నల్లగొండ జిల్లా చౌటుప్పల్ మండలం నక్కలగూడెంలోని కోళ్ల ఫారంలోకి వర్షపు నీరు చేరడంతో 6,000కు పైగా బ్రాయిలర్ కోళ్లు మృత్యువాతపడ్డాయి. వలిగొండ, గుండాల మండలాల్లో ఇళ్లు కూలిపోయాయి. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉద యం వరకు ఎడతెరపి లేని వాన కురిసింది. మణుగూరులో 10.88 సెం.మీ., చర్ల మండలంలో 10.68 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కిన్నెరసాని, తాలిపేరు ప్రాజెక్టుల నుంచి వరద నీటికి దిగువకు విడుదల చేస్తున్నారు. మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయమేర్పడింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్‌లో ఆరబెట్టుకున్న మొక్కజొన్నలు కొట్టుకుపోయాయి. తొర్రూరు, గూడూరు మండలాల్లో వరి నేలవాలింది. ఇన్‌ఫ్లో తగ్గడంతో సోమవారం శ్రీశైలం ప్రాజెక్టు గేట్లను మూసివేశారు. ఆల్మట్టి, నారాయణపూర్ గేట్లూ మూతపడటంతో జూరాలకు 43 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక తగ్గింది. దీంతో 2 గేట్ల నుంచి 16,138 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

జీవోలతో రాజకీయ పార్టీలు డ్రామాలు

జీవోలకు చట్టబద్ధత ఉండదు.. కోర్టులు కొట్టివేస్తాయి

» 42% రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలకు వెళ్లొద్దు

» 50% పరిమితి రాజ్యాంగంలో లేదు

» బీసీ సంఘాల సమావేశంలో వక్తలు

» బీసీ రిజర్వేషన్ల కోసం సాధన సమితి

» 24న ఇందిరాపార్కు వద్ద భారీ సభ



సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న జస్టిస్ వి.ఈశ్వరయ్య గౌడ్, టి.చిరంజీవులు, విశారదన్ మహరాజ్, బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, తదితరులు

పంజాగుట్ట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ పరమైన రక్షణలు ఏర్పాటు చేయకుండా జీవోలతో రాజకీయ పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయిని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య గౌడ్ అన్నారు. తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను తమిళనాడు తరహాలో రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, విద్యా, ఉద్యోగాల్లో కూడా బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం తన ముసాయిదా బిల్లులో పేర్కొన్నా.. దానిని అమలు చేయడం లేదన్నారు. తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన-ఉద్యమ కార్యాచరణ'పై సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ అధ్యక్షతన బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాలు, బీసీ మేధావుల ఫోరం తదితరులు 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం సాధన సమితిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సమితి ఆధ్వర్యంలో ఈ నెల 24న ఇందిరాపార్కు వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ టి.చిరంజీవులు మాట్లాడుతూ.. గతంలో చాలా రాష్ట్రాలు జీవోలతో రిజర్వేషన్లు తెచ్చే ప్రయత్నించినా.. కోర్టులు కొట్టివేశాయని, దీంతో 9వ షెడ్యూల్లో చేర్చడం ఒకటే దానికి పరిష్కార మార్గమన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు పోవద్దన్నారు. బీఆర్ఎస్‌కు అవకాశం ఉన్నా కూడా బీసీలకు రిజర్వేషన్ కల్పించలేదని విమర్శించారు. విశారదన్ మహరాజ్ జాజుల శ్రీనివాస్ గౌడ్ రేవంత్‌రెడ్డిని ప్రతి వారం ఢిల్లీకి తీసుకెళ్లాలని, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రధానితో మాట్లాడి తొమ్మితో షెడ్యూల్‌లో చేర్పించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని సమావేశంలో పాల్గొన్న వక్తలు అన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం కలిసి వచ్చే బీసీ, కుల సంఘాల నేతలనూ కలుపుకుని పోరాటం చేస్తామని తెలిపారు. తమ ఓటు తామే వేసుకుందామని ప్రతిజ్ఞ చేశారు.

స్టేకు నిరసనగా 15న రాస్తారోకో: బీసీ హక్కుల సాధన సమితి

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని బీసీ హక్కుల సాధన సమితి ఖండించింది. రాష్ట్రవ్యాప్తంగా అక్టోబరు 15న రాస్తారోకో చేపట్టాలని పిలుపునిచ్చింది. హైదరాబాద్‌లోని మఖ్దూమ్ భవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకటరాములు మాట్లాడుతూ హైకోర్టు స్టే ఎత్తి వేయాలని, కేంద్రం రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని సమితి తీర్మా నించినట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు బీసీ జేఏసీ 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో ఈనెల 18న తలపెట్టిన బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని తెలిపారు.



తెలంగాణ బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

బీసీలను రాజకీయంగా అణచివేతకు కుట్ర

నోటిఫికేషన్ వచ్చాక స్టే ఇవ్వడమేంటి

» 18న తెలంగాణ బంద్‌కు పిలుపు: కృష్ణయ్య

» బీసీని సీఎం చేయాలి: జాజుల శ్రీనివాస్ గౌడ్

గన్‌పార్క్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో సుప్రీం కోర్టు తీర్పు వెలువడి, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత కూడా స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపి వేస్తూ హైకోర్టు స్టే ఇవ్వడం కుట్రపూరితంగా బీసీలను రాజకీయంగా అణచివేయడమేనని బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన తెలంగాణ బంద్ పోస్టర్‌ను సోమవారం గన్‌పార్కులో విడుదల చేశారు. ఈ బంద్‌కు 30 బీసీ సంఘాలు, 25 కుల సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ, రాజ్యాంగంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం, అగ్ర వర్ణాల వారు కోర్టుకు వెళ్లి అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. బీసీలను అణచివేస్తే తిరుగుబాటు తప్పదని, వారికి మనుగడ ఉండదని హెచ్చరించారు. జేఏసీ కో చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, ప్రత్యేక రాష్ట్ర పోరాటంలో 1100 మంది బీసీలు ఆత్మబలిదానం చేసుకున్నారని గుర్తు చేశారు. బీసీ సీఎం కావాలని డిమాండ్ చేశారు. బీసీల ఆత్మగౌరవం ఎజెండాగా పోరాటం కొనసాగిస్తామన్నారు. బీసీల పట్ల కోర్టులు, ప్రభుత్వం, ప్రతిపక్షాలు అణచివేసే ధోరణి అవలంబిస్తున్నాయని జేఏసీ వైస్ చైర్మన్ వీజీఆర్ నారగోని మండిపడ్డారు.



డయాలసిస్‌లో ప్రమాణాలు పాటిస్తున్నాం

ఇన్ఫెక్షన్ నియంత్రణ అమలుపరుస్తున్నాం

రోగులకు వైరల్ మార్కర్ టెస్టులు చేస్తున్నాం

మణుగూరులో రోగులందరికీ హెచ్ఐవీ నెగెటివే

'ఆంధ్రజ్యోతి' కథనంపై ఆరోగ్యశ్రీ సీఈవో వివరణ

క్షేత్రస్థాయి పరిస్థితులతో కుదరని పొంతన

డాక్టర్ పర్యవేక్షణ లేదన్నది బహిరంగ రహస్యం

ఎలీసా పద్ధతిలో జరగని వైరల్ మార్కర్ టెస్టులు

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని డయాలసిస్ కేంద్రాల్లో అత్యున్నత స్థాయి ఇన్ఫెక్షన్ నియంత్రణ, రోగి భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో ఉదయకుమార్ తెలిపారు. ప్రతి డయాలసిస్ మధ్య స్టెరిలైజేషన్ చేస్తున్నామని, రోగులందరికీ త్రైమాసిక వైరల్ మార్కర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. డయాలసిస్ కేంద్రాలు నెఫ్రాలజిస్టులు, మైక్రో బయాలజిస్టుల పర్యవేక్షణలో పనిచేస్తున్నాయని, క్రమం తప్పకుండా ఆడిట్ చేస్తున్నామని పేర్కొన్నారు. 'రక్తశుద్ధికి వెళితే కొత్త రోగాలు' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై సీఈవో వివరణ ఇచ్చారు. మణుగూరు డయాలసిస్ కేంద్రంలో రక్తశుద్ధి చేయించుకుంటున్న వారికి హెచ్ఐవీ పరీక్షలు చేయిస్తే నెగెటివ్ వచ్చిందన్నారు. ఒక డయలైజర్‌ను ఒక్కరికే ఉపయోగిస్తున్నామని, రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఎక్కడా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఏటా 14 వేల మంది రోగులకు 11 లక్షలకు పైగా డయాలసిస్ సెషన్స్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అయితే.. ఆరోగ్యశ్రీ కార్యాలయం చెబుతున్నదానికి, క్షేత్రస్థాయికి ఎక్కడా పొంతన కుదరడం లేదు. గతంలో రక్తశుద్ధి కేంద్రాల్లో ఒక ఎంబీబీఎస్ వైద్యుడు ఉండి.. రౌండ్స్ వేసేవారు. ఇప్పుడు ఒక్క డాక్టర్ కూడా లేరన్నది బహిరంగ రహస్యం. డయాలసిస్ రోగులను డాక్టర్లే పర్యవేక్షించాల్సి ఉండగా.. దానిని పాటించడం లేదు. గతంలో ఆస్పత్రుల సూపరింటెండెంట్లు పర్యవేక్షించగా.. ప్రస్తుతం వారు పట్టించుకోవడం లేదు. ఇక వైరల్ మార్కర్ టెస్టులు చేస్తున్నట్లు ఆరోగ్యశ్రీ ట్రస్టు చెబుతున్నప్పటికీ... ఎలీసా టెస్టులు చేయడం లేదు. కేవలం స్ట్రిప్ టెస్టులే చేస్తున్నారు. గతంలో డయాలసిస్ రోగుల రక్త నమూనాలను ప్రైవేటు ల్యాబ్‌లకు పంపి టెస్టులు చేసేవారు. ప్రస్తుతం అదీ జరగడం లేదు. గతంలో ఒక్కో డయాలసిస్‌కు రూ.1250 ఉండగా ప్రస్తుతం దానిని రూ.1850కి పెంచినప్పటికీ... రోగులకు టీ, బిస్కెట్స్ లాంటి సర్వీసులను నిలిపివేశారు.

తగ్గుతున్న లబ్ధిదారుల సంఖ్య

» పక్కా రైతులకే పీఎం కిసాన్ నిధులు

» సర్కారు ఉద్యోగులు, నేతలు, ఐటీ చెల్లింపుదారులకు నో

» గతంలోనే నిబంధనలు కఠినతరం

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పీఎం-కిసాన్ పథకం నిబంధనల మేరకు గతంలోనే అనర్హులను ఏరివేసే ప్రక్రియ చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్నుదారులు, మేయర్లు, జడ్పీ చైర్మన్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర ప్రజాప్రతినిధులు, డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదులు, విశ్రాంత ఉద్యోగులను పథకం నుంచి తొలగించారు. దీంతో రాష్ట్రంలో లబ్ధిదారుల సంఖ్య కూడా తగ్గింది. తొలి విడత (2018 డిసెంబరు ఒకటి నుంచి 2019 మార్చి 31 వరకు)లో 26.61 లక్షల మంది రైతులు పీఎం-కిసాన్ పథకంలో లబ్ధిదారులుగా ఉన్నారు. కొందరు అందుబాటులో లేకపోవటం, కొందరికి అవగాహన లేక తొలివిడతలో ఎక్కువ మంది నమోదు చేసుకోలేదు. రెండో విడతలో పీఎం-కిసాన్ లబ్ధిదారుల సంఖ్య అమాంతం పెరిగింది. ఇక ఆతర్వాత నుంచి క్రమంగా లబ్ధిదారుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. 12 విడతలో 34.06 లక్షలు, 13 వ విడతలో 31.17 లక్షలు, 14వ విడతలో 30.36 లక్షలు, 15వ విడతలో 28.69 లక్షలు, 16 వ విడతలో 31.03 లక్షలు, 17వ విడతలో 30.90 లక్షలు, 18వ విడతలో 30.82 లక్షలు, 19వ విడతలో 31.19 లక్షలు, 20వ విడతలో 30.62 లక్షల మందికి పీఎం- కిసాన్ పెట్టుబడి సాయం అందింది. నిబంధనలు కాస్త కఠినతరం చేసినప్పటి నుంచి లబ్ధిదారుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. 19 విడతకు 20 విడతకు కూడా 57 వేల మంది లబ్ధిదారుల సంఖ్య తగ్గటం గమనార్హం.

కాంగ్రెస్ గుర్తుపై ఎంఐఎం అభ్యర్థి

420 కేసుల్లాగే అధికార పార్టీ హామీలు: రాంచందర్‌రావు

» అధిష్ఠానం అన్నీ గమనిస్తోందని..

బీజేపీ శ్రేణులకు లేఖ!



హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎంఐఎం అభ్యర్థి కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. తనకు కాంగ్రెస్ టిక్కెట్టు ఖరారు కాగానే సదరు అభ్యర్థి వెళ్లి మజ్లిస్ అధినేత ఒవైసీ ఆశీస్సులు తీసుకున్నారని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు మీడియా సమావేశంలో మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో ఎంఐఎం, కాంగ్రెస్ మధ్య బంధం స్పష్టంగా కనపడుతోందని ఆరోపించారు. 'ఒక్క ప్రభుత్వ కార్యాలయం కూడా లేని నియోజకవర్గం జూబ్లీహిల్స్. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి స్పష్టమైన ఉదాహరణ. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌ను విశ్వనగరంగా చేస్తామని చెప్పి విషాద నగరంగా మార్చింది. కాంగ్రెస్ గెలిచాక వంద రోజుల్లో హామీలు పూర్తి చేస్తామని చెప్పింది. ఆరు గ్యారంటీలు, 420 వాగ్దానాలు చేశారు. కానీ ఇంతవరకు నెరవేర్చలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడేదంతా 420 కేసుల్లానే మిగిలింది' అని మండిపడ్డారు. కాగా ఖమ్మం నుంచి డాక్టర్ కాసాని మారుతి గౌడ్, లండన్ నుంచి ఎన్నారై శశితో పాటు దేవరకొండ, నాగర్ కర్నూలు నియోజకవర్గాల నుంచి పలువురు కార్యకర్తలు బీజేపీలో చేరారు. మరోవైపు గీత దాటొద్దు.. అధిష్ఠానం అన్నీ గమనిస్తోందని రాంచందర్ రావు తమ పార్టీ నాయకులకు స్పష్టం చేశారు. ఏదైనా సమస్య ఉంటే అంతర్గత సమావేశాల్లో ప్రస్తావించాలి తప్ప బహిరంగ వేదికలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని తేల్చి చెప్పారు. ఈ మేరకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ పదాధికారులు, పలువురు నేతలకు ఈమేరకు లేఖ రాసినట్లు పార్టీవర్గాలు వెల్లడించాయి.

చిరంజీవితో ఆత్మీయ కలయిక

తన మనవరాలి కోరిక మేరకు తన కుటుంబ సభ్యులతో చిరంజీవి, నయనతారను షూటింగ్ స్పాట్‌లో కలవడం పట్ల రాంచందర్‌రావు సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సినీ విశేషాలు, సమకాలీన రాజకీయాలు, ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి అనేక ఆలోచనలు పంచుకున్నామని తెలిపారు.

జూబ్లీహిల్స్‌లో 20 వేల దొంగ ఓట్లు

» బీఆర్ఎస్‌ను ఓడించాలనే నమోదు

» జూబ్లీహిల్స్ దెబ్బకు 'ఢిల్లీ' అదిరిపడాలి

» ఇంటింటికీ వెళ్లి బాకీ కార్డులు పంచుదాం

» కారు కావాలా.. బుల్డోజరు రావాలా

» ప్రజలు ఆలోచించి ఓటేయాలి: కేటీఆర్

» దొంగ ఓట్లపై సీఈవోకు ఫిర్యాదు



సమావేశంలో మాగంటి సునీతతో మాట్లాడుతున్న హరీశ్, కేటీఆర్

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేయరని కాంగ్రెస్‌కు అర్థమైంది. మనల్ని ఓడించాలనే కాంగ్రెస్ ఒక్క ఇంట్లోనే 43 దొంగ ఓట్లు నమోదు చేయించింది. ఇలా వేల ఓట్లు చేర్పింది. జూబ్లీహిల్స్‌లో కొట్టే దెబ్బకు ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానం అదిరిపడాల'ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారని, నిజం, ధర్మం కూడా బీఆర్ఎస్ పక్షానే ఉన్నాయన్నారు. రహమత్‌నగర్ డివిజన్ పార్టీ కార్యకర్తల సమావేశంలో, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో)కి ఫిర్యాదు అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో 400 పోలింగ్ కేంద్రాల పరిధిలో 50-100 చొప్పున మొత్తం 20 వేల దొంగ ఓట్లను నమోదు చేయించినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ గురించి, రేవంత్ రెడ్డి గురించి హైదరాబాద్ ప్రజలకు బాగా తెలుసని, అందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కలేదని వ్యాఖ్యానించారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక కారుకు, బుల్డోజరుకు మధ్య జరుగుతోందని, ఎన్నిక తర్వాత మీ ఇంటికి కారు రావాలా, బుల్డోజరు రావాలా అనేది ప్రజలు ఆలోచించాలన్నారు. కారు రావాలంటే మాగంటి సునీతను గెలిపించాలని, ఇళ్లు కూలగొట్టడానికి హైడ్రా రావాలనుకుంటే కాంగ్రెస్‌కు ఓటేయండని సూచించారు. కేసీఆర్ ఉన్నప్పుడు నల్లా బిల్లు రాలేదని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత ముక్కు పిండి వసూలు చేస్తున్నారన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలైపోగానే ఉచిత మంచినీటి పథకం కూడా ఎత్తేస్తారని ఆరోపించారు.

రెండేళ్లలో అవినీతిమయం

రెండేళ్లలో రాష్ట్రం అవినీతి మయమైందని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శించారు. 'భవన నిర్మాణ అనుమతి కావాలంటే చదరపు అడుగుకు రూ.70కట్టాలంట. భూముల సమస్యల పరిష్కారం కావాలంటే 40 శాతం రాసివ్వాలంట.. ఇంతటి అవినీతి ఎక్కడా లేద'ని దుయ్యబట్టారు. ముస్లింలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, రంజాన్ తోఫా కూడా ఇవ్వలేదని విమర్శించారు. మంత్రి పదవి కాదు కదా.. కనీసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవి కూడా ఇవ్వలేదన్నారు. కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమయ్యారు.



ఓట్ చోరీ వ్యతిరేక ర్యాలీలో ప్రసంగిస్తున్న మంత్రి తుమ్మల

అధునాతన సాంకేతికతపై సర్కారు శిక్షణ

» ఖమ్మం ఏటీసీ ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల

ఖమ్మం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సాంకేతిక రంగంలో మార్పులకనుగుణంగా జిల్లా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తెలంగాణ విద్యార్థులకు అధునాతన సాంకేతిక నైపుణ్యంపై తమ సర్కారు శిక్షణనిస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థినీ విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం ఐటీఐలో నూతనంగా నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఐటీఐలో టాటా స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను సందర్శించిన తుమ్మల.. ఆయా కోర్సులతో ఉపాధి, ఉద్యోగావకాశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రపంచీకరణ మార్పులకనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ఏటీసీ కోర్సును డిజైన్ చేశారని తుమ్మల పేర్కొన్నారు.

ఓట్ చోరీకి వ్యతిరేకంగా లక్ష సంతకాల సేకరణ

ప్రజాస్వామ్యం బతకాలంటే ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల పేర్కొన్నారు. బీజేపీ ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఖమ్మంలో సోమవారం ఒక్కరోజే లక్ష మంది వద్ద సంతకాలు సేకరించారు. అనంతరం 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఒక్క రోజే లక్ష సంతకాలు సేకరించి రాష్ట్రంలోనే రికార్డు సృష్టించిన ఘనత ఖమ్మం కాంగ్రెస్ కార్యకర్తలదని కితాబిచ్చారు. దేశవ్యాప్తంగా సాగుతున్న ప్రజా ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పేదరిక నిర్మూలనలో టీజీఎల్‌పీ ఆదర్శంగా నిలవాలి

» బ్రాక్ సంస్థతో సమావేశంలో మంత్రి సీతక్క

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమ్మిళిత జీవనోపాధి కార్యక్రమం (టీజీఎల్‌పీ) దేశంలోనే ఒక ఆదర్శవంతమైన పేదరిక నిర్మూలన నమూనాగా నిలవాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. సోమవారం సచివాలయంలో అంతర్జాతీయ సంస్థ బ్రాక్ (బిల్డింగ్ రీసోర్సెస్ అక్రాస్ కమ్యూనిటీస్) ప్రతినిధుల బృందంతో జరిగిన సమావేశంలో ఆమె ఈ విషయాన్ని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని అత్యంత పేద కుటుంబాలను గుర్తించి, వారికి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడమే టీజీఎల్‌పీ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఐదు జిల్లాల పరిధిలోని ఎనిమిది మండలాల్లో టీజీఎల్‌పీ అమలవుతోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా బ్రాక్ సంస్థ సహకారంతో ఇప్పటివరకు 3,554 అత్యంత పేద కుటుంబాలను గుర్తించి, మహిళా సమాఖ్యల ద్వారా 108 మంది నిపుణులను నియమించి లబ్ధిదారులకు శిక్షణ అందిస్తున్నట్లు మంత్రి వివరించారు.

పూర్తిగా తగ్గుముఖం పట్టిన సీజనల్ వ్యాధులు

» ఆయా కేసులు తగ్గడం అభినందనీయం: మంత్రి దామోదర

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గతేడాదితో పోల్చితే ఈసారి సీజనల్ వ్యాధుల ప్రభావం తక్కువగా ఉండటం అభినందనీయమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖాన్ల పనితీరు, సీజనల్ వ్యాధుల నియంత్రణపై సోమవారం సచివాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. గత రెండేళ్లతో పోల్చితే, ఈ ఏడాది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర కేసులు గణనీయంగా తగ్గాయని హెల్త్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తూ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవీంద్ర నాయక్ మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మొత్తంగా చూసినప్పుడు కేసుల సంఖ్య తగ్గినప్పటికీ, గ్రేటర్ హైదరాబాద్, మరో నాలుగైదు జిల్లాల్లో స్వల్పంగా పెరిగాయన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

జూబ్లీహిల్స్‌లోనూ కాంగ్రెస్‌దే గెలుపు: అద్దంకి

» ఓటమి తప్పదని కేటీఆర్‌కు అర్థమైంది: బల్మూరి

హైదారబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఉప ఎన్నికలో ప్రజలు కాంగ్రెస్‌ను ఎలా గెలిపించారో.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ అలానే గెలిపిస్తారని ఆ పార్టీ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ధీమా వ్యక్తం చేశారు. హరీశ్‌రావు, కేటీఆర్‌లు ఎంత సెంటిమెంట్ రుద్దినా ఏ ఉపయోగం లేదన్నారు. బీఆర్ఎస్ బుల్డోజర్ పాలనను ప్రజలు కోరుకోవట్లేదని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్షం అటుంచి.. బీఆర్ఎస్ అసలు ఉనికిలోనే లేదన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమ పార్టీ గెలుస్తుందన్న భ్రమల్లో హరీశ్, కేటీఆర్‌లు ఉన్నారని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదని కేటీఆర్‌కు అర్థమైందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. అందుకే గెలవడం చేతకాక.. ఓటరు జాబితాలో అవకతవకలు జరిగాయని మాట్లాడుతున్నాడని ఓ ప్రకటనలో విమర్శించారు. కేటీఆర్ చెబుతున్న ఓటరు జాబితా 2023లోనే తయారైందని, అందులో ఏమైనా తప్పులుంటే ఈసీకి ఆధారాలు సమర్పిస్తే సరిపోతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉప ఎన్నికలు జరిగినప్పుడు ఆ పార్టీ ఎంతగా అధికార దుర్వినియోగానికి పాల్పడిందో అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. కాగా, ఇటీవల అస్వస్థతకు గురైన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్‌ను పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి పరామర్శించారు.

ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులపై సమీక్ష చెల్లదు

» మెమోలను కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన ప్రమోషన్లపై సమీక్ష చేసే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 2021 జూలై 24న జారీచేసిన మెమో నెంబర్ 73, 1356లను హైకోర్టు కొట్టివేసింది. ఎస్టీ వర్గానికి చెందిన ఉద్యోగులకు సీనియార్టీ ఆధారంగా ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాల్సి ఉండగా.. గతంలో ఇచ్చిన ప్రమోషన్లను నిలిపేయడం చెల్లదని పేర్కొంటూ సెక్రటేరియట్‌లో పనిచేస్తున్న జాయింట్ సెక్రటరీ ఎస్ లక్ష్మీబాయి సహా పలువురు సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. సరైన జీవోల ద్వారా ప్రమోషన్లు ఇచ్చారని, వాటిని మెమోల ద్వారా కదిలించడానికి అవకాశం లేదని తెలిపింది. అందువల్ల పిటిషనర్లకు సంబంధించిన మెమో 73, 1356ను కొట్టివేస్తున్నట్లు పేర్కొంది. పిటిషనర్ల ప్రమోషన్లను పునరుద్ధరించడంతోపాటు పర్యవసానంగా వచ్చే ఇతర ప్రయోజనాలు, సీనియార్టీ వర్తింపజేయాలని తీర్పు వెలువరించింది.

నవీన్ మిట్టల్‌పై ఎఫ్ఐఆర్‌కు ఆదేశాలివ్వండి

» హైకోర్టులో అప్పీల్

హైదారాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా నాగారంలోని భూముల వివాదంలో అప్పటి భూదాన్ యజ్ఞబోర్డు చైర్మన్‌గా పనిచేసిన ఐఏఎస్ నవీన్‌మిట్టల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో దస్తగిర్ షరీఫ్ అనే వ్యక్తి అప్పీల్ దాఖలు చేశారు. భూదాన్ భూములను అక్రమంగా బదిలీ చేసినందున నవీన్‌మిట్టల్‌పై ఆయన తొలుత మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంతో రంగారెడ్డి జిల్లా కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేశారు. దానిని ఆ కోర్టు కొట్టియడంతో హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం జస్టిస్ కే సుజన ధర్మాసనం విచారణ చేపట్టింది. సీనియర్ న్యాయవాది అందుబాటులో లేకపోవడంతో పూర్తిస్థాయి వాదనల కోసం విచారణ మంగళవారానికి వాయిదా పడింది. భూదాన్ భూముల అన్యాక్రాంతంపై ఇప్పటికే హైకోర్టులో వ్యాజ్యాలు ఉండడం గమనార్హం.

సుప్రీంలో సానుకూల తీర్పు వస్తుందని ఆశిస్తున్నాం

» 42% రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు..

» మంత్రుల మధ్య విభేదాలు చిన్న సమస్య

» టీపీసీసీ చీఫ్ మహేశ్.. ఖర్గేకు పరామర్శ

న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థలకు వెళ్లాలనే సంకల్పంతో ఉన్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసే విషయంలో ఇప్పటికే సీనియర్ న్యాయవాదులతో చర్చించామని చెప్పారు. న్యాయ నిపుణులు మరోసారి అన్నింటిని పరిశీలిస్తున్నారని తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సోమవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి మహేశ్ గౌడ్ పరామర్శించారు. అనంతరం తెలంగాణభవన్‌లోని శబరి బ్లాకులో మీడియాతో మాట్లాడారు. ఖర్గే పూర్తిగా కోలుకున్నారని, ఎంతో ఉత్సాహంగా మాట్లాడారని తెలిపారు. అలాగే, ఇటీవల రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలు, బీసీ రిజర్వేషన్ల అంశం, సుప్రీంకోర్టులో పిటిషన్ సహా అన్నింటిపై చర్చించామని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో హైకోర్టులో మాదిరే.. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు సైతం సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేసే అవకాశముందన్నారు.సుప్రీంకోర్టులో సానుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. మంత్రుల మధ్య విభేదాలు చిన్న సమస్యని, కాంగ్రెస్ కుటుంబంలో అంతరాలు ఏర్పడితే కూర్చుని మాట్లాడుకుంటామన్నారు.



ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో మహేశ్ గౌడ్

చిన్న, చిన్న విషయాల్లో సమాచార లోపంతోనే స్పర్థలు నెలకొంటున్నాయని, అన్నింటినీ సామరస్యంగా పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు.

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తులివ్వండి..

జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్ష పదవిని ఆశిస్తున్న పార్టీ సీనియర్ నాయకులు ఆయా జిల్లాల్లో పర్యటిస్తున్న ఏఐసీసీ పరిశీలకులను కలిసి దరఖాస్తులు ఇవ్వాలని మహేశ్‌గౌడ్ ఓ ప్రకటనలో సూచించారు. డీసీసీ అధ్యక్షుల ఎంపికలో ఏఐసీసీ నాయకత్వం కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందని, సమర్థ నాయకత్వానికే పట్టం కట్టనుందని వెల్లడించారు. ఇక ముందు డీసీసీ అధ్యక్షులు పార్టీలో ప్రత్యేక భూమికను పోషించనున్నారన్నారు. టీపీసీసీ, ఇతర ముఖ్య సమావేశాలకు వీరు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతారని.. వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలోనూ కీలక పాత్ర పోషించనున్నారని పేర్కొన్నారు.

సంక్షేమ హాస్టళ్లపై శ్రద్ధ పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)



సంక్షేమ హాస్టళ్లపై సమీక్షిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు అడ్లూరి, పొన్నం

సమకూర్చింది. హాస్టళ్లకు కేటాయించిన ఈ నిధులకు సంబంధించిన చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలు, విద్యా సంస్థలపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపున (ఫేషియల్ రికగ్నిషన్)కు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పూర్తి స్థాయి సమాచారంతోపాటు జవాబుదారీతనం ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను తెలుసుకునేందుకు యాప్‌ను ఉపయోగించాలని సూచించారు. సరైన పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

హాస్టళ్ల నిర్వహణ సమాచారం డాష్‌బోర్డులో..

హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో సక్రమంగా అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. హాస్టళ్లలోని సౌకర్యాలు, వాటి నిర్వహణపై పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలని చెప్పారు. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తరచూ హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లకు స్కాలర్‌షిప్‌లు, సిబ్బంది జీతాలు, డైట్ చార్జీలు, నిర్మాణ, ఇతర ఖర్చులు, బకాయిల చెల్లింపు, హాస్టళ్ల నిర్వహణకయ్యే నెలవారీ ఖర్చులు, బకాయిల చెల్లింపునకు అవసరమైన మొత్తానికి సంబంధించిన ప్రణాళికను సమర్పించాలని సీఎస్ రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్‌లకు సీఎం సూచించారు. హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి అవసరమైన రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. 24 గంటలూ ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హాట్‌లైన్ ఏర్పాటు చేయాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవడానికి ఎడ్‌టెక్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే సేవలను సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని, ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని చెప్పారు. వీటన్నింటికీ అవసరమైన యాప్‌లను రూపొందించాలన్నారు. సమీక్షకు ముందు సవ్యసాచి ఘోష్ హాస్టళ్లలోని పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు.

ప్రపంచ బ్యాంకు రుణానికి సర్కారు గ్రీన్‌సిగ్నల్!

» వైద్య రంగం బలోపేతం కోసం 4,150 కోట్ల రుణ సేకరణకు నిర్ణయం

రాష్ట్రంలో వైద్య రంగం బలోపేతం కోసం ప్రపంచ బ్యాంకు నుంచి రూ.4,150 కోట్ల రుణ సేకరణకు రంగం సిద్ధమైంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ఈనెల 16న మంత్రివర్గం ముందుకు రానున్నాయి. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ అధికారులు ఫైలును సిద్ధం చేశారు. దీనిని మంత్రివర్గంలో ఆమోదించి, కేంద్రానికి పంపుతారు. కేంద్రం అనుమతించాక ప్రతిపాదనలు ప్రపంచ బ్యాంకుకు వెళ్తాయి. దీనిపై ఇప్పటికే ప్రపంచ బ్యాంకుతో సంప్రదింపులు పూర్తయ్యాయి. రుణం మంజూరయ్యాక.. తొలి ఏడాది రూ.1,000 కోట్లు, తర్వాత ఐదేళ్లపాటు ఏటా రూ.630 కోట్ల చొప్పున నిధులను ప్రపంచ బ్యాంకు విడుదల చేస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. ఏటా ఆ రుణ వినియోగ నివేదికలను ప్రపంచ బ్యాంకుకు అందించాల్సి ఉంటుందని వెల్లడించాయి. ప్రపంచ బ్యాంకు రుణంతో చేపట్టే పనులపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఇప్పటికే సవివర ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్)ను సిద్ధం చేసింది. దీనికి 'తెలంగాణ స్ట్రాటజిక్ విజన్ ఫర్ అటైనింగ్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇన్ హెల్త్‌కేర్ (టీజీ-స్వస్థ్)'గా పేరు పెట్టారు. రుణ నిధుల్లో.. టిమ్స్, ఉస్మానియాలో ఆస్పత్రుల్లో పరికరాల కోసం రూ.1,719 కోట్లు, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల బలోపేతం కోసం రూ.1,043 కోట్లు, 74 ట్రామాకేర్ కేంద్రాల ఏర్పాటుకు రూ.408 కోట్లు, సమగ్ర మహిళా, కౌమార ఆరోగ్య సేవల కోసం రూ.343 కోట్లు, అత్యవసర సంరక్షణకు సిమ్యులేషన్, స్కిల్ ల్యాబ్స్ కోసం రూ.245 కోట్లు, కేన్సర్ డే కేర్ కేంద్రాలకు రూ.180 కోట్లు, డిజిటల్ హెల్త్ కార్డుల కోసం రూ.180 కోట్లు, వృద్ధుల సంరక్షణ, వైద్య సేవల కోసం రూ. 32 కోట్లు వ్యయం చేయనున్నారు.

సుప్రీంలో బీసీ పిటిషన్

(మొదటిపేజీ తరువాయి)



చర్చలు జరిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు జూమ్ ద్వారా వారితో మాట్లాడారు. సుప్రీంకోర్టులో ఏయే అంశాలను లేవనెత్తాలి? ఏ ప్రాతిపదికన ముందుకెళితే సానుకూలంగా తీర్పు వచ్చే అవకాశముంది? హైకోర్టు ఏ వాదనలను దృష్టిలో పెట్టుకుని జీవో 9పై స్టే విధించింది?.. వంటి అంశాలపై సుదీర్ఘంగా కసరత్తు చేశారు. సీనియర్ న్యాయవాది రవి వర్మ తుది పరిశీలన తర్వాత సోమవారం అర్ధరాత్రి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. గురు లేదా శుక్రవారాల్లోనే ఈ పిటిషన్‌పై విచారణ జరిగే అవకాశం ఉంది.

పూర్తిగా వాదనలు వినకుండానే స్టే..!

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోవాల్సిందేనన్న పట్టుదలతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం.. ప్రధానంగా హైకోర్టు తమ వాదనలు పూర్తిగా వినకుండానే స్టే విధించిందనే అంశంతోనే పిటిషన్ వేసినట్లు తెలిసింది. 'స్థానికంగా ఓబీసీల సమగ్ర వివరాలను సేకరించాం. అందుకు ప్రత్యేకంగా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. కమిషన్ అధ్యయనం తర్వాత రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించాం. కుల గణన సర్వే ప్రకారం రాష్ట్రంలో 56 శాతానికి పైగా బీసీలు ఉన్నారని తేలింది. జనాభా నిష్పత్తి ప్రకారమే వారికి 42 శాతం కేటాయించాలని నిర్ణయించాం. కానీ, హైకోర్టు స్టే ఇవ్వడం అత్యంత బాధాకరం. సుప్రీంకోర్టులో సానుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నాం. సుదీర్ఘ చర్చలు, పరిశీలనల తర్వాత సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాం' అని మహేశ్ గౌడ్ తెలిపారు.



ఐపీఎస్ పూరన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భట్టి, కాంగ్రెస్ నేతలు

ఐపీఎస్ పూరన్ ఆత్మహత్యకు బాధ్యులను అరెస్టు చేయాలి

» డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను ఇంకా కొనసాగించడం సిగ్గుచేటు

» పూరన్ కుటుంబ సభ్యులకు డిప్యూటీ సీఎం భట్టి పరామర్శ

» ఫోన్‌లో సీఎం రేవంత్ ఓదార్పు

హైదరాబాద్/న్యూఢిల్లీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య అత్యంత దారుణమని.. తనను తీవ్రంగా బాధించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సూసైడ్ నోట్‌లో బాధ్యులెవరో పేర్కొన్నప్పటికీ నిందితులపై చర్యలెందుకు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. పూరన్ ఆత్మహత్యకు కారణమైన శత్రుజీత్ కపూర్‌ను డీజీపీగా కొనసాగించడం సిగ్గుచేటని విమర్శించారు. సోమవారం చండీగఢ్‌కు వెళ్లి పూరన్ కుటుంబ సభ్యులను భట్టి పరామర్శించారు. పూరన్ భార్య, ఐఏఎస్ అధికారిణి అమ్నీత్‌ను సీఎం రేవంత్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. సీఎం కూడా వారిని పరామర్శించి, సంఘీభావం తెలిపారు. పూరన్ కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని రేవంత్, భట్టి భరోసానిచ్చారు. అనంతరం భట్టి అక్కడి మీడియాతో మాట్లాడారు. హరియాణా అదనపు డీజీగా పని చేసిన పూరన్.. అత్యంత ప్రతిష్ఠాత్మక 'రా' విభాగంలో కూడా సేవలందించారని తెలిపారు. ఉత్తమ సేవలకు రాష్ట్రపతి పతకాలను అందుకున్న ప్రతిభావంతుడని, అలాంటి గొప్ప అధికారి ఆత్మహత్య చేసుకుని చనిపోతే ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. హరియాణా, కేంద్రంలోనూ బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉందని, ఇకనైనా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా తమ రాజ్యాంగ బాధ్యతలు నిర్వర్తించాలని డిమాండ్ చేశారు. ఓ ఐపీఎస్ అధికారికే రక్షణ లేకపోతే, ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తన ఆత్మహత్యకు డీజీపీ శత్రుజీత్ కపూర్, ఎస్పీ నరేంద్ర బిజర్నియా వేధింపులే కారణమని మరణ వాంగ్మూలంలో స్పష్టంగా పేర్కొన్నారని, అయినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. నేటికీ శవపరీక్ష నిర్వహించలేదని, కనీసం.. తల్లికి, భార్యాపిల్లలకు పూరన్ మృతదేహాన్ని చూపించట్లేదని, ఇది అత్యంత అమానుషమని వ్యాఖ్యానించారు. ఇది ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘనేనన్నారు. పూరన్ మరణం ఆయన కుటుంబానికే కాదని, వ్యవస్థకే తీరని లోటని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. పూరన్ కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మేడారం టెండర్లపై అసత్య ప్రచారం

» 60-70 కోట్ల టెండర్లకు నా కంపెనీ ఆశపడదు!

» సురేఖ అక్కతో భేదాభిప్రాయాల్లేవు

» గిరిజనుల ఆలోచనలకు అనుగుణంగా మేడారం అభివృద్ధి

» రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



మేడారం మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న మంత్రులు పొంగులేటి, సీతక్క

ములుగు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతర పనుల టెండర్లపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని రాష్ట్ర రెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. రూ.60-70 కోట్ల టెండర్ల కోసం తన కంపెనీ తాపత్రయ పడదని స్పష్టం చేశారు. 'నేనేంటో తెలిసిన వారు తప్పుడు ప్రచారాలు చేయరు. ఒకవేళ చేసినా, నేను పట్టించుకోను' అని మంత్రి పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, కలెక్టర్ దివాకర్‌తో కలిసి సోమవారం ఆయన మేడారంలో పర్యటించారు. శాశ్వత అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం అధికారులతో మాస్టర్ ప్లాన్‌పై సమీక్షించారు. వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నారు. హరిత హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. దేవాదాయ శాఖ మంత్రి లేకుండా సమీక్ష ఎలా చేస్తారని ప్రశ్నించగా.. క్యాబినెట్ మంత్రులకు అనేక కార్యక్రమాలు ఉంటాయని పొంగులేటి చెప్పారు. మంత్రులకు ఒక రోజు వీలుంటే, మరో రోజు ఉండకపోవచ్చని అన్నారు. ఇదే చివరి సమీక్ష కాదని, ఇలాంటివి రాబోయే రోజుల్లో కనీసం 15 సార్లు నిర్వహిస్తామని తెలిపారు. ఒక్కోసారి తాను లేకున్నా సీతక్క, సురేఖ అక్క సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. అలాగే అడ్లూరి లక్ష్మణ్ కూడా హాజరవుతారని, వీలుంటే అందరం కలిసి వస్తామని పేర్కొన్నారు. మేడారం అభివృద్ధి అనేది దైవ కార్యమన్నారు. 'మీ సహచర మంత్రి మీపై ఫిర్యాదు చేశారా?' అని విలేకరులు ప్రశ్నించగా.. పొంగులేటి ఖండించారు. ఇది పూర్తిగా అవాస్తవమన్నారు. తన గురించి అందరికీ తెలుసని చెప్పారు. సీతక్క, సురేఖ అక్కలు సమ్మక్క-సారలమ్మ వంటి వారని కొనియాడారు.

సీఎం సూచనల మేరకు పనులు

సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు, ఆదివాసీల అభిప్రాయాల మేరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మంత్రి పొంగులేటి చెప్పారు. గిరిజనుల ఆలోచనలకు అనుగుణంగా మేడారంలో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ప్రస్తుతం చేపట్టిన పనులను 90 రోజుల్లో పూర్తిచేస్తామని తెలిపారు. మేడారంలో నిర్మాణాలు 200-300 ఏళ్ల వరకు ఉండేలా పనులు చేపడుతున్నామని చెప్పారు. రూ.211 కోట్ల నిధులు కేటాయించి మాస్టర్ ప్లాన్‌ను ఎంచుకున్నామన్నారు.



కిడ్నీ గ్రహీతలు, దాతలతో ముఖాముఖీ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, యశోద హాస్పిటల్స్‌గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్‌రావు, వైద్యులు

ప్రతి 10 మందిలో ఒకరికి కిడ్నీ వ్యాధి

అవయవ దానంపై అవగాహన పెరగాలి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాయదుర్గం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశంలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధుల భారం నానాటికి పెరుగుతుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి 10 మంది పెద్దవారిలో ఒకరు కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నట్లు తేలిందన్నారు. హైటెక్‌సిటీలో యశోద హాస్పటల్స్ ఆధ్వర్యంలో 36 నెలల్లో 300 మందికి విజయవంతంగా కిడ్నీ మార్పిడి చేశారు. ఈ సందర్భంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న వారితోపాటు కిడ్నీ దాతలతో జరిగిన సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. ప్రజల్లో అవయవ దానంపై మరింత అవగాహన పెరగాలని చెప్పారు. దీనికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు చొరవ తీసుకోవాలని హితవు పలికారు. నేటి జీవన విధానంతో పలువురు యువకులు కూడా కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చచేశారు. ప్రతి ఏటా సుమారు 6 లక్షల మంది కొత్త కిడ్నీ రోగులు.. డయాలసిస్ దశకు చేరుకుంటున్నారన్న గవర్నర్.. 300 మందికి విజయవంతంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసిన యశోదా హాస్పిటల్స్ వైద్యులను అభినందించారు. యశోదా హాస్పిటల్స్ గ్రూపు ఎండీ డాక్టర్ జీఎస్ రావు మాట్లాడుతూ దేశంలోని కిడ్నీ మార్పిడి ప్రముఖ కేంద్రాల్లో ఒకటిగా తమ సంస్థ అవతరించిందన్నారు. తమ ఆస్పత్రులన్నీ 3500కి పైగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తే.. హైటెక్ సిటీ యూనిట్ మూడేళ్లలో 300 శస్త్ర చికిత్సల మైలురాయిని చేరుకుందని చెప్పారు. ఆస్పత్రి సీనియర్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజశేఖర చక్రవర్తి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో జనాభాలో 20 శాతానికంటే ఎక్కువ మందిలో క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ) ప్రాబల్యం పెరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, కిడ్నీ మార్పిడి గ్రహీతలు, కిడ్నీ దాతలు పాల్గొన్నారు.

హంతకులు, ఫ్యాక్షనిస్టులు, సంచులు తీసుకునేటోళ్లను ఎలా చేర్చుకుంటారు?

» మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ చేరుతారన్న వార్తలపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలు

జడ్చర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): హంతకులు, ఫ్యాక్షనిస్టులు, సంచులు తీసుకునే వారితో పాటు కాంగ్రెస్‌కు వెన్నుపోటు పొడిచిన వారిని పార్టీలోకి తీసుకునేది లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టతతో ఉన్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ కాంగ్రెస్‌లో చేరుతున్నట్లుగా వస్తున్న ఊహాగానాలపై ఆయన స్పందించారు. సర్పంచ్ పదవి కోసం తమ్ముడిని చంపిన వారు రేపు తననూ చంపొచ్చేమోనన్న అనుమానం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహబూబ్‌నగర్ జడ్పీ చైర్‌పర్సన్‌కు బీసీ మహిళకు రిజర్వేషన్ వచ్చిందన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్ మండలానికి చెందిన పార్టీ నాయకుడి భార్యకు అవకాశం ఇవ్వాలని జిల్లా ఎమ్మెల్యేలమంతా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ అంశంలో ఎవరో వస్తున్నారంటూ, వారికే కేటాయిస్తారంటూ ప్రచారం జరిగిందని, అయితే పార్టీలో ఎలాంటి చర్చ జరగలేదని వెల్లడించారు. సోమవారం జడ్చర్లలో వరద నీటి కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ, ఖమ్మం జిల్లాల కంటే మహబూబ్‌నగర్‌కు అధిక నిధులివ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఆ జిల్లాల కంటే పాలమూరు జిల్లాలోనే ఎక్కువ మంది ఎమ్మెల్యేలం ఉన్నామని, వెనుకబడిన ప్రాంతం కాబట్టి అధిక నిధులు అవసరమని చెప్పారు. పాలమూరు జిల్లాకు యేడాదికి రూ.20 వేల కోట్లు ఇస్తామని గతంలో సీఎం హామీ కూడా ఇచ్చారని గుర్తు చేశారు.



గాయని మధుప్రియకు జానపద అవార్డును ప్రదానం చేస్తున్న జస్టిస్ సూరేపల్లి నంద, చిత్రంలో సుద్దాల అశోక్ తేజ తదితరులు

సామూహిక చైతన్య సాధనాలే కళలు, సాహిత్యం

- తెలంగాణ హైకోర్టు జస్టిస్ సూరేపల్లి నంద వ్యాఖ్య
- సుద్దాల జానకమ్మ హనుమంతు పురస్కారాల ప్రదానోత్సవం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రజాస్వామిక వాతావరణాన్ని పెంపొందించడానికి సాహిత్యం, కళలు ఎంతగానో తోడ్పడతాయని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద చెప్పారు. సాహిత్యం, కళలు సామూహిక చైతన్య సాధనాలుగా సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించడానికి ముఖ్య భూమికగా నిలుస్తాయన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సుద్దాల జానకమ్మ హనుమంతు సాహితీ-జానపద-నృత్య పురస్కారాల ప్రదానోత్సవంలో జస్టిస్ సూరేపల్లి నంద పాల్గొని ప్రసంగించారు. స్త్రీవాద రచయిత్రి ఓల్గాకు సుద్దాల జానకమ్మ సాహితీ పురస్కారాన్ని, గాయని మధుప్రియకు సుద్దాల హనుమంతు జానపద అవార్డును, కూచిపూడి నర్తకి లాలీనిధికి నృత్య పురస్కారం అందజేశారు. ఈ ఏడాది నుంచి తన మాతృమూర్తి సుద్దాల జానకమ్మ స్మారకంగా సాహితీ పురస్కారాన్ని ప్రారంభించినట్లు సుద్దాల ఫౌండేషన్ నిర్వాహకుడు సుద్దాల అశోక్ తేజ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మధుప్రియ పాటలు, లాలీ నిధి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

ఏఐతో క్రీడాకారుల నైపుణ్యాల అంచనా, శిక్షణ

- మాదాపూర్‌లోని టీ-హబ్‌లో 'స్వింక్ ప్రో' ప్రారంభం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల శారీరక సామర్థ్యాన్ని, నైపుణ్యాలను ఏఐ సాయంతో అంచనా వేయడం, శిక్షణనివ్వడం, వారి మానసిక స్థితి, గాయాలైనప్పుడు శరీరంలో కలిగే ఇబ్బందులను ఏఐతోనే విశ్లేషించే విధంగా మాదాపూర్‌లోని టీ-హబ్ భారతదేశపు మొట్టమొదటి స్పోర్ట్స్ ఏఐ ప్లాట్‌ఫామ్ 'స్వింక్ ప్రో'ను ప్రారంభించింది. సోమవారం టీ-హబ్‌లో నేషనల్ బాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్, తెలంగాణ ప్రభుత్వ ఐటీ శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేశ్ రంజన్, రిలయన్స్ జియో చీఫ్ డాటా సైంటిస్ట్ శైలేశ్ కుమార్ దీనిని ఆవిష్కరించారు. టీ-హబ్ ఆధ్వర్యంలోని మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీ హబ్ (మాథ్)దీన్ని రూపొందించింది. ఈ సందర్భంగా స్వింక్ ప్రో ఏఐ సీఈవో మోహిత్ మాథుర్ మాట్లాడుతూ.. ఆటగాళ్ల శిక్షణ, ఆరోగ్యానికి సంబంధించిన పాయింట్లు స్వింక్ ప్రో స్ర్కీన్‌పై స్కోరు బోర్డులను మించి ఉండాలన్నారు. ప్రతి క్రీడాకారుడు మరింత చురుగ్గా ఆలోచించడానికి ఇది దోహదపడుతుందన్నారు.

ఎక్సైజ్ శాఖలో 97 మంది కొత్త ఎస్సైలు

హైదరాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో గ్రూప్-2 పరీక్షల ద్వారా ఎంపికైన 97 మంది సబ్ ఇన్‌స్పెక్టర్ల (ఎస్సై) సర్టిఫికెట్లను సోమవారం పరిశీలించారు. గ్రూప్-2 ద్వారా ఎంపికైన 97 మంది ఎస్సైలను 2 ప్రధాన జోన్లకు కేటాయించారు. వరంగల్ మల్టీ జోన్-1కు 63 మంది, హైదరాబాద్ మల్టీజోన్-2కు 34 మంది ఎస్సైలను కేటాయించారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన నేపథ్యంలో 97 మంది ఎస్సైలకు త్వరలో ఎక్సైజ్ ట్రైనింగ్ సెంటర్‌లో 3 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. వీరికి అదనంగా గ్రూప్-1 ద్వారా ఎంపికైన 30 మంది ఎక్సైజ్ అధికారులకూ ఇదే సమయంలో శిక్షణ ఇవ్వనున్నారు.

ఎన్‌వోసీలు లేని చోటికి ఆ ఇంజనీర్ల బదిలీ!

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాలకు నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీ) ఇచ్చేందుకు భారీగా వసూలు చేస్తున్నారన్న అభియోగాలు ఎదుర్కొంటున్న ఇంజనీర్లపై ప్రభుత్వం బదిలీ వేటుకు సిద్ధమైంది. హైదరాబాద్ సీఈ పరిధిలో 60 మంది దాకా అసిస్టెంట్ ఇంజనీర్లు(ఏఈ)/అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ)ల నుంచి సూపరింటెండెంట్ ఇంజనీర్ల(ఎస్‌ఈ) వరకు బదిలీ చేసే ఫైలు ప్రభుత్వానికి చేరింది. తొలిదశలో రెండేళ్ల అంతకు మించి పనిచేస్తున్న వారిని బదిలీ చేసి, మలి దశలో అవినీతి ఆరోపణలు ఉన్నవారిని బదిలీ చేయనున్నారు. వీరిని అసలు ఎన్‌వోసీలు జారీ చేయని కామారెడ్డి, సూర్యాపేట ప్రాదేశిక సీఈ ప్రాంతాల్లో పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఈమేరకు మంగళవారం బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయి.

ఆ ఇద్దరు సీఈల పొడిగింపునకు ఆర్థిక శాఖ నో

నీటి పారుదలశాఖలో పదవీ విరమణ చేసిన ఇద్దరు చీఫ్ ఇంజనీర్ల(సీఈ) సర్వీసు పొడిగింపు ప్రతిపాదనల ఫైలును ఆర్థిక శాఖ తిరస్కరించింది. కొత్తగూడెం సీఈగా పనిచేసిన ఎ.శ్రీనివాస్‌రెడ్డి, గజ్వేల్ సీఈగా పనిచేసిన శ్రీనివాస్ ఫైలును ప్రభుత్వం ఆర్థిక శాఖ పరిశీలనకు పంపింది. పదవీ విరమణ చేసిన వారిని కొనసాగించడానికి మార్గదర్శకాలు లేనందున పొడిగింపుపై నిర్ణయం తీసుకోలేమంటూ సోమవారం ఫైలును తిప్పిపంపింది. దాంతో ఈ ఫైలును సీఎం కార్యాలయానికి పంపాలా? పక్కనపెట్టాలా? అన్న దానిపై ఉన్నతస్థాయి ఆదేశాల ఆధారంగా నీటిపారుదలశాఖ నిర్ణయం తీసుకోనుంది.

నేడే గూగుల్‌తో ఒప్పందం

- ఏఐ సిటీగా మారనున్న వైజాగ్!

న్యూఢిల్లీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మలుపుతిప్పే అతిపెద్ద ప్రాజెక్టుకు మంగళవారం ఢిల్లీలో అవగాహన ఒప్పందం కుదరనుంది. విశాఖపట్నంలో రూ.88,628 కోట్ల (పది బిలియన్ డాలర్ల)తో గూగుల్ 1 గిగావాట్ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్‌తో ఎంఓయూ కుదరనుంది. దేశంలోనే తొలి కృత్రిమ మేధస్సు కేంద్రం ఏర్పాటుకు "గూగుల్ ఏఐ హబ్" పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో శ్రీకారం చుట్టనుంది. ఢిల్లీలోని తాజ్‌మాన్‌సింగ్ హోటల్‌లో ఉదయం 10గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ సమక్షంలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధులు, గూగుల్ ఉన్నతస్థాయి బృందం ఎంఓయూపై సంతకాలు చేయనున్నారు. ఇది దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)గా రికార్డు సృష్టించబోతోంది. రాష్ట్రచరిత్రలో మైలురాయిగా నిలువబోతోంది. ఏపీని ఏఐ ఆధారిత ఆవిష్కరణలు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో దేశంలోనే అగ్రగామిగా నిలపడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. మంత్రి లోకేశ్ గతేడాది అక్టోబరు 31వ తేదీన అమెరికా పర్యటన సందర్భంగా శాన్ ఫ్రాన్సిస్కోలో గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్‌తో జరిపిన చర్చల్లో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏఐ ఎకో సిస్టమ్ ఏర్పాటు చేయడంపై చర్చించారు. ఆ తర్వాత గూగుల్ ప్రతినిధులతో పలుదఫాలుగా జరిగిన చర్చలు కార్యరూపం దాల్చాయి.

బాబోయ్.. కిడ్నీ, క్యాన్సర్ కేసులు!

(మొదటిపేజీ తరువాయి)



వైద్య శాఖ విశ్లేషించింది. అందులో అత్యధికంగా నమోదయ్యే 10 కేసులను తీసుకోగా.. మొదటి స్థానంలో కిడ్నీ, రెండో స్థానంలో క్యాన్సర్ కేసులు ఉన్నాయి. ఆ తర్వాత వరసగా ఆర్థోపెడిక్, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, ఆప్తమాలజీ, న్యూరోసైన్స్, జనరల్ సర్జరీ, పిడియాట్రిక్స్, గైనకాలజీ, ఈఎన్‌టీ కేసులు ఉన్నాయి. రాష్ట్రంలోని బోధనాస్పత్రుల్లో అత్యధికంగా అవసరమయ్యే సూపర్ స్పెషాలిటీ విభాగాలు ఇవేనని వైద్యశాఖ గుర్తించింది. 2020-25 మధ్య కాలంలో రాష్ట్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం అత్యధికంగా 3,63,197 కిడ్నీ సంబంధిత కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాతి స్థానాల్లో ఆంకాలజీ 3,06,702; ఆర్థోపెడిక్ 1,91,852; కార్డియాలజీ 1,45,814 కేసులు ఉన్నాయి. దీంతో ఈ నాలుగు విభాగాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. కేసులు ఎక్కువగా నమోదయ్యే విభాగాలను గుర్తించి, వాటిని బలోపేతం చేయడం వల్ల రోగులపై ఆర్థిక భారం తగ్గుతుంది. వీటితో పాటు జనరల్ మెడిసిన్ (73,697), ఆప్తమాలజీ (57,639), న్యూరో (40,667), జనరల్ సర్జరీ (31,214), పిడియాట్రిక్(28,924), గైనకాలజీ(9,517) విభాగాల్లోనూ ఎక్కువగా కేసులు నమోదవుతున్నందున, వీటిని కూడా బలోపేతం చేయాలని వైద్య శాఖ భావిస్తోంది.

ప్రత్యేక కార్యాచరణ ఇలా..

నెఫ్రాలజీ: కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి 25 కిలోమీటర్లకు ఒక డయాలసిస్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. రాష్ట్రవ్యాప్తంగా వాటి సంఖ్యను పెంచనుంది. కిడ్నీ మార్పిడి సౌకర్యాలను జిల్లా ఆస్పత్రుల్లో ఏర్పాటుచేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

ఆంకాలజీ: గ్రామీణ స్థాయిలో క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సలు అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు. కీమో, రేడియో థెరపీ వంటి చికిత్సలను జిల్లా కేంద్రాల్లో అందుబాటులోకి తేవడం ద్వారా రోగులు హైదరాబాద్‌కు వెళ్లే భారాన్ని తగ్గించనున్నారు.

ఆర్థోపెడిక్: రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ఆత్మహత్యాయత్నం కేసులూ ఎక్కువ అవుతున్నాయి. అలాగే, ఎముకల వ్యాధుల బారిన పడేవారికి మెరుగైన చికిత్స అందించాల్సి వస్తోంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 74 ట్రామాకేర్ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది.

కార్డియాలజీ: గుండె జబ్బుల నిర్ధారణ, చికిత్స కోసం జిల్లా ఆస్పత్రుల్లో క్యాథ్‌ల్యాబ్స్ వంటి అధునాతన సౌకర్యాలను ఏర్పాటు చేసే ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ విభాగాల బలోపేతం కోసం ప్రపంచ బ్యాంకు నుంచి తీసుకునే రుణాన్ని వినియోగించనున్నట్లు వైద్యవర్గాలు పేర్కొన్నాయి.

సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్ల పెంపు?

రాష్ట్రంలో ఎక్కువగా నమోదయ్యే కేసులేంటనేది తేలడంతో ఆ విభాగపు సూపర్ స్పెషాలిటీ సీట్ల సంఖ్యను పెంచాలని సర్కారు నిర్ణయించింది. ప్రస్తుతం తెలంగాణలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 165 సూపర్ స్పెషాలిటీ సీట్లు ఉండగా, ప్రైవేటులో 38 మాత్రమే ఉన్నాయి. దీంతో సర్కారీ కళాశాలల్లో సూపర్ స్పెషాలిటీ సీట్ల పెంపు కోసం జాతీయ వైద్య కమిషన్‌కు లేఖ రాయాలని సర్కారు భావిస్తోంది. ముఖ్యంగా జిల్లాల్లోని బోధనాస్పత్రుల్లో ఈ సీట్ల సంఖ్యను పెంచే దిశగా ప్రయత్నిస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి వస్తుందని భావిస్తోంది. మెడికోలకు హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ పీజీ సీట్లు ప్రస్తుతం మనదగ్గర 8 ఉన్నాయి. వాటిని కూడా పెంచే దిశగా సర్కారు చర్యలు తీసుకుంటోంది. అవి పెరిగితే ఆస్పత్రి పాలనా బాధ్యతలను అడ్మినిస్ట్రేషన్ పీజీ చేసిన మెడికోలకు అప్పగించవచ్చని యోచిస్తోంది.

ప్రాణహిత-చేవెళ్ల డీపీఆర్ కోసం టెండర్లు పిలవండి

- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీ కోసం టెండర్లు పిలవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ప్రాజెక్టు పనుల పునః ప్రారంభంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నుంచి 71.5 కి.మీ. మైలారం దాకా గ్రావిటీతో నీటిని తరలించే వ్యవస్థలు సిద్ధంగా ఉన్నాయని, అక్కడి నుంచి పంప్‌హౌస్ కట్టి నేరుగా శ్రీపాద ఎల్లంపల్లిలో నీరు వేయొచ్చని, మరో విధానంలో మైలారం నుంచి టన్నెల్ తవ్వి... నేరుగా సుందిళ్లలో గ్రావిటీతో నీటిని వేయడానికి అవకాశం ఉంటుందని అధికారులు మంత్రికి నివేదించారు. సుందిళ్ల వద్ద పంప్‌హౌస్ సిద్ధంగా ఉన్నందువల్ల శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని పంపింగ్ చేసుకునే వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నారు. అయితే, మైలారం నుంచి సుందిళ్లకు నీటిని తరలించ డానికి అవసరమైన టన్నెల్ కోసం కేంద్ర అటవీ, వాతావరణ పర్యావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నిపుణుల మదింపు కమిటీ(ఈఏసీ) నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని గుర్తు చేశారు. దాంతో రెండు అలైన్‌మెంట్‌లతో డీపీఆర్ సిద్ధం చేయించాలన్నారు. ఏ అలైన్‌మెంట్‌తో తక్కువ ఖర్చుతో నీటిని తరలించవచ్చో... దాన్నే ఎంచుకోవాలని సూచించారు. నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సలహాదారుడు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, అంతరాష్ట్ర చీఫ్ ఇంజనీర్ (సీఈ) కె.ప్రసాద్ సమావేశంలో పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. తొలిరోజు 10 నామినేషన్లు

- క్యాబినెట్‌లో గిరిజనులకు స్థానం కల్పించాలనే డిమాండ్‌తో సూర్యాపేట జిల్లా వాసి పోటీ

హైదరాబాద్ సిటీ, మఠంపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదలైన తొలిరోజు సోమవారం 10 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వీరిలో రెండు రిజిస్టర్ పార్టీలకు చెందిన అభ్యర్థులు, 8 మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. తెలంగాణ పునర్ నిర్మాణ సమితి తరపున పూస శ్రీనివాస్, నవతరం పార్టీ నుంచి అర్వపల్లి శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా సిలివేరు శ్రీకాంత్, పెసరకాయల పరీక్షిత్ రెడ్డి, చలిక చంద్రశేఖర్, సపవత్ సుమన్, వేముల విక్రమ్ రెడ్డి, ఇబ్రహీం ఖాన్, సయ్యద్ ముస్తఫా హుస్సేన్, సల్మాన్ ఖాన్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. కాగా క్యాబినెట్‌లో గిరిజనులకు స్థానం కల్పించాలనే డిమాండ్‌తో, పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారనే డిమాండ్‌తో సూర్యాపేట జిల్లా మఠంపల్లికి చెందిన సుమాన్ నాయక్ పోటీస్తున్నారు. 2019 ఎన్నికల్లో హుజూర్‌నగర్ ఉప ఎన్నికలోనూ సుమన్‌నాయక్ పోటీ చేయగా 2,697 ఓట్లు వచ్చాయి. ఇక.. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలకు కొన్నిగంటల ముందు షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా ఈసీఐ నిబంధనలకు లోబడి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి నామినేషన్ల స్వీకరణకు సర్వ సన్నద్ధంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి పి.సాయిరాంకు సూచించారు.

అవును.. ఆ ఇంట్లో 43 ఓట్లున్నాయ్

- అది బహుళ అంతస్తుల భవనం
- ప్రస్తుతం నలుగురు అక్కడే ఉన్నారు
- 39 మంది ఇళ్లు ఖాళీ చేసి వెళ్లారు
- ఆ ఓట్లన్నీ గతం నుంచే ఉన్నాయి
- ఎన్నికల అధికారి ప్రేమ్ కుమార్

యూసుఫ్‌గూడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఒకే ఇంట్లో 43 మంది ఓటర్లు నమోదై ఉన్నారన్న కథనాలపై ఎన్నికల అధికారులు విచారణ జరిపారు. సోషల్ మీడియా, వివిధ పత్రికల్లో ప్రచురితమైన కథనాలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఖైరతాబాద్ తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ సోమవారం ఆ ఇంటిని పరిశీలించారు. బీఎల్‌వోలతో కలిసి ఆ బహుళ అంతస్తుల ఇంటికి వెళ్లి విచారణ జరిపారు. యూసుఫ్‌గూడ డివిజన్ కృష్ణానగర్‌లో బూత్ నంబర్ 264లోని ఇంటి నంబర్ 8-3-23/బి/160లో 43 మంది ఓటర్లు ఉన్నారని స్పష్టం చేశారు. ఒకే ఇంట్లో 43 ఓట్లు ఉన్నాయంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కూడా వారు ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. ఈ ఓటర్లు 20 ఏళ్లగా కృష్ణానగర్‌లోనే ఉంటున్నట్లు తెలిపారు. 43 మంది ఓటర్లలో ప్రస్తుతం నలుగురు అదే ఇంట్లో ఉన్నారన్నారు. మిగిలిన 39 మంది ఓటర్లు చిత్ర పరిశ్రమలో పనిచేసే కార్మికులని చెప్పారు. ఆ బహుళ అంతస్తుల భవనంలో కొన్ని నిర్మాణ పనులు జరుగుతుండడంతో వారు ఖాళీ చేసి మరోచోటుకు వెళ్లారని వివరించారు. ప్రస్తుతం వారు నివసిస్తున్న చోట ఓటు నమోదు చేసుకున్నారా..? అనే కోణంలోనూ విచారణ చేపట్టామని తెలిపారు.

పునరుద్ధరణ డిజైన్లు మేం ఇస్తాం

- కాళేశ్వరం బ్యారేజీలపై ముందుకొచ్చిన ఐఐటీలు
- నిస్పాన్, ఆర్వీ అసోసియేట్స్, స్పెయిన్ సంస్థ కూడా

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు డిజైన్లతోపాటు సమగ్ర పునరుద్ధరణ ప్రణాళికను అందించడానికి మద్రాస్, రూర్కీ, హైదరాబాద్ ఐఐటీలు ముందుకొచ్చాయి. వాటితోపాటు నిస్పాన్, ఆర్వీ అసోసియేట్స్, స్పెయిన్‌కు చెందిన సంస్థ కూడా ఇందుకు ఆసక్తి కనబరిచింది. ప్రధానంగా 14 మీటర్ల ఎత్తు బ్యారేజీల నిర్మాణానికి సహకారం అందించిన సంస్థలు కావాలని ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)ను ఆహ్వానిస్తూ నీటిపారుదల శాఖ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే దీనిని సవరించాలని, 7.5 మీటర్లకు కుదించాలని కోరుతూ ఆయా సంస్థలు నివేదించాయి. కాగా, సోమవారం నీటిపారుదల శాఖ కార్యాలయంలో టెక్నికల్ ప్రీ బిడ్ సమావేశం జరిగింది. మూడు ఐఐటీలు, స్పెయిన్ సంస్థ, నిస్పాన్, ఆర్వీ అసోసియేట్ ఆసక్తి చూపడంతోపాటు మరో వారం గడువు పెంచాలని కోరడంతో వీరి విజ్ఞప్తిని అధికారులు మన్నించే అవకాశాలున్నాయి. బ్యారేజీల పునరుద్ధరణకు జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ చేసిన సిఫారసుల నివేదికను వీరికి అందించనున్నారు. బ్యారేజీ పటిష్టతపై మదింపు, హైడ్రాలజీ, హైడ్రాలిక్ రివ్యూ, వరదలు/భూకంపాలు వంటి విపత్తులను ఎదుర్కోవడంలో బ్యారేజీల సామర్థ్యంపై మదింపు, గేట్లు/పియర్లు/సిల్లింగ్ బేసిన్/కటాఫ్ వాల్స్ వంటి బ్యారేజీలోని కీలక విభాగాలను పటిష్ఠం చేసేందుకు డిజైన్లు అందించడం వంటి సేవలను అందించాలని ప్రభుత్వం కోరింది. బ్యారేజీల ప్రస్తుత డిజైన్లతోపాటు ఎన్‌డీఎస్ఏ నివేదికల్లోని సిఫారసులను పునఃసమీక్షించాలని పేర్కొంది. ఈ క్రమంలో అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి జియో టెక్నికల్, జియో ఫిజికల్ వంటి పరీక్షలు పరిశీలించాలని సూచించింది. ఈ పరీక్షల ద్వారా బ్యారేజీలలో అన్నిరకాల లోపాలను గుర్తించాలని కోరింది. ఎన్‌డీఎస్ఏ సిఫారసుల మేరకు మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకును పటిష్ఠం చేయడం లేదా సురక్షితంగా తొలగించే అంశంపై అధ్యయనం జరిపి తగిన పరిష్కారాలను సూచించాలని తెలిపింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న ఇతర బ్లాక్‌లకు ఎలాంటి నష్టం జరగకుండా 7వ బ్లాక్‌ను తొలగించేలా ఈ పరిష్కారాలు ఉండాలని షరతు విధించింది. ఇక 15 ఏళ్ల కాలంలో తేలియాడే పునాదుల (పర్మియబుల్ ఫౌండేషన్)తో కూడిన బ్యారేజీల డిజైన్లతోపాటు పునరుద్ధరణ పనుల్లో, అందులోనూ సీకెంట్ పైల్స్ కటాఫ్‌ల పనుల్లో అనుభవం ఉండాలని గుర్తుచేసింది. ఇక ఎంపికైన సంస్థ అందించే డిజైన్లు, డ్రాయింగ్స్‌ను కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ఆమోదం కోసం పంపించనున్నారు. అయితే కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో ఐఐటీ-రూర్కీ సాంకేతిక సహాయం అందించినందున.. ఈసారి ఆ సంస్థ తప్ప మిగతా సంస్థల సహకారం ప్రభుత్వం తీసుకునే అవకాశాలున్నాయి.

మాజీ ఈఎన్‌సీ హరిరామ్ ఆస్తుల జప్తు

(మొదటిపేజీ తరువాయి)

ఆధారంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌కు ఏసీబీ లేఖ రాయనుంది. అనంతరం హరిరామ్ ఆస్తుల క్రయవిక్రయాలను కట్టడి చేయనున్నారు. ఈ కేసు నుంచి బయటపడితే.. ఆస్తుల క్రయవిక్రయాలపై హరిరామ్‌కు అధికారం వస్తుంది. ఇక 2024 ఏప్రిల్‌లో హరిరామ్ నివాసం, జలసౌధలోని కార్యాలయం సహా మొత్తం 14 చోట్ల ఏసీబీ సోదాలు నిర్వహించింది.

హరిరామ్ ఆధ్వర్యంలో 3 లింకుల పనులు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం రూ.1.47 లక్షల కోట్లు కాగా, అందులో రూ.48,665 కోట్ల అంచనా వ్యయం కలిగిన పనులు హరిరామ్ పర్యవేక్షణలో జరిగాయి. కాళేశ్వరం ప్రాజెక్టును ఏడు లింక్‌లు, 28 ప్యాకేజీలుగా విభజించి చేపట్టారు. లింకులు-4, 5, 6 పరిధిలోని ప్యాకేజీలు 10 నుంచి 19 కిందికి వచ్చే పనులను హరిరామ్ చేయించారు. వాస్తవానికి ఈ మూడు లింకుల కింద వచ్చే పనుల అంచనా వ్యయం రూ.41,568.39 కోట్లే కాగా, తర్వాత అది రూ.48,665.54 కోట్లకు పెరిగింది. ఈ లింకుల పరిధిలోకి రాని ఇతర పనులను సైతం హరిరామ్ పర్యవేక్షించారు. ఇక ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిందితుడైన మరో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) నికేశ్‌కుమార్ ఆస్తులను కూడా జప్తు చేస్తూ నీటిపారుదల శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో రికార్డుల ప్రకారం ఆస్తుల విలువ రూ.17.73 కోట్లుగా ఉన్నప్పటికీ బహిరంగ మార్కెట్‌లో అది రూ.100 కోట్లపైనే ఉంటుందని తేల్చారు. ఒక సీఈ(చీఫ్ ఇంజనీర్)కి బినామీ ఆస్తులుగా వీటిని గుర్తించారు. ఇక ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మరో నిందితుడైన మాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) నూనె శ్రీధర్ ఫైలు సోమవారం విజిలెన్స్ కమిషన్‌కు చేరింది. ఆయనపై చర్యలు తీసుకోవడానికి అనుమతించాలని కోరుతూ ఫైలును విజిలెన్స్ కమిషన్‌కు పంపించారు.

వేరుశనగ రైతులకు ఉచిత విత్తనాలు

అధిక దిగుబడినిచ్చే 3 వంగడాల ఎంపిక.. లబ్ధిదారుల ఎంపిక బాధ్యత ఎఫ్‌పీవోలకు

- 8 జిల్లాల్లో 45 వేల ఎకరాలకు విత్తనాలు
- లేపాక్షి, గిర్నార్- 5, జీజేజీ- 32 పంపిణీ
- నేడు 'రైతునేస్తం'లో పంపిణీకి శ్రీకారం



హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ రైతులకు అధిక దిగుబడినిచ్చే వంగడాల పంపిణీపై ప్రభుత్వం దృష్టిసారించింది. వంద శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ పథకం అమలుకు రాష్ట్రంలో 8 జిల్లాలను ఎంపిక చేయగా... మంగళవారం నిర్వహించే 'రైతునేస్తం' కార్యక్రమంలో విత్తనాల పంపిణీకి శ్రీకారం చుట్టనుంది. 45 వేల ఎకరాలకు సరిపడా 38 వేల క్వింటాళ్ల మేర లేపాక్షి, గిర్నార్- 5, జీజేజీ- 32 వేరుశనగ వంగడాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. అయితే, రైతులను ఎంపిక చేసే బాధ్యత రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవో)కు అప్పగించింది. జాతీయ తినదగిన నూనె గింజల అభివృద్ధి మిషన్ (నేషనల్ మిషన్ ఆన్ ఇడబుల్ ఆయిల్స్) పథకాన్ని... కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అమలుచేస్తున్న విషయం విదితమే. పామాయిల్, వేరుశనగ, నువ్వులు, సోయాబీన్, పొద్దుతిరుగుడు, ఆవాలు... తదితర తినదగిన నూనె గింజల ఉత్పత్తి పెంచేందుకు కృషిచేస్తోంది. అయితే ఈ నూనె గింజల్లో కూడా... అధిక దిగుబడినిచ్చే వంగడాలను ప్రభుత్వం ఎంచుకొంది. కాగా ఈ పథకంలో పంపిణీచేసే వేరుశనగ విత్తనాల్లో... సంప్రదాయ విత్తనాలు కాకుండా ఇటీవలే ఉత్పత్తిచేసిన వెరైటీలను ఎంపికచేశారు. ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు ఉత్పత్తి చేసిన 'గిర్నార్- 5', ఏపీలోని అనంతపురం జిల్లాలో 'డ్రైలాండ్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్' (డార్స్) శాస్త్రవేత్తలు ఉత్పత్తి చేసిన 'కదిరి లేపాక్షి', గుజరాత్‌లోని జునాగడ్ వ్యవసాయ వర్సిటీ ఉత్పత్తి చేసిన జీజేజీ- 32 విత్తనాలను... రైతులకు సరఫరా చేయాలని నిర్ణయించారు.

యాసంగికి 38 వేల క్వింటాళ్లు

ఈ యాసంగి(2025- 26) సీజన్‌కు గాను రైతులకు పంపిణీ చేయటానికి ప్రభుత్వం 38,434 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను అందుబాటులో ఉంచింది. ఈ విత్తనాలు 45,350 ఎకరాలకు సరిపోతాయి. వేరుశనగ ఎక్కువగా సాగుచేసే... మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణపేట, వనపర్తి, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ జిల్లాలను ఈ పథకంలో ఎంపికచేశారు. కాగా, ఈవిత్తన సబ్సిడీకి ప్రభుత్వం రూ. 46.15 కోట్లు వెచ్చిస్తుండటం గమనార్హం.

50-60 శాతం అధిక దిగుబడి

సంప్రదాయ వేరుశనగ వంగడాలతో పోలిస్తే కదిరి లేపాక్షి, గిర్నాల్- 5, జీజేజీ- 32 వంగడాలు సాగుచేస్తే 50 శాతం నుంచి 60 శాతం అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నూనెలో కూడా 80 శాతం ఓలియోక్ ఆమ్లం ఉండటంతో ఎక్కువ రోజులు నిల్వచేసుకునే అవకాశం ఉంటుందని, మంచి ధర వస్తుందని తుమ్మల వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలుచేస్తున్న జాతీయ నూనెగింజల పథకంలో ఈఏడాది రూ. 67 కోట్లు ఖర్చుచేసి నూనె గింజల విస్తీర్ణం పెంచుతున్నట్లు తెలిపారు.

- తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ మంత్రి

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.